# జనబలం

ప్రజలే ప్రభువులు

నవంబర్ 2023 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-











# OPSతో పెను ప్రమాదం..

## భారతదేశ ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకు ఢిల్లీ డిక్లరేషన్










హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన్‌జ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 'అక్షర' కార్యక్రమంలో 'ఓటు - ఇది మన హక్కు' అంశంపై విద్యార్థుల్లో అవగాహన కలిగిస్తున్న ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్



ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 25 సంచిక 11

నవంబర్ 2023

సంపాదకవర్గం

**బండారు రామ్మోహనరావు**

**శిరమని నరేష్**

వర్కింగ్ ఎడిటర్

**దూసనపూడి సోమసుందర్**


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# పని - జీవితం!

సంపాదకీయం

భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థికశక్తిగా ఆవిర్భవిస్తున్నదని మన పాలకులు తరచూ అనడం వింటూ ఉంటాం! మనదేశం త్వరలో ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందుతుందని కూడా మన నేతలు పదే పదే అంటూ ఉంటారు. అంతర్జాతీయ వేదికలపై మనకు లభిస్తున్న కీలకస్థానం గురించి కూడా వారు యువతరాన్ని ఉర్రూతలూగించే విధంగా చెబుతుంటారు. మనం దాదాపు విశ్వగురు స్థానానికి చేరుకున్నామని ప్రధానమంత్రి తరచూ అంటూ ఉంటారు.పిల్లల్ని ఉత్సాహపరచడానికి చెప్పడం వరకూ పర్వాలేదు. కానీ వాటినే నిజమని నమ్మి పదే పదే అతిశయోక్తులు చెప్పడం దేశానికి మేలు చేయదు.

ఏడాదికి ఒక దేశం చొప్పున రొటేషన్ పై జి 20 బృందానికి అధ్యక్షస్థానం లభిస్తూ ఉంటుంది. మనదేశం వంతు వచ్చేసరికి మున్నెన్నడూ లేని ప్రచారార్భాటం జరగడం చూశాం. పాలకుల ప్రచారం మితిమీరుతూ ఉంటుందన్న విషయం జి 20 సందర్భంలో కూడా చూశాం. ఇందుకు విరుగుడుగా ప్రతిపక్ష రాజకీయ పక్షాల వ్యతిరేక ప్రచారం కూడా అదేస్థాయిలో జరుగుతూ ఉంటుంది. మన ప్రజాస్వామ్య వ్యవస్థలో జరిగే బహిరంగచర్చలో ఇలాంటి ప్రచార ఆర్భాటాలకు మనం అలవాటు పడిపోయాం. కానీ అంతర్జాతీయ సంస్థలు, వేదికలు, రేటింగ్ సంస్థలు అంటూ కొన్ని ఉన్నాయి. అందులో విశ్వసనీయత కలిగినవి చాలా ఉన్నాయి. సమాచార సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు అందుబాటులోకి వచ్చాక స్వతంత్ర సమాచారం పొందటం సులభంగా ఉంది. ఆర్థిక వ్యవస్థతో పాటు సామాజిక జీవితంలోని విభిన్నకోణాల గురించిన పలు అధ్యయనాల సమాచారం కుప్ప తెప్పలుగా వచ్చి పడుతూనే ఉంది.

దేశంలో నిరుద్యోగిత మున్నెన్నడూ లేనంత ఎక్కువగా ఉందన్న గణాంకాలు చూశాం! కరోనా మహమ్మారి విరుచుకుపడి ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన కాలంలో నిరుద్యోగం దాదాపు **18** శాతానికి చేరిన విషయం తెలిసిందే. తాజా గణాంకాల మేరకు దేశంలో నిరుద్యోగం **7.3** శాతం ఉంది. మానవ వనరుల పెట్టుబడి గురించిన **130** దేశాల జాబితాలో భారత్ **103** వ స్థానంలో నిలిచింది. మానవాభివృద్ధి సూచికలో **150** దేశాల జాబితాలో **132**వ స్థానంలో ఉంది. ఆకలి సూచికలో **125** దేశాల జాబితాలో **111** వ స్థానంలో ఉంది. ఆవాసయోగ్యమైన దేశాల **125** జాబితాలో భారత్ **112** వ స్థానంలో ఉంది. విద్యారంగ నాణ్యత గురించిన **190** దేశాల జాబితాలో **145** వ స్థానంలో ఉంది. లింగ వ్యత్యాసాల గురించిన **150** దేశాల జాబితాలో **135**వ స్థానంలో ఉంది. అసమానతల తొలగింపు ప్రయత్నాల నిబద్ధత గురించిన **150** దేశాల జాబితాలో **123**వ స్థానంలో ఉంది.

ప్రజాస్వామ్యం అమలు తీరుకు సంబంధించి **112** దేశాల జాబితాలో **93**వ స్థానంలో భారత్ ఉంది. చట్టబద్ధ పాలన అమలు తీరు విషయంలో **113** దేశాల జాబితాలో **68** వ స్థానంలో ఉంది. పత్రికా స్వేచ్ఛా సూచికలో **180** దేశాల జాబితాలో **152** వ స్థానంలో నిలిచింది. తరచుగా ప్రభుత్వాధినేతలు ఇలాంటి గణాంకాలను నిరాకరిస్తూ ఉంటారు. మన పాలకులు ఒక అడుగు ముందుకు వేసి ఈమధ్య లెక్కలు ఇవ్వడానికే నిరాకరిస్తున్నారు.

భారతీయ సమాజంలో అత్యంత గౌరవమూ, యువతపై ప్రభావమూ కలిగిన ఇన్ఫోటెక్ పెద్దాయన ఒకరు ఈ మధ్య ఒక ఇంటర్వ్యూలో "యువత వారానికి **70** గంటలు పనిచేస్తే భారత్ ప్రపంచంలోనే ఒక బలమైన ఆర్థికశక్తిగా ఆవిర్భవిస్తుందని " అన్నారు. యువత పాశ్చాత్య ధోరణులకు అలవాటు పడి శ్రమించే తత్వాన్ని విడనాడుతున్నారని ఆయన వ్యాఖ్య చేశారు. అగ్రదేశాలతో పోటీపడేలా ఉత్పాదకత పెరగాలంటే ఎక్కువగంటలు పనిచేయాలని, విజయాలు సాధించాలంటే కష్టపడాలని ఆయన ఆ ఇంటర్వ్యూలో చెప్పారు. ఆయనకు గల సామాజిక గౌరవం కారణంగా ఆయన మాటలకు అనూహ్యమైన ప్రాచుర్యం వచ్చింది. దాంతో పనిగంటల గురించిన చర్చ పెద్ద ఎత్తున మొదలయ్యింది. అర్ధశాస్త్రవేత్తల నిర్వచనాలు, అంతర్జాతీయ కార్మికసంస్థ నిర్ణయాలు, కార్మికచట్టాలు, పరిశోధకుల నిర్ధారణలు మరోసారి ముందుకు వచ్చాయి.

మనదేశంలో శ్రామికశక్తి ప్రస్తుతం సగటున వారానికి **47.7** గంటలు పని చేస్తోంది. చైనాలో **46.1**, సింగపూర్‌లో **42.6**, జపాన్‌లో **36.6** గంటల పనివారం అమలులో ఉంది. జర్మనీలో **36.6**, యు.ఎస్. లో **36.4**, యు.కే. లో **35.9** గంటల పనివారం అమల్లో ఉంది. భారత్‌లో ఆరురోజుల వారంలో **48** గంటల పని ఉండాలని పూర్వపు చట్టాలు నిర్దేశిస్తున్నాయి. కానీ ఆచరణలో అత్యధిక సంఖ్యాక శ్రామికులు వారంలో **55** గంటల నుంచి **60** గంటలు పనిచేస్తున్నారని పలు అధ్యయనాలు వెల్లడించాయి. కొన్ని పాత కార్మికచట్టాల రద్దు అనంతరం కొత్తగా అమల్లోకి వచ్చిన లేబర్ కోడ్ లలో రెండుషిఫ్టుల పనివిధానం అమలు చేయాలని, పనిగంటలను ఎనిమిది నుండి **12** గంటలకు పెంచాలని, దీనిపై యాజమాన్యాలు, కార్మికసంఘాలు చర్చించు కొని ఒక నిర్ణయానికి రావాలన్న ఒక నిర్దేశం ఉంది. దానిపై ఉద్యోగ, కార్మికవర్గాలు ఇప్పటికే తమ నిరసనను తెలుపుతూ ఉద్యమిస్తున్నాయి.

సరిగ్గా అదే సమయంలో యువత వారానికి **70** గంటలపని చేయాలన్న పెద్దాయన వాదన చర్చకు వచ్చింది. "పని - జీవితం మధ్య సమతుల్యత ఉండాలని" అంతర్జాతీయ కార్మికసంస్థ ఆమోదించిన ఒక సూత్రం. శ్రామికుడు ఎన్నిగంటలు పనిచేయాలి, తాను కోల్పోయినశక్తిని తిరిగి పొందడానికి ఎంత సమయం విశ్రాంతి తీసుకోవాలి, పిల్లల్ని కనడానిక, కుటుంబాన్ని పోషించి పెంచడానికి ఎంత సమయం వెచ్చించాలి వంటి అంశాలపై శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు చేసి కొన్ని ప్రమాణాలను నిర్ధారించారు. **24** గంటల సమయాన్ని మూడు భాగాలు చేసి వేర్వేరు పనులు, బాధ్యతల కోసం ఒక్కొక్క భాగాన్ని కేటాయించారు. అందుకే ఎనిమిది గంటల పనిదినం ఒక అంతర్జాతీయ నియమం అయ్యింది.

పనిగంటల విషయంలో మహిళలకు సౌలభ్యం కల్పించాలన్న భావనతో కొన్ని సానుకూల నిర్ణయాలు తీసుకున్నా ఇప్పటికీ లింగ వ్యత్యాసాలు మన దేశంలో తీవ్రంగా కొనసాగుతున్నాయి. ఆధునిక సాంకేతిక ఆవిష్కరణలు వచ్చి ఆటోమేషన్ వచ్చాక అభివృద్ధికి, ఎక్కువ గంటల పనికి గల సంబంధం లేదని రుజువు అయ్యింది. నైపుణ్యం ముఖ్యం అయ్యింది. పనిగంటల పెంపుదలతో ఉత్పాదకత పెరగడం లేదు సరికదా కొన్ని విపర్యవసానాలు తలెత్తుతున్నాయని కూడా తేలింది. పనివారం, పనిగంటల పొడిగింపుతో శ్రామికుల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని అనేక అధ్యయనాలు అంటున్నాయి. శ్రామికులని సైనికదళాల మాదిరిగా జట్టుకట్టి పనిచేయిస్తే శ్రామికునికి తనపని విసుగు పుట్టించేదిగా తయారవుతుందని, బానిసల మాదిరి పనిచేయించే పద్ధతులు విడనాడాలని ఆర్గనైజేషనల్ సైకాలజిస్టులు సలహా ఇస్తున్నారు.

శ్రామికులకు పని ఆకర్షణీయంగా ఉండాలంటే పనిగంటలు వెసులుబాటుగా ఉండాలని, వారికి తగిన విశ్రాంతి , వినోదమూ, ఉండాలని , శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వాలని కూడా వారు సూచిస్తున్నారు. భారతీయ వాతావరణంలో రెండు షిఫ్టులలో, వారానికి **70** గంటలపని సాధ్యం కాదని, మన ఆరోగ్య సూచికలు అంతటి పనికి తగినట్లుగా లేవని, పలువురు నిపుణులు అంటున్నారు. కరోనా అనంతరం గుండె జబ్బులు, అలసట, నిద్రలేమి, వంటి రకరకాల ఆరోగ్య సమస్యలు పెరిగాయన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే శ్రామికుల ఆరోగ్యభద్రత మనదేశంలో అరకొరగా తయారయ్యింది. పని గంటల పెంపుదల ద్వారా శ్రామికుల ఆరోగ్యాన్ని మరింత పణంగా పెడితే రానున్న తరాల శ్రామికులు మరింత బలహీనంగా తయారవుతారు.

అసలే నిరుద్యోగం ఎక్కువగా ఉన్న మనదేశంలో పనిగంటల పెంపుదల కొత్త శ్రామికులకు అవకాశాలను తగ్గిస్తుంది. మనదేశంలో గత తొమ్మిదిన్నరేళ్లలో దాదాపు **14** కోట్ల మంది ఉపాధి అవకాశాల్ని కోల్పోయిన వాస్తవం కళ్ళముందు కనిపిస్తోంది. "పని - జీవితం" మధ్య సమతుల్యత ఉండాలన్న అంతర్జాతీయ కార్మికసంస్థ నియమాన్ని సడలించే ప్రయత్నం ఎంత మాత్రమూ సమర్ధనీయం కాదు. ముఖ్యంగా మనదేశంలో అలాంటి చర్య శ్రామికశక్తిని నిర్వీర్యం చేస్తుంది. మనిషి జీవితంలో పని ఒక భాగమే తప్ప పని మాత్రమే మొత్తం జీవితం కాజాలదు.

డి. సోమ సుందర్

# OPS తో పెను ప్రమాదం..

## భారతదేశ ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకు ఢిల్లీ డిక్లరేషన్




భారతదేశానికి ఈవేళ అత్యంత ప్రాధాన్యాంశం ఆర్థికాభివృద్ధిని కాపాడుకోవటమని, ముఖ్యంగా పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) నుంచి పెను ప్రమాదం దేశానికి పొంచి ఉందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు.

దేశ ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకు తీసుకోవాల్సిన విధాన చర్యలపై నవంబర్ 4న న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఎఫ్‌డీఆర్ ఆధ్వర్యంలో 'A Viable Framework For Fiscal Prudence' పై ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్ జాతీయ రౌండ్‌టేబుల్ సదస్సు జరిగింది. ఇందులో సుప్రసిద్ధ విధానరూపకర్తలు, ఆర్థిక వ్యవహారాల నిపుణులు, రాజకీయ నేతలు పాల్గొన్నారు. లోతైన చర్చ అనంతరం ఆమోదించిన పరిష్కారాలతో ఢిల్లీ డిక్లరేషన్‌ని జేపీ, ఇతర నేతలు మీడియా సమావేశంలో విడుదల చేశారు.

ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ, వచ్చే పాతికేళ్లలో భారత్‌కి ఆర్థిక రంగంలో వేగంగా ఎదిగే అవకాశాలున్నాయని, అంతర్జాతీయ పరిస్థితులతోపాటు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆర్థికంగా కొన్ని సరైన విధానాలను కొనసాగించటం ఇందుకు కారణమన్నారు. అయితే భారత్‌కి లభించిన ఈ అరుదైన అవకాశం సద్వినియోగం కావాలంటే సరైన ద్రవ్య విధానం, ఆర్థిక నిర్వహణ అవసరమన్నారు. సుస్థిర ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వోద్యోగుల పాత పెన్షన్ విధానం అతి పెద్ద ప్రమాదం కానుందన్నారు.

వాజపేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో అన్ని పక్షాల అంగీకారంతో ఉద్యోగులు, ప్రభుత్వం పెన్షన్ కోసం ప్రతి నెలా కొంత కంట్రిబ్యూట్ చేసే రీతిలో నూతన పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్) తీసుకొచ్చారని జేపీ అన్నారు. తరువాత ప్రధాని మన్మోహన్ సింగ్ దాన్ని వేగంగా అమలు చేశారన్నారు.

ఇటీవల ఓటు బ్యాంకు రాజకీయాలతో కొన్ని రాష్ట్రాలు, పార్టీలు మళ్లీ పాత పెన్షన్ విధానం వైపు తిరోగమిస్తున్నాయని, ఈవేళ ఒక్క రూపాయి బడ్జెట్‌లో కేటాయించకుండా, జీతాలు పెరిగినప్పుడల్లా భారీగా పెరిగిపోతూ భవిష్యత్ తరాల మీద విపరీత భారం వేసే ఓపీఎస్ వల్ల దేశం దివాలా తీయటం ఖాయమని గణాంకాలతో సహా తెలిపారు.

ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో పన్ను ఆదాయం కంటే జీతాలు, పెన్షన్లు, వడ్డీలు ఎక్కువగా ఉన్నాయని, అధిక వడ్డీకి అప్పులు తెచ్చి చెల్లింపులు చేస్తున్నారని జేపీ తెలిపారు. ప్రభుత్వాలు ప్రజలకు అందించాల్సిన చట్టబద్ధపాలన, ఆరోగ్యం, విద్య, మౌలిక వసతులు వంటి పనులు సవ్యంగా చేయకుండా డబ్బంతా ఆ రీతిలో ఖర్చవుతోందన్నారు. భవిష్యత్తులో అప్పు పుట్టటం కూడా అసాధ్యమవుతుందన్నారు. ఇప్పటికే ఆర్థికంగా ఒత్తిడి ఎదుర్కొంటున్న రాష్ట్రాలు, యూనియన్ ప్రభుత్వాలు రాబోయే కాలంలో అసలు పెన్షన్లే ఇవ్వలేని పరిస్థితి వస్తుందన్నారు. అప్పులు-జీడీపీ నిష్పత్తి ఇప్పటికే రాష్ట్రాల్లో 28.7%, జాతీయ స్థాయిలో 57%గా ఉందని, ఇది ఎఫ్ఆర్‌బీఎం నిబంధన ఉల్లంఘన అన్నారు.

2004 నుంచి అమలవుతున్న కొత్త పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్) నుంచి పాత పెన్షన్ విధానానికి తిరోగమిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 2030 కల్లా అప్పులు, జీఎస్‌డీపీ నిష్పత్తి 53 శాతానికి పెరుగుతుందని, 2040కి 77 శాతానికి, 2050కి 107 శాతానికి, 2100 నాటికి 211 శాతానికి పెరుగుతుందన్నారు. అప్పుడు పెన్షన్ల సంగతి అలా ఉంచి ప్రభుత్వోద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

**ఏపీ తలసరి ఆదాయం రూ.1,92,587..**

**ప్రభుత్వోద్యోగి సగటు పెన్షన్ రూ.5,34,000**

పనిచేసేవారిలో ప్రభుత్వోద్యోగులు కేవలం 3 శాతమని, కానీ వారికి మాత్రమే వర్తించే పాత పెన్షన్ విధానం వల్ల మిగిలిన 97 శాతం మంది, భావి తరాలు, మొత్తం దేశానికి వినాశకర పరిస్థితులు ఏర్పడతాయని జేపీ హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక వ్యక్తి తలసరి ఆదాయం రూ. 1,92,587 ఉంటే, ప్రభుత్వోద్యోగుల తలసరి పింఛను రూ. 5,34,000 ఉందన్నారు. అమెరికాలో తలసరి ఆదాయం 70,249 డాలర్లుంటే, పెన్షన్ 16,920 డాలర్లు అన్నారు. కొత్త పెన్షన్ విధానంలో ఉద్యోగుల పింఛనుకు ప్రత్యామ్నాయ పద్ధతులున్నాయని, పెన్షన్ నిధికి ఎప్పటి డబ్బు అప్పుడు జమ చేస్తున్నంత వరకూ వాటిపై చర్చించి ఏకాభిప్రాయానికి రావొచ్చన్నారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు గ్యారెంటీడ్ పెన్షన్ విధానం (జీపీఎస్) రూపంలో కొంత దృష్టి సారించాయన్నారు. అమెరికాలో ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా 100% ప్రజలకూ చట్టబద్ధంగా పెన్షన్లు ఇవ్వటానికి జీడీపీలో 15% దాకా ఖర్చవుతోందని, అదే భారత్‌లో కేవలం 3% ఉన్న ప్రభుత్వోద్యోగులకు మాత్రమే అమలయ్యే చట్టబద్ధ పెన్షన్లకి జీడీపీలో 18% వరకూ ఖర్చవుతోందన్నారు. కొత్త పెన్షన్ విధానం ద్వారా క్రమంగా కొన్నేళ్లలో అయినా ప్రజలందరికీ పెన్షన్లు అందించే ఏర్పాటు చేయాలని, దేశ ఆర్థిక భవిష్యత్తును పరిరక్షించేందుకు సమగ్ర విధానం రూపకల్పన ఈవేళ అత్యవసరమన్నారు.

**దేశానికి, భవిష్యత్ తరాలకు ఎదురవుతున్న ఓపీఎస్ తక్షణ ప్రమాదం దృష్ట్యా రౌండ్ టేబుల్ ఈ దిగువ అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చిందని జేపీ తెలిపారు:**

1. ప్రస్తుతమున్న కాంట్రిబ్యూటరీ జాతీయ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్)ని యథాతథంగా కొనసాగించాలి. వాజపేయి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కొత్త పథకాన్ని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం సమర్థంగా అమలు చేసింది.

2. పెరుగుతున్న ధరలు, ఇతర జీవన వ్యయాలకనుగుణంగా, ఒక స్థాయికి మించి పెన్షన్ ఆదాయం పడిపోకుండా గ్యారంటీడ్ పెన్షన్ స్కీమ్‌ని అమలు చేయటం సమంజసమేగానీ, అందుకు కేటాయింపులు ప్రస్తుత బడ్జెట్‌లలోనే చేయాలి.

3. రాష్ట్రాలు మొండిగా పాత పెన్షన్ విధానానికి మళ్లితే, భవిష్యత్ తరాల మీద భారం వేయకుండా అప్పటి డబ్బు విలువ ప్రకారం లెక్కించి అవసరమైన నిధిని ఇప్పుడే ఏర్పాటు చేయాలి.

4. రాష్ట్రాలు ఈవేళ బడ్జెట్‌లో కేటాయించకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసిన సందర్భాల్లో ఆ డబ్బును ఆయా రాష్ట్రాలు వాయిదా వేసిన బకాయిలుగా పరిగణించి ఎఫ్ఆర్‌బీఎం చట్టం కింద రుణపరిమితుల్ని అమలు చేయాలి.

కేంద్ర మాజీ ఎన్నికల కమిషనర్ టీఎస్ కృష్ణమూర్తి మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు కేవలం ప్రభుత్వోద్యోగులకే కాకుండా అన్ని వర్గాలకూ సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాల్సుందన్నారు.

# ఓపీఎస్ దేశ సమస్య.. పార్టీలు, ఎన్నికల సమస్య కాదు

రాజకీయ పక్షాలు, ప్రభుత్వాలు ఎన్నికల గండం నుంచి గట్టెక్కటానికి ఉద్యోగ సంఘాలు, సంఘటిత వర్గాలకు భయపడిపోతూ దేశ ప్రయోజనాలని విస్మరిస్తున్నాయని జేపీ అన్నారు. ఓపీఎస్ దేశ సమస్య తప్ప, పార్టీలు, ఎన్నికల సమస్య కాదన్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా ప్రభుత్వోద్యోగులకు పెన్షన్ చెల్లించటానికి ఇప్పుడు డబ్బులు కేటాయించకుండా భవిష్యత్ తరాలు పన్నుల రూపంలో చెల్లించేలా పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) ద్వారా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, ప్రభుత్వం ప్రతి నెలా పెన్షన్ నిధిలో కొంత జమ చేసి ఆ డబ్బును పెంచుతూ దాన్నుంచి రిటైరయ్యాక పింఛను తీసుకునే కొత్త పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్)తో ప్రజలపై పన్నుల భారం ఉండదన్నారు. రాజకీయంగా ఓట్ల కొనుగోలు, అప్పులు చేసి మరీ తాత్కాలిక తాయిలాల పథకాలతో మన దేశ ప్రజాస్వామ్యంలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని, పాత పెన్షన్ విధానంతో వాటన్నిటినీ మించి పెను సంక్షోభమన్నారు. ఉద్యోగుల నిజమైన సమస్యను గుర్తించటంతోపాటు వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే ఏర్పాటు చేయాలని, అదే సమయంలో దేశం, భవిష్యత్తు తరాలు నాశనం కాకుండా కాపాడుకోవాలని, ఇందుకు పార్టీలకతీతంగా కృషి చేయాలన్నారు.

**ఓపీఎస్‌పై మరిన్ని వివరాలు తెలుసుకోవటం, తిరస్కరించటం కోసం**

https://www.refuseops.in

**వెబ్‌సైట్‌ను సందర్శించాలని, తెలిసినవారందరికీ సమాచారం షేర్ చేయాలని జేపీ విజ్ఞప్తి చేశారు.**

అప్పుల వల్ల రాజస్థాన్, పంజాబ్, వంటి రాష్ట్రాలు ఇప్పటికే తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని 14వ ఆర్థిక సంఘం సభ్యుడు డాక్టర్ ఎం. గోవిందరావు తెలిపారు. ఓపీఎస్‌కు వ్యతిరేకంగా ఏకాభిప్రాయం అవసరమన్నారు.

దేశ ఆర్థిక సుస్థిరతను, భవిష్యత్తును, పరపతిని, భావి తరాలకు ఎదిగే అవకాశాలని పరిరక్షించేందుకు పార్టీలకతీతంగా నిర్వహించిన ఈ జాతీయ రౌండ్ టేబుల్ సదస్సులో కొత్త పెన్షన్ విధానం తీసుకురావటంలో కీలక పాత్ర వహించిన యూనియన్ మాజీ ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పృధ్విరాజ్ చవాన్, యూనియన్ మాజీ మంత్రి మనీష్ తివారి, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ అహ్లువాలియా, సీనియర్ రీసెర్చి ఫెలో డాక్టర్ అజయ్ షా, గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ అజిత్ రనడే, మాజీ ఈసీఐ అశోక్ లావాసా, 13వ ఆర్థిక సంఘం సభ్యుడు ప్రొఫెసర్ అతుల్ శర్మ, సెంటర్ ఫర్ మల్టీలెవెల్ ఫెడరలిజం చైర్మన్ డాక్టర్ బల్వీర్ అరోరా, ఆర్‌బీఐ ద్రవ్య విధాన విభాగం మాజీ అధిపతి డాక్టర్ బరేంద్ర కె. భోయ్, సీఎంఎస్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఎన్.భాస్కరరావు, సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ దేవశిష్ దేశ్‌పాండే, సెంటర్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్ ప్రోగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ లవీష్ భండారి, ఇండియన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ చైర్ పర్సన్, సహ వ్యవస్థాపకుడు లూయిా మిరండా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ముఖేష్ ఆనంద్, ఎకనామిక్ టైమ్స్ కన్సల్టింగ్ ఎడిటర్ మైథిలి భుస్నూర్‌మఠ్, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ పులిన్ బి. నాయక్, ఫోరం ఆన్ సోషల్ అండ్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు డాక్టర్ పి. పుల్లారావు, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ కర్ణాటక వైస్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ గౌడ, రిజర్వ్‌బ్యాంక్ మాజీ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ రాకేష్ మోహన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రేణుకా సానె, వీవీ గిరి నేషనల్ లేబర్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ ఫెలో సుభాష్ చంద్ర గార్గ్, డాక్టర్ రూమా ఘోష్, ది వైర్ సహ వ్యవస్థాపకుడు ఎంకె వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సుస్థిరత పరిరక్షణకి కార్యాచరణ సమయం

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మిజోరం.. అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నవంబరులో జరగనున్నాయి. పార్టీలు హామీలతో ఓటర్లని హోరెత్తిస్తున్నాయి. వీటిలో కొన్ని హేతుబద్ధమైనవి ఉన్నాయి, ఇంకొన్ని హాస్యాస్పదమైనవి, మరికొన్ని ఇంత మూర్ఖత్వమా అనిపించేవి, ఇంకొన్నయితే ఏమాత్రం అనుమానం అక్కర్లేకుండా ప్రమాదకరమైనవి ఉన్నాయి. తాత్కాలిక వ్యక్తిగత లబ్ధి కలిగించే ఇటువంటి హామీలనే ఈ ఏడాది మొదట్లో కర్ణాటకలో కూడా ఇచ్చారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ, ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, విద్యుత్, ప్రయాణం, వృద్ధాప్య, సామాజిక పెన్షన్లను పెంచటం, మహిళలు, రైతులు, స్కూలు విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు.. ఇలా జాబితా కొనసాగుతూనే ఉంటుంది.

మధ్యప్రదేశ్‌లో అయితే, ఒక పార్టీ రాష్ట్రానికి సొంత ఐపీఎల్ జట్టును కూడా హామీ ఇచ్చింది! అవన్నీ ఒక ఎత్తయితే, చాలా రాష్ట్రాల్లో అత్యంత ప్రమాదకరమైన హామీని కొన్ని పార్టీలు ఇచ్చాయి. ఈవేళ బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా చూపకుండా, ప్రతి అయిదేళ్లకోసారి జీతం పెరిగినప్పుడల్లా భారీగా, అమలు అసాధ్యమైన రీతిలో పెరుగుతుండే ప్రభుత్వోద్యోగుల పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) తిరిగి తీసుకొస్తామని ప్రకటించాయి. మన జనాభాలో పనిచేసేవారిలో ప్రభుత్వోద్యోగ్యుల సంఖ్య కేవలం 3%. కానీ వీరికి మాత్రమే వర్తించే ఓపీఎస్ అమలు చేస్తే, ఆర్థిక వ్యవస్థ దివాలా తీయటం, వచ్చే తరాల భవిష్యత్తు అంధకారమవటం ఖాయం.

ఎన్నికల ప్రచారంలో భాగంగా వివిధ రకాల వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమ పథకాలను ప్రతిపాదించి ప్రజల మద్దతు కోరే బాధ్యత, హక్కు పార్టీలకు ఉంటాయి. కానీ ఎన్నికలు ఈవేళ పూర్తిగా వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమం పథకాల స్థాయికి పడిపోయి, అసలు ప్రభుత్వం ఎందుకోసం ఉందో ఆ మౌలిక బాధ్యతలు చర్చలో లేకుండా పోయాయి.

ప్రజలందరికీ ఉమ్మడిగా ఉపయోగపడే మౌలిక వసతులు, చట్టబద్ధపాలన, కనీస సౌకర్యాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థను పెంచేందుకు చర్యలు.. ఇవన్నీ ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత.

అసలు ప్రభుత్వం ఆ లక్ష్యాలని మొక్కుబడిగా తప్ప పట్టించుకోకుండా, తాత్కాలిక సంక్షేమ పథకాల చుట్టూనే ఎన్నికల్ని తిప్పుతున్నామంటే దేశం ప్రమాదంలో ఉంది.

జవహర్‌లాల్ నెహ్రూ చాలాకాలం క్రితమే మనల్ని మందలించారు: “భారతదేశం గెలిస్తే, ఓడేదెవరు; భారతదేశమే ఓడిపోతే, ఇక గెలిచేదెవరు?”.




కానీ ఈవేళ చాలాపార్టీలు భారతదేశం ఓడిపోయినా తమకు లెక్కలేదని మనకు స్పష్టమైన సంకేతాన్నిస్తున్నాయి; ఏదోక రకంగా, అన్ని రకాలుగా అధికారమే వారి పరమావధి!

ఎన్నికల సంఘం (ఈసీ) ఏం చేస్తోంది? అని చాలామంది ప్రజలు అమాయకంగా ఆవేశపడుతుంటారు, సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటుందని ఆశపడుతుంటారు. సుప్రీంకోర్టు కూడా ఈ అంశం మీద ఆమధ్య ఒక పిటిషన్‌ను స్వీకరించింది. కానీ ఎన్నికల మేనిఫెస్టోల్లో ఈసీ, కోర్టుల పాత్ర ఉండదు.

ప్రభుత్వానికుండే రాజ్యాంగబద్ధ విధులతో సంబంధంలేకుండా అసంబద్ధంగా ఇచ్చే హామీల విషయంలో మాత్రమే ఎన్నికల సంఘం లేదా కోర్టులకు కొంత పాత్ర ఉంటుంది. కానీ అటువంటి సందర్భాల్లో కూడా తమకున్న అధికారాన్ని వినియోగించటంలో అవి ఇప్పటిదాకా విఫలమయ్యాయి. ఉదాహరణకి, తమను ఎన్నుకుంటే ఓటర్లకు కలర్ టీవీలను ఇస్తామని 2006లో డీఎంకే హామీ ఇచ్చింది. కలర్ టీవీల్ని పంచటం రాజ్యాంగపరంగా ప్రభుత్వం చేయాల్సిన పనుల్లో భాగం కాదు. కాబట్టి జోక్యం చేసుకోండి, అలాంటి హామీల్ని నిలువరించండి అని అప్పుడు నేను ఈసీని కలిసి







కోరినా స్పందించలేదు.

మీరు టీవీల పందేరానికి అనుమతిస్తే, ప్రతి కుటుంబానికి 10 గ్రాముల బంగారం ఎందుకు పంచకూడదు? నెలనెలా అయిదు బాటిళ్ల మద్యం ఇంటింటికీ ఎందుకు పంపిణీ చేయకూడదు? ఎన్నికల హామీల విషయంలో ఒక గీత దాటకూడదన్నది సుస్పష్టం; ప్రభుత్వానికి రాజ్యాంగం నిర్దేశించిన పాత్రే అందులో తర్కం. కానీ ఈ కొద్దిపాటి పరిధిలో కూడా తనకున్న పరిమిత అధికారాన్ని వినియోగించటంలో ఈసీ, విజ్ఞతతో దిశానిర్దేశం చేయటంలో కోర్టులు విఫలమవటం విచారకరం.

తాత్కాలిక సంక్షేమ పథకాలు అసలు వద్దనటం సరి కాదు. ఓవంక పేదరికం బాధను తగ్గించటానికి, మరోవంక తమ ప్రయోజనాలను పట్టించుకుంటారు, తమ గొంతుకు విలువ ఉంది అనే ఆశ, ఆత్మవిశ్వాసం సమాజంలో అన్ని వర్గాలకీ కల్పించటానికి ఒక ప్రజాస్వామ్యంలో హేతుబద్ధ సంక్షేమ పథకాలు అవసరం. వాటిని న్యాయమైన ఉపకరణాలుగా మనం గుర్తించాలి.

కానీ చైనా సామెత చెప్పినట్లు, పేదవానికి కేవలం ఉచిత భోజనం కాకుండా, చేపలు ఎలా పట్టాలో నేర్పించి అందుకు తగ్గ సాధనాలు ఇవ్వాలి.

తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమ పథకాలకి, దీర్ఘకాల ఆదాయాలు, ఆర్థిక ప్రగతికి మధ్య సమతూకాన్ని పునరుద్ధరించేందుకు మనం చేతుల్లో ఉన్నదేమిటి? మొదటిది, తాత్కాలిక సంక్షేమ పథకాలు గనక స్పష్టంగా ప్రభుత్వ రాజ్యాంగ విధుల పరిధిలోనివి కానప్పుడు, అటువంటి హామీలు, ధోరణులపై కచ్చితంగా నిషేధం విధించాలి. ఉదాహరణకు ఉచితంగా కలర్ టీవీలు, బంగారం, మద్యం వంటివి.

రెండోది, పేదరికం బాధ నుంచి ఉపశమనం కలిగించేందుకు అమలు చేసే మిగిలిన తాత్కాలిక పథకాలు మోయలేని అప్పు రూపంలో వచ్చేతరం మీద అన్యాయమైన భారం కాకుండా ద్రవ్య నిబంధనలుండాలి.

జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు, తాత్కాలిక సంక్షేమాలు సహా ప్రభుత్వ రోజువారీ ఖర్చుకి అప్పు చేయకూడదు, ప్రభుత్వ సొంత ఆదాయం నుంచే ఆ ఖర్చు చేయాలి అనేది ప్రామాణిక సూత్రంగా ఉండాలి. అంటే రెవెన్యూ లోటు అనేది ఉండకూడదు.

అప్పు తెచ్చిన నిధులు భవిష్యత్తు అభివృద్ధికి, వచ్చే తరం ఆదాయాల్ని పెంపొందించేందుకు ఉపయోగపడాలి. అంటే, ఆస్తులు పెంచే పెట్టుబడికి, మౌలిక వసతులకి మాత్రమే వాటిని వినియోగించాలి. ఎట్టి పరిస్థితుల్లో రోజువారీ ఖర్చులకు వాడకూడదు. ఈ హద్దుల్లోపల,తమకు నచ్చిన ఏ కార్యక్రమాలనయినా అమలుచేసే స్వేచ్ఛ ప్రభుత్వానికి ఉండాలి.

అప్పుడు ప్రజాస్వామ్యం పనిచేస్తుంది. ప్రజల తీర్పును ప్రమాణంగా తీసుకోవాలి, ప్రభుత్వ సార్వభౌమాధికారాన్ని గౌరవించాలి; కానీ అదే సమయంలో, ఈవేళ్టి ఆదాయాల నుంచే ఈవేళ్టి ఖర్చులు చేస్తూ, అప్పు చేసిన డబ్బును భవిష్యత్తు కోసం పెట్టుబడులుగా మాత్రమే వినియోగించటం అనే పరిధి దాటకూడదు.

చివరిగా, మన ఆర్థిక వ్యవస్థకు, మన పిల్లల భవిష్యత్తుకి అసలైన ప్రమాదం, ఈవేళ బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపు చేయకుండా రేపటి తరాల్ని పణంగా పెట్టి నిరంతరం భారీగా పెరిగిపోయేరీతిలో ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చుల నుంచి పొంచి ఉంది.

అనేక రాష్ట్రాల్లో ఓపీఎస్‌కి తిరోగమించటం, అందుకోసం పార్టీలు బాధ్యతారహిత హామీలివ్వటం అనివార్యంగా ఆర్థిక వినాశనానికి దారి తీస్తూ మన బిడ్డల ఆర్థిక భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి.

ఈ సవాలుకు సమాధానం సులభం. భవిష్యత్తులో అయ్యే ఖర్చుకి ఈవేళ చట్టబద్ధహామీ ఇస్తున్న ప్రభుత్వం, ఇప్పుడే అందుకు తగిన చెల్లింపు నిధిని విధిగా ఏర్పాటు చేయాలి. డబ్బు విలువ తరుగుతుంటుంది కాబట్టి, రాబోయే కాలంలో చెల్లించేందుకు అవసరమైన డబ్బును అప్పటి విలువ ప్రాతిపదికన ఆ నిధిలో డిపాజిట్ చేయాలి. ప్రస్తుత బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయంలో భాగంగానే ఇదంతా చేయాలి.

అప్పుడు ఇష్టారాజ్యంగా తీసుకునే నిర్ణయాల భారం భవిష్యత్తు బడ్జెట్ల మీద పడదు. ఈ రకంగా చేయటంలో రాష్ట్రం విఫలమైతే, ఆ భవిష్యత్తు భారాన్ని వాయిదా వేసిన ఖర్చుగానే, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిగానే యూనియన్ ప్రభుత్వం పరిగణించాలి. ఆ ప్రాతిపదికన రుణం, లోటు మొదలైన నిబంధనల్ని అమలు చేయాలి. అప్పుడు ఎన్నికైన ప్రభుత్వ అధికారాన్ని గౌరవిస్తూనే బడ్జెట్ ప్రక్రియలో పారదర్శకత, ద్రవ్య నిర్వహణలో జవాబుదారీతనానికి భరోసా వాటంతటవే సాధ్యమవుతాయి.

# తెలుగులో ఓటు చైతన్య కవిత్వం

- పి.రాజీవ్ కుమార్, (రీసెర్చ్ స్కాలర్, తెలుగు శాఖ, ఓయూ) సెల్: 8096087911



ఏదైనా సులభంగా దొరికితే దాని విలువ తెలియదంటారు పెద్దలు. ఇది భారత పౌరుల ఓటుహక్కు విషయంలో నిజమేమో అనిపిస్తుంది. అమెరికా ప్రజలు సార్వత్రిక వయోజన ఓటు హక్కు కోసం సుమారుగా రెండు వందల సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేయాల్సి వచ్చింది. మొదట ఆస్తి కలిగి ఉన్న తెల్లజాతి పురుషులకు మాత్రమే ఓటు హక్కు ఉండేది. తర్వాత నల్లజాతి వారు, మహిళలు దశలవారీగా ఓటు హక్కును పోరాడి సాధించుకున్నారు.

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు నుండే ప్రజలందరికీ కుల, మత, ప్రాంత, లింగ భేదాలతో, ఆస్తి, చదువు మొదలైన వాటితో కూడా నిమిత్తం లేకుండా ఆర్టికల్ 326 ద్వారా 21 సంవత్సరాల వయసు నిండిన పౌరులందరికీ ఓటు హక్కు వచ్చింది. ఇది రాజ్యాంగ నిర్మాతల కలంపోటుతో సాధ్యమైంది. బ్రిటిష్ ఇండియాలో కేవలం జమిందార్లకి, ఆస్తి పన్ను కట్టే కొద్దిమందికి మాత్రమే ఓటు హక్కు ఉండేది. రాజ్యాంగ సభలో ఓటు హక్కు మీద చాలా వాదనలు జరిగాయి. హెచ్.వి కామత్ అనే పార్లమెంటేరియన్ నిరక్షరాస్యులకు ఓటు హక్కు ఇవ్వడాన్ని వ్యతిరేకించాడు. కానీ రాజ్యాంగ సభలో అంబేద్కర్ చేసిన బలమైన వాదనల ఫలితంగా అందరికీ ఓటు హక్కు సాధ్యం అయింది. 1988లో చేసిన 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు పొందే వయసును 21 ఏళ్ల నుండి 18 ఏళ్లకు తగ్గించారు.

ఆధునిక తెలుగు కవులు ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించారు. యోగ్యులైన అభ్యర్థులకు మాత్రమే ఓటు వేయాలని తమ కవిత్వం ద్వారా సమాజాన్ని చైతన్యం చేశారు. స్వయంగా ఎన్నికల్లో పోటీ చేసిన కవులు కూడా ఉన్నారు. అభ్యర్థి ఏ పార్టీకి వాడని కాదు, ఏ పాటి వాడో చూడు అని ప్రజలను అప్రమత్తం చేసిన ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు సైతం ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 1952లో ఆయన వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. పీడీఎఫ్ అభ్యర్థి పెండ్యాల రాఘవరావు కాళోజీపై గెలిచారు. ఎమర్జెన్సీకి నిరసనగా కాళోజీ ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుపై 1978లో పోటీ చేసి మళ్ళీ ఓటమి పాలయ్యారు.

నేరుగా ఎన్నికల్లో పోటీ చేసి గెలవకపోయినా, నామినేటెడ్ పద్ధతిలో చట్టసభలలోకి ప్రవేశించిన కవులు కూడా ఉన్నారు. గుర్రం జాషువ, బోయి భీమన్న వంటి కవులు ఎమ్మెల్సీలుగా పనిచేశారు. సి. నారాయణరెడ్డి రాజ్యసభ సభ్యునిగా పనిచేశారు. ప్రస్తుతం గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్ వంటి కవులు చట్టసభల్లో సభ్యులుగా ఉన్నారు.

ఓటు చైతన్యం మీద కవిత్వం రాసిన వారిలో ముందుగా జాషువా గురించి చర్చించుకోవాలి. జాషువా స్పృశించని వస్తువంటూ లేదు. తెలుగు సాహిత్యంలో ఇంతటి వస్తు

వైవిధ్యంతో కవిత్వం రాసిన కవులు అరుదు. ఓటు అనే పేరుతో తొమ్మిది పద్యాలతో కూడిన ఖండికను రాశాడు.

**ఉ. కూటికి గుడ్డకున్ ప్రజలు, కొంగరవోవుచుండ నీటుగా**
**మోటారు బండ్లపై నగదు మూటలతో కలవారి వోటు భి**
**క్షాటన సాగుచున్న యది జాగ్రత్త! దేశనివాసులారా! మీ**
**యోటులు స్వీయభారత సముజ్వల గాత్రికి సూత్రబంధముల్**

60వ దశకంలో ఈ పద్యాన్ని రాశాడు. అంటే ఆనాటికే, మన ప్రజాస్వామ్య వ్యవస్థ వేళ్లూనుకోక ముందునుంచే ఓటుకు ఎంతో కొంత డబ్బు పంచటం మొదలైందని తెలుస్తుంది. కనీస అవసరాలైన కూడు, గుడ్డ కోసం ప్రజలు వలస వెళుతున్నారని కవి ఆవేదన వ్యక్తం చేశాడు. ఓట్ల కోసం మోటారు బండ్లపై నగదు మూటలతో తిరిగే స్థితి ఏర్పడినా, ప్రజలు వివేకంతో ఓటు వేస్తే అలాంటి ఓట్లు "స్వీయ భారత సముజ్వలగాత్రికి సూత్రబంధముల్" అనే ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు.

**మ. ఒక పర్యాయము చేయి జారితిరి మీ వోటుల్ దగా దేశ నా**
**యకులన్న మ్మి, సమస్త కష్టములపాలై దేశమల్లాడె, వా**
**లకముల్ మారిచి వారు, వారి హితులున్ లాలింపగా వత్తు రిం**
**డ్లకు బండ్లెక్కి, ప్రజాహితార్థులవలెన్ ద్రవ్యంబు ప్రయోగించుచున**

పొరపాటున ఒకసారి చేయి జారి అయోగ్యులకు ఓటు వేస్తే దగాకోరు నాయకులు అధికారంలోకి వచ్చి, దేశాన్ని సమస్త కష్టాలకు గురిచేస్తారని హెచ్చరిస్తున్నాడు. అభ్యర్థులందరూ ప్రజాహితం కోరే వారిగా మనలని మచ్చిక చేసుకోవడానికి వస్తారు. అందులో నిజాయితీపరులని గుర్తించాలని ఓటర్లకు కవి సూచిస్తున్నాడు.

జాషువా తర్వాత కాళోజీని పేర్కొనవచ్చు. వయసులో జాషువా కంటే కాళోజి 20 యేళ్ళు చిన్నవాడు అయినప్పటికీ జాషువా కంటే ముందుగానే ఓటు గురించి రాశాడు. పోలీస్ యాక్షన్ తర్వాత 1949లో స్టేట్ కాంగ్రెస్‌కు జరిగిన సంస్థాగత ఎన్నికల సందర్భంగా రాసిన గేయాన్ని చూద్దాం.

**ఓటిచ్చు అధికారమున్నట్టివారు /**
**ఎన్నికల సమయాన తిన్నగా వినుడు**
**మట్టి బానలుకొనిన కొట్టి చూచెదము /**
**సరకుకొన వీధెల్ల తిరిగి చూచెదము**
**పండు పండెనో లేదో పట్టి చూచెదము /**
**ఓటు వేయుట పిల్లలాట ఎట్లగును?**
**అభ్యర్థులై ఓటులడిగేటివారు /**
**ఏమేమి జేసిరో ఎటువంటి వారో?**
**పురుషులెవ్వారు కాపు పురుషులెవ్వారు /**
**గుర్తించి ఓటులను గురిపింప వలయు**
**ఓటిచ్చునపుడే ఉండాలె బుద్ధి /**
**ఎన్నుకొని తలబాదుకున్న నేమగును?/**
**తర్వాత ఏడ్చినా తప్పదనుభవము.**

మట్టికుండను కొనేటపుడు కూడా దానిని చేతితో కొట్టి పరీక్షిస్తాము. మార్కెట్లో ఏ వస్తువును కొన్నా పది రకాలుగా ఆలోచిస్తాము. అలాంటిది మన జీవితాన్ని నిర్దేశించే పాలకులను ఎన్నుకునే సందర్భంలో ఎంత జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలో కవి సూచిస్తున్నాడు. ఓటు వేసిన తర్వాత బాధపడితే లాభం లేదు, తగనివారికి ఓటు వేస్తే చేదు అనుభవాలు తప్పవంటున్నాడు.

**ఓ ఓటరు కాపన్నా! /ఎద్దుల తప్పేమీ లేదు**
**కాడి పెట్టుకున్నందుకే /మురిసిపోయి దేబెవోలె**
**ఓట్లు మేపి పంట మాట /మరచి నీవు పస్తుంటివి**
**బలిసిరేగి కాడెద్దులు /జంట వీడకుండ మేసి**
**రంకలేస్తూ తిరుగుచుండె / మూడుసార్లు ఓట్లేసి**
**స్వర్గానికి ఉట్టి కట్టి /లొట్టలేస్తూ చస్తుంటివి**
**అయ్యో ఖర్మం అంటూ /నెత్తంతా బాదుకుంటూ**

యజమాని అయిన రైతుకు తన కాడెద్దులను సరిగా ఉపయోగించుకోవడం తెలియాలి. మేత బాగా మేసి పని నేర్పకుంటే అవి రంకెలేస్తూ ఖాళీగా తిరుగుతాయి. గెలిచి పనిచేయకుండా తిరిగే నాయకులను అలాంటి ఎద్దులతో, ఓట్లను మేతతో పోల్చాడు కవి. నిజానికి ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు. పాలకులు సేవకులు మాత్రమే. కానీ ప్రజల ఓటు ద్వారా తమ అధికారాన్ని నాయకులకు బదిలీ చేసి చివరికి దీనుల్లా మిగిలిపోతున్నారని కవి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

కాళోజీ 1967లో "తస్మాత్ జాగ్రత్త! జాగ్రత్త!!" శీర్షికతో రాసిన కవిత తెలుగునాట చాలా ప్రాచుర్యం పొందింది. తెలుగు కవిత్వాన్ని అభిమానించేవారు ఈ క్రింది కవితను ఎప్పుడో ఒక్కసారైన చదవడం గానీ, వినడం గాని చేసి వుంటారు.

**అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు**
**ఏ పాటి వాడో చూడు**
**ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు**
**ఇందాక ఏం చేసిండో చూడు**
**ఇప్పుడు కట్టే ముడుపులు కాదు**
**ఇందాక చెల్లించింది చూడు**
**పెట్టుకునే టోపీ కాదు**
**పెట్టిన టోపీ చూడు**
**ఎగరేసిన జండా కాదు**
**చాటున ఆడిన దందా చూడు**
**మనిషిని చూడు, చరిత్ర చూడు**
**నడువులు కాదు, నడవడి చూడు**

ఈ కవితలో రాజకీయ పార్టీల వైఫల్యాన్ని ఎండగట్టాడు కాళోజి. అన్ని రాజకీయ పార్టీలు ఒకే మూసలో ఉన్నపుడు ఏ పార్టీకి ఓటు వేస్తే ఏమి ప్రయోజనం అన్న భావం వ్యక్తం అవుతుంది. ఏ రెండు పార్టీలకు మధ్య కూడా తేడా లేదు. దాదాపు అన్ని ప్రధాన పార్టీలు ఓట్లకు డబ్బు, మద్యం పంచుతున్నాయి. గెలిచిన తర్వాత వ్యవహరించే తీరులో కూడా తేడా లేదు. పార్టీలకు సిద్ధాంతాలు లేవు. గాంధీజీ చెప్పిన ఏడు మహాపాపాలలో సిద్ధాంతాలు లేని రాజకీయం మొదటిది. సిద్ధాంతాలను రాద్ధాంతాలుగా అభివర్ణిస్తున్న కాలం ఇది. ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో చెప్పలేం. అలాంటపుడు పార్టీలను పక్కన పెట్టి, అభ్యర్థుల

నిజాయితీ, చరిత్ర, సామర్థ్యం మొదలైన వాటిని పరిగణలోకి తీసుకొని ఓటు వేయాలని కవి భావన.

ఆరుద్ర కూనలమ్మ పదాలలో కూడా ఓటు హక్కు ప్రస్తావన ఉంది.

**బ్రూటున కేసిన ఓటు**
**బురదలో గిరవాటు**
**కడకు తెచ్చును చేటు**
**ఓ కూనలమ్మ**

బ్రూటు అంటే క్రూరమైనవాడు అని అర్థం. మరి క్రూర స్వభావం కలిగిన రౌడీలు, గూండాలు రాజకీయాల్లోకి ఎందుకు వస్తున్నారు? ఎన్నికల్లో ఎందుకు పోటీ చేస్తున్నారు?.. ప్రజాసేవకు మార్గంగా ఉండాల్సిన రాజకీయం వ్యాపారంగా మారింది కాబట్టి సామాన్యులు రాజకీయాల్లోకి వచ్చే పరిస్థితి లేదు. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి గెలవడం, గెలిచాక అంతకు పదిరెట్లు దోచుకోవడం ఇది ప్రస్తుత రాజకీయ ముఖచిత్రం. అందుకే అలాంటి 'బ్రూటు'లకు ఓటు వేయొద్దని ఆరుద్ర చెబుతున్నాడు. ఒకవేళ వేస్తే అది బురదలో వేసినట్లే తుదకు వేసిన వారికే ప్రమాదంగా పరిణమిస్తుందని హెచ్చరిస్తున్నాడు.

తెలుగులో మినీ కవిత్వాన్ని వ్యాప్తిలోకి తెచ్చిన వారిలో ముఖ్యుడైన రావి రంగారావు కూడా ఓటు హక్కు వినియోగం మీద చాలా కవితలు రాశాడు. కేవలం మినీ కవితలే కాక రావి శతకం వంటి వాటిలో పద్యాలు కూడా రాశాడు.

**నమ్మకమ్ము నిలుపు నాయకులున్నచో /**
**ఓటునమ్ముకోరు నోటు కొరకు**
**పాయసమ్ము వంటిది ప్రజాస్వామ్యమందు /**
**గుండుసూదులు ప్రజాలమ్ముకొన్న ఓట్లు**
**దినము దినముకు ఓట్లమ్ముకుడెడవారు /**
**పెరుగుచుండగ అవినీతి పెరుగుచుండె**

పైన పేర్కొన్నవి రావి రంగారావు ఓటు మీద రాసిన కొన్ని పద్యపాదాలు. అనేక మినీ కవితలు కూడా రాశాడు.

**1. ఓటు**
**నోటు**
**వాటేసుకుంటే**
**పుట్టేది**
**రాక్షస బిడ్డే**

**2. ఓటు**
**పెద్ద గునపమైతే**
**ఎంత బాగుంటుందో**
**అవినీతి గుండెల్లో**

**3. వినాయకుడి లాంటి ఓటర్లను**
**ఎంతో విలువైన దేవుళ్ళను**
**ఆర్భాటమైన భక్తితో**
**నైవేద్యాలు పెట్టిపెట్టీ**
**పండుగ రోజులు పోగానే**
**హుస్సేన్ సాగర్‌లో ముంచుతారు**

**4. సీటు జనరల్ అయితే నేనే**
**మహిళలకైతే మా ఆవిడ**
**దళితులకైతే మా పాలేరు**
**మైనారిటీలకైతే మా డ్రైవర్**
**కలకాలం అధికారం నాదే!**
**కార్యకర్తలకు బూడిదే!**

**5. నీ చేతిలో ఓటు**
**జాగ్రత్తగా వాడితే**
**పొలం దున్నే హలం**
**కళ్ళు మూసుకొని వేస్తే**
**భవిష్యత్తును బలిగొనే**
**విషపూరిత కరవాలం!**

ఇట్లా ఎవరికైనా సులభంగా అర్థమయ్యే రీతిలో చాలా మినీ కవితలు వచ్చాయి.

ఆధునిక కాలంలో ప్రజల్లోకి బలంగా చొచ్చుకుపోయిన సాహిత్య ప్రక్రియ పాట. తెలుగునాట పాట అంటే ముందుగా గుర్తొచ్చే పేరు గద్దర్. చాలాకాలం పాటు గద్దర్ విప్లవోద్యమంతో ఉన్నాడు. బయటికి వచ్చాన ఆయన ఓటు హక్కు కోసం ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకొని 2018లో ఓటు హక్కును పొందాడు. అదే సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు హక్కును వినియోగించుకున్నాడు. ఓటుపై పాటలు కూడా రాశాడు.

**రాజకీయ బానిసలారా .... ఈ రాజీ బతుకులు వద్దురా**
**ఒకే మనిషికొక ఓటురా .... నోటుకు బలిపెట్టొద్దుర**
**వెలకట్టలేనిదీ ఓటురా .... నీ బ్రతుకును మార్చే తూటరా**
**ఇది బాటరా .... బాబాసాహెబ్ బాటరా**

జయరాజు రాసిన వానమ్మ పాట బాణీకి సమీపంలో ఉండే విధంగా "ఓటమ్మ .... ఓటమ్మ నిన్ను ఎవరికేసి వస్తినమ్మో ఓటమ్మ" అనే పాటను కూడా రాశాడు. ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న "ఓటేడ నేనేస్తరన్న .... నా ఓటు, దానోటు నా పెండ్లమే గుద్దె .... ఓటేడ నేనేస్తిరన్న" అనే అద్భుతమైన పాటను రాశాడు.

ఇట్లా ఎందరో తెలుగు కవులు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలుపుతూ రాశారు.

కాల్పనిక వస్తువును ఎంచుకొని రాయడం సులభం. మానవ సంబంధాలు, వారి మధ్య ఉండే సున్నిత భావోద్వేగాల మధ్య కూడా కవిత్వం పండించవచ్చు. కానీ ఆధునిక జీవితంలో అన్నీ ఆంగ్ల పదాలు వచ్చి చేరాయి. ఓటు కూడా ఇంగ్లీషు పదమే. వర్తమాన కాలంలో ఏ సాంఘిక వస్తువును ఎంచుకున్న ఇంగ్లీషు పదాలతో ముడిపడి ఉంటుంది. మధ్యమధ్యలో కొరకరాని కొయ్యలా ఉండే ఆంగ్ల పదాలను అనువైన రీతిలో వేస్తూ ఆకర్షణీయంగా రాయడం ప్రతిభావంతమైన కవులకే సాధ్యం. సామాజిక బాధ్యతతో అలాంటి కవిత్వాన్ని నిలబెడుతున్న కవులకు నమస్కారం.

# 2023 తెలంగాణ రాష్ట్ర ఎన్నికలకు సుపరిపాలన వేదిక 'ప్రజల మేనిఫెస్టో'




తెలంగాణ రాష్ట్ర ఎన్నికల బరిలోని పార్టీలు తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. వారిచ్చిన హామీల్ని నెరవేర్చాలంటే అయిదు సంవత్సరాల రాష్ట్ర బడ్జెట్ కూడా సరిపోదు. ఓటర్లకు తాత్కాలిక ప్రయోజనాల ఆశ చూపి గెలిచే వ్యూహం తప్ప దీర్ఘకాలిక దృష్టి, ప్రజలకు స్వావలంబన కలిగించే ఆదాయావకాశాలు, విధానపరమైన మార్పులు వీటిల్లో కొరవడ్డాయి. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు ప్రజాధనంతో ఓటర్లను ప్రలోభపెడుతున్నాయి. ఓటర్ల మెప్పుకై రకరకాల ఉచితాలు పంచి దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన దేశాలు ప్రపంచంలో చాలా ఉన్నాయి. దురదృష్టవశాత్తు అధికారమే పరమావధిగా భావించే అల్పబుద్ధి రాజకీయ పార్టీలకు ఇవేమీ కనిపించటం లేదు.

వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని సుపరిపాలన వేదిక (ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్) సమాజంలోని అన్ని వర్గాలు, ముఖ్యంగా విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలు, ఇతర మేధావి వర్గాలతో చర్చించి ఆ ప్రాతిపదికన 35 అంశాలతో కూడిన ప్రజల మేనిఫెస్టోను తయారుచేసింది.

**ఇటీవల విడుదల చేసిన ప్రజల మేనిఫెస్టోలోని అంశాలు:**

విద్య, వైద్యానికి బడ్జెట్‌లో 25% నిధులు, ఈ రెండు శాఖల ప్రక్షాళన, సంక్షేమ పథకాలకు 30% బడ్జెట్ నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం సూచించిన విధంగా గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలకు క్రమం తప్పకుండా నిధుల విడుదల, పెట్రోలు, డీజిల్‌పై పన్ను తగ్గింపు, 10 ఎకరాల లోపు రైతులకు మాత్రమే రైతుబంధు, రైతు బీమా పథకం అమలు, రైతుకు ఉచిత విద్యుత్తు మూడు మోటార్ల వరకు మాత్రమే, నకిలీ విత్తనాలపై కట్టడి, నూనెగింజలు, చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కట్టిన అన్ని నీటి

పారుదల ప్రాజెక్టులపై ఒక ఉన్నత స్థాయి సాంకేతిక కమిటీ ద్వారా విచారణ, విద్యుత్ కంపెనీల పనితీరుపై శ్వేతపత్రం, ప్రభుత్వ పనితీరులో పారదర్శకత, పాలనలో అవినీతి కట్టడి, కర్ణాటక రాష్ట్రం మాదిరిగా తెలంగాణలో పటిష్ఠమైన లోకాయుక్త చట్టం, కేంద్రంతో సత్సంబంధాలు, రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో చెప్పిన పథకాలకు అయ్యే ఖర్చు తెలుపుతూ ఆ డబ్బు ఎక్కడి నుంచి తెస్తారో తెలియచేయటం, పోలీసు శాఖలో సంస్కరణలు, ఆహార కల్తీపై గట్టి నిఘా, శాసనసభ్యులు, మంత్రులు, ముఖ్యమంత్రి ప్రతి సంవత్సరం తమ ఆస్తి వివరాలు తెలపటం, అటవీ సంరక్షణ, వివిధ ప్రభుత్వ పథకాలలో లబ్ధిదారుల ఎంపికలో సరైన మార్గదర్శకాలు, నేరచరితులకు టికెట్లు ఇవ్వకపోవటం, ప్రభుత్వ భూముల అమ్మకంపై నిషేధం, ధరల నియంత్రణ, నైపుణ్యం పెంపుదలతో ఉపాధి, గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు మొదలైనవి.

ఈ సందర్భంగా ఫోరంఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి మాట్లాడుతూ, మునుగోడు ఉప ఎన్నికలో ఓటర్లు 'నో మనీ – నో ఓటు' అని ప్లకార్డులు పట్టుకొని ధర్నా చేసే పరిస్థితికి తెలుగు ప్రజలు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. ఈ మధ్య యువత పెద్దఎత్తున ఓటర్లుగా నమోదయ్యారని, వారంతా "మా ఓటు అమ్మకానికి లేదు – మా వద్దకు డబ్బు, మద్యంతో రావద్దు" తమ తమ పరిధిలో అని ప్లకార్డులు పట్టుకోవాలని కోరారు.

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రజల మేనిఫెస్టో ఇంగ్లీష్ ప్రతిని విడుదల చేస్తూ, ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే ప్రజలకు మన ప్రజాస్వామ్యంపై నమ్మకం పోతోందన్నారు. రాజకీయ పార్టీలు చట్టాల పరిధిలో లేకుండా తామే ఒక చట్టంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఇలా జరగటానికి కారణం, గెలిచిన పార్టీ అంతా గెలిచినట్లే, ఓడిపోయినవాడు పూర్తిగా ఓడినట్లే అనే ఎన్నికల పద్ధతిలో నడవటమన్నారు. 'రాజకీయ నాయకులు ఒకరినొకరు సభ్యత సంస్కారం మరచి దూషించుకుంటున్నారు. మానవత విలువలకు స్థానం లేకుండా పోయింది. మార్పు కొరకు గట్టి సంస్కరణలు, అలాగే రాజ్యాంగ సంస్కరణలు రావలసి ఉంది. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ చేసిన ప్రయత్నాన్ని అభినందిస్తూ, ప్రజల మేనిఫెస్టోలో ఉన్న 35 అంశాలను సమర్థిస్తున్నా' అని తెలిపారు.

హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు ప్రజల మేనిఫెస్టో తెలుగు ప్రతిని విడుదల చేస్తూ, రాజకీయ పార్టీలు రకరకాల తాయిలాలతో విడుదల చేస్తున్న మేనిఫెస్టోలకు ఎటువంటి చట్టబద్ధత లేదని, అవి చిత్తుకాగితంతో సమానమన్నారు. ఓటు వేయటానికి వెళ్లినప్పుడు ఓటరు పార్టీల మేనిఫెస్టోలను పక్కనపెట్టి మంచివారికి, ప్రజల మధ్యలో ఉండి వారికి సేవ చేసేవారికి, సచ్ఛీలురకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అభ్యర్థుల గత చరిత్రను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు.

పలువురు స్వచ్ఛంద సేవా ప్రతినిధులు సమావేశంలో తమ ఆలోచనల్ని పంచుకున్నారు. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి సోమా శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ✦

## మేయర్లకు సరైన అధికారాల్లేవ్

దేశంలోని మునిసిపల్ పాలనా వ్యవస్థల్లో మేయర్లకు సరైన అధికారాలే లేవని, కార్పొరేటర్లదీ నామమాత్ర పాత్రేనని ఓ సర్వే తెలిపింది. 39 శాతం రాజధానులకు మాస్టర్ ప్లానే లేదని పేర్కొంది. బెంగళూరుకు చెందిన 'జనాగ్రహ' సంస్థ చేసిన ఈ సర్వేను ఢిల్లీలో యూనియన్ మంత్రి హర్దీప్‌సింగ్‌పురి విడుదల చేశారు. కొన్ని ముఖ్యాంశాలు:

- దేశంలోని 17 శాతం నగరాల్లో మేయర్ పదవి ఐదేళ్ల కంటే తక్కువగానే ఉంది. దీనివల్ల వారు అలంకార ప్రాయంగా మిగిలిపోతున్నారు.
- అధికార వికేంద్రీకరణ జరగకపోవటం వల్ల మేయర్లకు, కార్పొరేటర్లకు సాధికారత ఉండటం లేదు.
- వంతులవారీ రిజర్వేషన్లు వారి అధికారాలను నియంత్రిస్తున్నాయి.
- అభివృద్ధి ప్రణాళికలకు అనుగుణంగాలేని ప్రాజెక్టులను అడ్డుకోవటానికి ఏ రాష్ట్ర ప్రభుత్వం వద్దా పటిష్ఠ వ్యవస్థ లేదు.
- ప్రాజెక్టుల్లో ఉల్లంఘనలపై పర్యవేక్షణకు చట్టంలోనూ కఠిన నిబంధనలు లేవు.

స్వతంత్ర భారతం - భవిష్యత్ భారతం..

# ప్రజల సాధికారత

**భారత 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వతంత్ర భారతం - భవిష్యత్ భారతంపై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) కార్యాలయంలో జరిగిన ప్రత్యేక ఇంటర్వ్యూ చర్చా కార్యక్రమంలో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, రిటైర్డ్ ఐపీఎస్, బహుజన్ సమాజ్‌పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. చర్చకు మెయిన్‌థీమ్ భారతదేశ నిర్మాణం. డిస్కషన్‌ని మూడు భాగాలుగా సెగ్మెంట్ చేశారు. ప్రతి సెగ్మెంట్‌కి ఒక సబ్ థీమ్. ఈ మూడు విభాగాల చర్చలోని అంశాల్ని స్థూలంగా ఒక్కో సంచికలో ఒకటి చొప్పున జనబలంలో వరుసగా ప్రచురిస్తున్నాం. ఈ చివరి భాగంలోని చర్చాంశం ప్రజల సాధికారత. ఎఫ్‌డీఆర్ యువ రీసెర్చర్ సుమేధ ఇంటర్వ్యూ కార్యక్రమాన్ని నిర్వహించారు..**




**ప్రశ్న: భారతదేశ నిర్మాణంలో అతి ముఖ్యమైన అంశం ప్రజల సాధికారత. ఒక ఖండం లాంటి ఈ దేశంలో ఉన్నంత వైవిధ్యం, సమస్యలు మరెక్కడా కన్పించవు. ఈ పరిస్థితుల్లో దేశ నిర్మాణం చాలా కష్టమైన పని. సర్, మన సమాజంలో పుట్టుకను బట్టి కొన్ని వర్గాలు ఎదిగే అవకాశాలను కోల్పోతున్నాయి. దానికొక తాత్కాలిక పరిష్కారంగా రిజర్వేషన్లు మనం రాజ్యాంగంలో ఏర్పాటు చేసుకున్నాం. కానీ సమస్య ఇప్పటికీ కొనసాగుతోంది. మణిపూర్‌లో ఇప్పుడు జరుగుతున్న హింస ఒక తాజా ఉదాహరణ. ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం లేదా?**

**ఆర్ఎస్‌పీ:** దేశంలో అసమానతలు ఉన్నంతవరకు, దోపిడీ, అణచివేత, మరిముఖ్యంగా పేదరికం ఉన్నంత వరకు.. రిజర్వేషన్లు అని అనను నేను, రిప్రజెంటేషన్ ఉంటుంది. ప్రాతినిధ్యం తప్పనిసరిగా ఉండాల్సిందే. లేకపోతే ఈ దేశంలో అంతర్యుద్ధం వస్తుంది. దేశం మొత్తం కూలిపోతుంది. ఆ డైరెక్షన్‌లోనే పాలిటిక్స్ అనేవి నడవాలి. నేను ప్రజాజీవితం అందుకే ఎంచుకున్నా. ఆ దిశ వైపు దేశం నడవటం కోసం మన చేతనైనంత మనం చేయాలి శేషజీవితంలో అని చెప్పి నేను రాజకీయం వైపు వచ్చాను. ఆ డైరెక్షన్‌లో దేశం వెళ్లకపోతే డబ్బున్నవాళ్లు మరింత ధనవంతులు కావటం, వాళ్లు గేటెడ్ కమ్యూనిటీలు కట్టుకోవటం, వాళ్లకు వాళ్లు స్కూల్స్, వాళ్లకు వాళ్లు సెక్యూరిటీ వ్యవస్థలు నిర్మించుకోవటం, వాళ్లకు వాళ్లు గొప్ప హాస్పిటల్స్ నిర్మించుకోవటం, సంపదంతా వాళ్ల చేతుల్లో పెట్టుకోవటం, పేదవాళ్లెప్పుడూ నిరాశా నిస్పృహలతో రోడ్ల మీద ధర్నాలు చేసుకుంటూ, లేకపోతే శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ వ్యవస్థల మీద ఆధారపడి బతకటం, కాబట్టి, వాళ్ల వాయిస్‌కి పూర్తిగా స్పేస్ లేకపోవటం జరుగుతుంది. అలాంటి డైరెక్షన్‌లోకి దేశం వెళ్తే అంతర్యుద్ధం వస్తుంది. ఉపద్రవం అంచుకు చేరతాం. టిప్పింగ్ పాయింట్ తర్వాత విధ్వంసం అనివార్యం. కాబట్టి ఆ పరిస్థితి రాకూడదు. అందుకోరకే, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలి. దేశంలో అన్ని వర్గాల ఆకాంక్షలకి వీలైనంత స్పేస్

దొరకాలని రిజర్వేషన్లు పెట్టటం జరిగింది. రిజర్వేషన్లు ఒక ఎఫర్మేటివ్ చర్య; ప్రాతినిధ్యానికి ఏర్పాటు. అది ఒకరిచ్చే భిక్ష కాదు. అది అవసరం, సహజ న్యాయం. అందరికీ సమన్యాయం ఉండాలి, ఉంటుంది. వివక్ష ఈ దేశంలో ఉన్నంతవరకు రిజర్వేషన్ ఉంటుంది. రిజర్వేషన్లను నెగెటివ్‌గా చూడటం కరెక్ట్ కాదు.

**జేపీ:** ప్రవీణ్ చెప్పింది చాలా కీలకమైన మాట. మిగతా విషయాలు పక్కనపెట్టండి. ఒక ప్రజాస్వామ్య సమాజంలో, వివక్షకు గురైనవాళ్లు ఇంతకాలంగా నష్టపోతున్న సమాజంలో, అందర్నీ కలిపి ఉమ్మడిగా అందరికీ ఓటుహక్కు ఇస్తే చాలదు సమాజాన్ని నిలబెట్టాలంటే. బాబాసాహెబ్ అంబేద్కర్ చాలా లోతుగా ఆలోచించారు. ఆయన నా దృష్టిలో రిజర్వేషన్ శాశ్వత పరిష్కారమని ఏనాడూ అనుకోలా. ఆయన నిజంగా ఏ రాజ్యాంగ విలువలు ప్రతిపాదించారో అవి ఆచరణలోకి వస్తాయి, ఇది ఒక్కరోజు జరగదు, వచ్చేలోగా ఈ సమాజంలో భాగమనే విశ్వాసం వివక్షకు గురవుతున్నవారిలో లేకపోతే ఈ సమాజం నిలవదు, రక్తపాతం వస్తుంది, అశాంతి వస్తుంది అని భావించారు. మనవాళ్లు ఏం చేశారు?– అసలు ఏం చేయాలో అది చేయకుండా రిజర్వేషన్లను మాత్రం కొనసాగిస్తూ నటిస్తున్నారు. దీనివల్ల విచిత్రంగా రిజర్వేషన్ పొందే వర్గాలకీ అన్యాయం జరుగుతోంది. రిజర్వేషన్ వల్ల బాగుపడ్డామన్న అభిప్రాయం ఏ వర్గాలకీ లేదు. పొందని వర్గాలకు, మనకేదో అన్యాయం జరిగిపోయిందని వాళ్ల నుంచి గొడవ వస్తోంది. చాలా విచిత్రం ఇది. ప్రపంచంలో ఎక్కడా కూడా రెండు వర్గాలూ నష్టపోతున్నామనుకునేలా చేయాలంటే చాలా జీనియస్ కావాలి. మన రాజకీయ నేతలకి ఆ జీనియస్ ఉంది. మరి పరిష్కారం ఏమిటి? మూడు మౌలికమైనవి. మొట్టమొదటిది, అత్యంత ముఖ్యమైనది. అసలు మీకు పాఠశాల విద్య లేకుండా ఆధునిక యుగంలో మీరు ఎట్లా ఎదుగుతారు? దేవుడు అనేవాడు ఉంటే, దేవుడు లేదంటే ప్రకృతి, తెలివితేటల్ని కాస్తోకూస్తో అందరికీ సమానంగా పంచింది కదా. మెడ మీద తలకాయలేని గాడిదలు తప్ప కులాన్ని బట్టి, మతాన్ని బట్టి తెలివితేటలున్నాయని ఎవడూ అనలేదు. తేడాలుంటాయి ప్రతి రంగంలో. కానీ అవి కులం, మతం, భాష లేదా దేశం మీద ఆధారపడినవి కావు. బిడ్డల తెలివితేటలు బయటపడటానికి ఆధునిక యుగంలో మార్గం ఏముంది? ఒక్కటే మార్గం, పనికొచ్చే మంచి ప్రమాణాల విద్య. అరె, గడియారం చూసి టైం చెప్పటం రానివారు నూటికి 50 మంది తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో 14–18 ఏళ్ల మధ్య ఉన్నారు ఈవేళ. ఇది నిజమైన చదువా? గంట చెప్పేవాళ్లు నూటికి 75 మంది ఉంటే, గంట, నిముషం చెప్పేవాళ్లు నూటికి 50 మందే. మీరు శక్తిసామర్థ్యాలను బయటకు తీసుకురాకుండా ఏ రకంగా సమాజంలో ఎదుగుతారు? ఎదగనప్పుడు ఏ రకంగా సమన్యాయం అందుతుంది? అందనప్పుడు ఏ రకంగా అందర్నీ కలిపి ఉంచుతారు? తాత్కాలికంగా రిజర్వేషన్లు!.. కాబట్టి పాఠశాల విద్య అత్యంత కీలకం. నేను ప్రవీణ్‌ని ప్రేమించటానికి కారణం– అతను దీని మీద అత్యధిక సమయం వెచ్చించటం. పాఠశాల విద్యని భారతదేశంలో నిర్లక్ష్యం చేసినంత ప్రపంచంలో మరో పెద్ద దేశంలో చేయలా. ఇంత నిరంకుశంగా, నేర సమానంగా పాలకులు, అధికారంలో ఉన్న నాయకులు కావచ్చు, అధికార యంత్రాంగం కావచ్చు నిర్లక్ష్యం చేశారు. ఈ దారుణంలో ప్రపంచంలోనే భారతదేశం ఒక మినహాయింపు. నేను సిగ్గుపడుతున్నాను. ఇంత పరుషంగా ఎంత ఎమోషన్‌లోనూ మాట్లాడను బహుశా. సిగ్గుపడాలి మనం ఈ దేశంలో పుట్టిన ప్రతి బిడ్డ ఎదుగుదలకూ అవకాశం కల్పించనందుకు! పాఠశాల విద్య లేనప్పుడు, ఏదో మల్లగుల్లాలు పడుతున్నాం గానీ, అది ఎప్పుడైతే సరిగ్గా లేదో రిజర్వేషన్ ఫలితాలు అందటం లేదు కొద్దిమందికి తప్ప. దీంతో అణగారినవర్గాలు బాగుపడే అవకాశమూ రావటం లేదు. రెండోది, స్థానిక ప్రభుత్వాలలో రిజర్వేషన్ పెట్టాం. కానీ అధికారమిచ్చామా?.. జనాభారీత్యా ప్రాతినిధ్యం వచ్చింది స్థానిక ప్రభుత్వాలకు మాత్రమే. ఎక్కడ అధికారం లేదో అక్కడ మాత్రం ప్రాతినిధ్యం ఇచ్చాం, ఎక్కడ అధికారం ఉందో అక్కడ ప్రాతినిధ్యం లేదు. నిజంగా అధికారం ఇచ్చేయండి స్థానికంగా. తప్పులు చేయకుండా ఏర్పాట్లు చేయండి. అక్కడ ఏమైందీ తొలినుంచి– బాబాసాహెబ్ అంబేద్కర్ గ్రామాల్లో గనక పూర్తి అధికారమిస్తే అగ్రకులాల్లోకి వెళ్లిపోతుంది అని భయపడ్డారు. అది చాలా హేతుబద్ధమైన వాదన, సందేహం. గాంధేయవాదులేమో స్థానిక ప్రభుత్వాలు అన్నారు. చివరకు అంబేద్కర్ వాదన నెగ్గింది. ఆదేశిక సూత్రాల్లో పెట్టారు. కానీ సమన్వయం చేయటంలో విఫలమయ్యాం. మీరు సాంప్రదాయంగా వస్తున్న గ్రామాన్ని యూనిట్‌గా చేస్తే కులం పోదు. ఓ 20 గ్రామాల్ని కలిపేసి 40–50 వేల మంది జనాభా పెట్టినట్లయితే సహజంగా ప్రజాస్వామ్య సంఖ్యా బలం వచ్చేది. కానీ అలా చేయలేదు. స్థానిక ప్రభుత్వంలేని ప్రజాస్వామ్యం నీరసించిన ప్రజాస్వామ్యం. రసహీనమైన ప్రజాస్వామ్యం. కుహనా ప్రజాస్వామ్యం. ఎప్పుడైతే అలా జరిగిందో మీకసలు సమాజాన్ని మీ గొంతుతో, మీకున్న సంఖ్యాబలంతో, మీ అవసరాలతో మార్చే అవకాశం లేకుండా పోయింది. మూడోది, చట్టబద్ధపాలన. బడితె ఉన్నవాడిదే బర్రె అయింది. బడెతె ఎవడి చేతిలో ఉంది– డబ్బున్నవాడు, అధికారం ఉన్నవాడు, కులం ఉన్నవాడు. ఈ మూడూ ఉన్నవాళ్ల చేతుల్లోనే కదా బడితె ఉన్నది. ఇంకా, సామాన్యులకు న్యాయం ఎట్లా జరుగుతుంది? మిగతా రెండూ వెంటనే జరగకపోయినా, మంచి విద్య అందించటానికి అన్ని సాధనాలూ ఉన్నాయి. తల్లిదండ్రుల్లో పిల్లలకు చదువురావాలనే కోర్కె ఉంది, త్యాగం చేసే తత్వం ఉంది, ప్రభుత్వాలు లక్షల

కోట్లు ఖర్చు పెడుతున్నాయి, విద్యను సమాజం గౌరవిస్తుంది, పిల్లలకు తెలివితేటలున్నాయి. కష్టపడుతున్నారు. అంగట్లో అన్నీ ఉన్నాయి. అల్లుడి నోట్లో శని ఉంది. మంచి విద్యాప్రమాణాలు అందించాలన్న ఇంగితజ్ఞానం గానీ, అవగాహనగానీ లేకుండా మీడియాతో సహ డ్రామాలాడుతున్నారు విద్య పేరుతో. పొరపాటున మాట్లాడితే ఇంకా ఖర్చు పెట్టాలంటారు. పెట్టిన ఖర్చు సద్వినియోగం చెయ్యవయ్యా. పెట్టిన ఖర్చు సద్వినియోగం చెయ్యి. అంచేత, అవి చేస్తే తర్వాత రిజర్వేషన్ ఆటోమేటిక్‌గా, దాని గురించి చర్చ అక్కర్లేదు. మీకొక ప్రమాణం వచ్చిన తర్వాత ఆయన చేస్తే ఏంటి, ఈయన చేస్తే ఏంటి, నాకేం కావాలి? అసలు గవర్నమెంట్‌లో ఉద్యోగాలు ఎవడికి కావాలి? అంచేత మూలాన్ని నాశనం చేశాం. ఆ సింబల్‌ను నడుపుతున్నాం. అది లేకపోతే సమాజం నడవదు కాబట్టి. కాబట్టి వివక్ష కొనసాగుతోంది, రిజర్వేషన్లు ఇచ్చామని ఏదో నటిస్తున్నాం.

**ప్రశ్న: సర్, మీరిద్దరూ నాణ్యమైన విద్యకి ఎంతో ప్రాధాన్యం ఇస్తుంటారు. ఆర్ఎస్పీగారూ! మీ దగ్గరికి వస్తే, మీరు సాంఘిక సంక్షేమంలో చేసిన కృషి ద్వారా ప్రభుత్వ వ్యవస్థలో కూడా మంచి ప్రమాణాలను చూపించవచ్చు అని నిరూపించారు. సాధారణ ప్రభుత్వ పాఠశాల పద్ధతి కన్నా భిన్నంగా మీరు ఏం చేశారు ఫలితాలు రావటానికి?**

**ఆర్ఎస్పీ:** నేను ముఖ్యంగా టీచర్ల మీద చాలా అంటే చాలా ఇన్వెస్ట్ చేశాను. జీతాలు కాకుండా అదనంగా చక్కటి తర్ఫీదు ఇచ్చి వాళ్లను కమ్యూనిటీకి కనెక్ట్ చేశాను. చాలామంది టీచర్లు క్లాస్‌రూంకి పోయేటప్పుడు ఏమనుకుంటారంటే.. ఆ, ఏముంది, 9 గంటలకు పోతున్నాం, వస్తాం, ఇయ్యాల సిలబస్ ఉంది, ఆ పాఠం చెప్పేద్దాం, వదిలేద్దాం అనుకుంటారు. దాని తర్వాత వాడేదో రాస్తాడులే, స్టాక్ క్వశ్చన్స్ వస్తాయి, రెడీ ఆన్సర్స్ ఉంటాయి. పరీక్షలకి 3 నెలల ముందు నుంచి రివిజన్ మోడ్‌లోకి వెళ్లిపోయి ప్రిపేరైతే చాలు అని ప్రభుత్వ స్కూల్స్, ప్రయివేటు స్కూల్స్ కూడా అనుకుంటున్నాయి. పిల్లల్లో కూడా ఇప్పుడు పాఠాలు చెప్పకపోయినా ఆ 3 నెలల్లో, వాళ్ల స్టాక్ క్వశ్చన్స్, స్టాక్ ఆన్సర్స్ ఉంటాయి, బట్టీ పట్టేస్తే 99% రిజల్ట్ వస్తుంది, నాకు గోల్డ్‌మెడల్ వస్తుంది అని నమ్మకం. నేనన్నా- అది ఉపాధ్యాయ వృత్తి కాదు! కాబట్టి నేను కమ్యూనిటీకి కనెక్ట్ చేశా ఉపాధ్యాయుడిని. అంటే ఏమిటి? సెలవలు, సమయం దొరికిన ప్రతిసారి కూడా విద్యార్థుల తల్లిదండ్రులతో సంధానం చేశా. దసరా సెలవల్లో, వేసవి సెలవల్లో కనీసం నాలుగు గ్రామాలైనా తిరగండి, తిరిగి మీరు రోజూ పాఠాలు చెప్పే పిల్లలకు సంబంధించి ఎలాంటి కుటుంబాల్ని చూస్తున్నారు? వాళ్ల తల్లిదండ్రులు ఏ విధమైన దీనస్థితిలో బతుకుతున్నారు? వాళ్ల మీద ఎంత అణచివేత ఉంది? వాళ్ల ఇళ్లల్లో మహిళ మీద ఎంత అణచివేత ఉంది?.. తెలుసుకోండి. ఎందుకంటే, నేను ఒక 3 బెడ్‌రూం అపార్ట్‌మెంట్‌లో ఉండి, నా ఫ్రేం వర్క్‌తో గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థిని చూస్తే అది వర్కవుట్ కాదు. అది మొదటిది. రెండవది, నేను కొత్తగా చేసిందేంటంటే, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పోటీ పెట్టాను. ఉపాధ్యాయులు ఎంత చక్కగా పాఠాలు చెప్పగలరో ఒక స్థాయి నుంచి విద్యార్థులు కూడా, అంటే 8వ తరగతి, ఆ పైన, విద్యార్థులు కూడా ఉపాధ్యాయులతో పోటీపడి చదువు చెప్పే విధంగా, ఉపాధ్యాయులుగా విద్యార్థులను ట్రై చేయమని చెప్పా. అంటే, మీరు ఎంతసేపూ వేదిక మీద నుంచి గురువులుగా బోధనలు చేయటమే కాదు, స్టేజి పక్కన ఉండి మార్గం చూపే వారుగానూ వ్యవహరించండి. నువ్వు పక్కకు రావాలి, పోడియం నుంచి పక్కకు వచ్చి విద్యార్థులకు అప్పచెప్పు. విద్యార్థులు తప్పు చేస్తే కరెక్ట్ చెయ్యి. దానివల్ల ఏమైందంటే, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఒక ఆరోగ్యకరమైన పోటీ వచ్చింది. దానివల్ల ఉపాధ్యాయుల మీద కూడా కొంత బర్డెన్ తగ్గింది. మూడోది నేను చేసింది ఏమిటంటే, చాలామంది నా కంటే ముందున్నవాళ్లు ప్రభుత్వం ఇచ్చిన డబ్బును ఖర్చు పెట్టలేక వాపసు మళ్లీ ఆర్థిక శాఖకి పంపించేవారు. ఒకవైపు విద్యార్థులేమో హాహాకారాలు చేస్తుంటారు. వాళ్లకి ఆకాంక్షలు ఏవేవో ఉంటాయి. వింటుంటాం మనం. ఒకళ్లు హిమాలయ పర్వతాలు ఎక్కాలంటారు, ఒకళ్లు మూవీలో యాక్ట్ చేయాలంటారు, ఒకళ్లకి పరిగెట్టాలని, బూట్లు వేసుకుని తిరగాలని ఉంటుంది. అందరిలాగానే సూటూ కోటు వేసుకుని పాటలు పాడాలని ఉంటుంది. ఏవో చేయాలని ఉంటుంది. డ్రమ్ కొట్టాలని ఉంటుంది కొంతమందికి. వీటన్నిటినీ చేయటం కోసం డబ్బులున్నాయి. కానీ అంతర్గతంగా ఆ బిడ్డల్లో ఉండే ఆకాంక్షలు ఏవైతే ఉన్నాయో వాటిని వెలికితీసి వాటికో ప్లాట్‌ఫాం నిర్మించే ప్రయత్నం నేను చేశాను. అందుకొరకే అత్యంత పిన్నవయసులో ఎవరెస్ట్ పర్వతం ఎక్కి మలావత్ పూర్ణ ఇయ్యాల ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇంతవరకూ ఆ రికార్డును ఎవరూ బ్రేక్ చేయాలా. మామూలుగా అయితే ఏందిరా ఆ గుట్టల్లో ఎక్కటం, అదొక ఇదా అంటారు. మరి ఆరోజు ఎడ్మండ్ హిల్లరీ, టెన్జింగ్ నార్కే ఎందుకు ఎక్కారు? అదొక మనిషిలోని సామర్థ్యానికి ఎక్స్‌ప్రెషన్. అందరికీ 99.99% రానక్కర్లేదు, అందరూ ఐఏఎస్, ఐపీఎస్ కానక్కర్లేదు. ప్రతి ఒక్కరి లోపల ఒక అంతర్గత తపన ఉంటుంది, నేనేదో చేయాలి అని చెప్పి. అది చేయాలి, ఇది చేయాలి అని చెప్పి. వాటన్నిటికీ ఒక ప్లాట్‌ఫాం నిర్మించాలి. ఆ ప్రయత్నం నేను చేశాను. తర్వాత నేను సాంప్రదాయక విద్యకి.. అంటే, రోజూ క్లాస్‌రూంకి పోయి చెప్పటం, సిలబస్ చెప్పానా అని చూసుకుంటూ, ఆ ప్రకారం పాఠాలు పూర్తి చేయటం, జనవరి నెలలో రివిజన్ మోడ్‌లోకి వెళ్లిపొండని చెప్పటం, ఎట్లాగూ మార్చిలో ఎగ్జామ్స్ వస్తాయి, తర్వాత మార్చి అయిపోయిన వెంటనే విద్యా సంవత్సరం

అయిపోతుంది, ఆ తర్వాత ఆగస్టులో వచ్చే అకడమిక్‌కి వెళ్లిపొండి అని చెప్పటం.. ఆ పద్ధతికి నేను వ్యతిరేకం. నాది అసాంప్రదాయ ఆలోచనాతీరు. ప్రతి మూడవ శనివారం పారిశుధ్య కార్మికురాలిని, 70–80 సంవత్సరాల బామ్మను పిలిపించండి, తర్వాత అమ్మమ్మను, తాతను, తర్వాత అగ్నిమాపక శాఖ కార్మికుడ్ని పిలిపించండి, కానిస్టేబుల్‌ను, జైలు నుంచి విడుదలైన ఖైదీలను పిలిపించండి, వాళ్లతో విద్యార్థులకు ఇంటరాక్షన్ కలిపించండి. అదేవిధంగా వేసవి సెలవల్లో విద్యార్థులకు ప్రాజెక్టులిద్దాం. ఆ సెలవల్లో విద్యార్థులు ఇళ్లకు పోకుండా వాళ్లకి గుర్రపు స్వారీ క్యాంపులు, తర్వాత డ్యాన్సింగ్ క్యాంపులు ఏర్పాటు చేయటం. అంటే పేదవర్గాల్లో సాధికారత భావం పెంచటం. ఆ అవసరం ఉంది. ఉదాహరణకు, దళితులు రాజస్థాన్‌లో గుర్రమెక్కితే రాళ్లతో చంపేస్తారు, మీసాలు పెంచితే చంపేస్తారు. అలాంటి పరిస్థితి నుంచి ఇక్కడ ఎస్.సి, ఎస్.టి, బీసీ, మైనారిటీ వర్గాలకు, పేద వర్గాలకు ఆత్మవిశ్వాసం ఇవ్వటం. విద్యార్థులు వాళ్లు ఏ కులానికి చెందినవాళ్లయినా, ప్రత్యేకించి అమ్మాయిలు వాళ్లు గుర్రపుస్వారీ ఎందుకు నేర్చుకోకూడదు? వాళ్లు స్విమ్మింగ్ ఎందుకు నేర్చుకోకూడదు? కాబట్టి అసాంప్రదాయమైన రీతిలో, ప్రభుత్వ విద్యలో ప్రయోగం చేయటానికి చాలా అవకాశం ఉంది. పీటర్ గ్రే మోడల్. ఆ మోడల్ ఏంటి? ఫ్రీడం. ఫ్రీడం. అంటే మొత్తం ఎంత సిలబస్ ఉన్నా, ఎక్కడికక్కడ ఆ సిలబస్‌ని మరింత సరళీకరించి, మరింత ఆధునీకరించి, ఆడుతూపాడుతూ నేర్పించటం. క్లాస్‌రూంలో ఒక రోజంతా పాఠం చెప్పకుండా, విద్యార్థులు, టీచర్లు కూడా ఆటలు ఆడటం, తర్వాత ఎవరు గెలుస్తారో చూడటం. దాని తర్వాత ఒకరోజు టీచర్లు రాకుండా పిల్లలే పాఠాలు చెప్పేలా చూడటం. దాని తర్వాత పిల్లలే ప్రశ్నల్ని తయారు చేయటం. అసలు రోజంతా కేవలం ప్రశ్నలు. టీచర్‌ను ప్రశ్నిస్తుండటం. కాబట్టి ఆ విధంగా పెట్టే ప్రయోగం అన్నది ఏదో ఒక పాఠశాలకు మాత్రమే పరిమితం కాకుండా కమ్యూనిటీలో సర్క్యులేట్ చేశాను. అంటే కమ్యూనిటీ ఇక్కడ విద్యా ప్రణాళికలో భాగమైంది. ఈ ప్రణాళిక అమలు, కొనసాగించటం, ఫలితాలు సాధించటంలో కూడా కమ్యూనిటీలు భాగస్వాములయ్యారు. కొనసాగించటం చేయకపోతే ప్రవీణ్ తర్వాత అంతా మూతపడుతుంది. నా తర్వాత రొనాల్డ్ రాస్ అని ఇంకొకరు వచ్చారు, ఆ తర్వాత ఇప్పుడు నికొలస్ అనే ఇంకొకాయన. కానీ వీళ్లు ఏ ప్రయోగాన్ని కూడా ధ్వంసం చేయలేదు. అధికారుల్లో సాధారణంగా నెక్స్ట్ మ్యాన్ సిండ్రోమ్ ఉంటుంది. ఆయనకన్నా నేను గొప్పగా చేశాను, మొత్తాన్నీ తీసిపారేసి మళ్లీ జీరో నుంచి మొదలుపెడదాం అంటుంటారు. కానీ నేను చేసిన ఒక గొప్ప విషయం ఏమిటంటే, నేను డీప్రవీణైజ్ చేయగలిగాను. అంటే, వ్యవస్థీకృతం చేయగలిగాను. నాతో ముడిపడే విధంగా నేను చేయలేదు. ఇన్‌స్టిట్యూషనలైజ్ చేయగలిగాను. ఇయ్యాల 'స్వేరో' అనే పదం ద్వారా విద్యార్థులు, దళిత, బడుగు, బలహీన, నిమ్న అనే ఐడెంటిటీలను నిర్మూలించా. కొత్త అస్తిత్వం ఇచ్చి తమ సానుకూలతల్ని ఆత్మవిశ్వాసంతో చాటి చెప్పేలా వాళ్లకి 10 సెల్ఫ్ ఎఫర్మేటివ్ కమాండ్‌మెంట్స్ ఇచ్చాను. అయాం నాట్ ఇన్‌ఫీరియన్ టు ఎనీ ఒన్, ఐ షల్ బి ది లీడర్ వేరెవర్ ఐయాం, ఐ షల్ డూ వాటెవర్ ఐ లవ్ అండ్ బి డిఫరెంట్, ఐ షల్ ఆల్వేస్ థింక్ బిగ్, ఐ షల్ నెవర్ బ్లేం అదర్స్ ఫర్ మై ఫెయిల్యూర్స్, ఐ షల్ నైదర్ బెగ్, నార్ చీట్, ఐ షల్ రీ పే వాట్ ఐ బారో, ఐ షల్ నెవర్ ఫియర్, ఐ షల్ నెవర్ గివప్. ఇలాంటి కమాండ్‌మెంట్స్ ఇచ్చి వాళ్లకో కొత్త ఐడెంటిటీ ఇచ్చాను. ఈవేళ స్వేరో అనే పదం ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో స్థానం పొందిందని మీకు సగర్వంగా తెలియచేస్తున్నాను, ఆనందాన్ని పంచుకుంటున్నాను. అవును, స్వేరో ఇప్పుడు అక్స్‌ఫర్డ్ డిక్షనరీ పదం. అంటే, ఒక మంచి ఏర్పాటును వ్యవస్థీకృతం చేయటమనేది చాలా చాలా ముఖ్యం సార్. కరోనా ప్యాండమిక్ సమయంలో మాకు అతి పెద్ద సవాలు ఎదురైంది. కానీ మా పిల్లలు సమర్థంగా ఎదుర్కొన్నారు. వాళ్లకి మేం ఇచ్చిన ట్రైనింగ్ వల్ల వారు ప్రతికూల పరిస్థితుల్లోనూ చొరవగా వ్యవహరించారు. కరోనా సమయంలో పిల్లలంతా ఇళ్లకు వెళ్లారు. డిజిటల్‌కి డబ్బుల్లేవు. సెల్‌ఫోన్లు లేవు, ఉన్నచోట్ల కనెక్టివిటీ ఉండదు. అప్పుడేం చేశారూ వాళ్లు– సీనియర్స్, అంటే 8వ తరగతి నుంచి ప్రతి ఒక్కరూ కూడా విలేజ్ లెర్నింగ్ సర్కిల్స్ పెట్టారు. వాళ్ల ఇళ్లల్లోనే కిచెన్ గదిలో, చెట్ల కింద, దేవాలయాల్లో, చర్చిల్లో 10 మంది చుట్టుపక్కల పిల్లల్ని తీసుకొచ్చి పాఠాలు చెప్పారు. మేం వాట్సప్ మెస్సేజిలో పెడితే, డౌన్‌లోడ్ చేసుకుని పిల్లలకు పాఠాలు చెప్పారు. గోడల మీద, ఎక్కడ వీలుంటే వాటి మీద రాస్తూ పాఠాలు చెప్పారు. కాబట్టి ఆ ఆత్మవిశ్వాసం వల్లే సాంఘిక సంక్షేమ స్కూళ్లలో చదివిన పిల్లలు ఈవేళ ఢిల్లీ యూనివర్సిటీలో, విదేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీల్లో చదువుతున్నారు. ఈ మొత్తాన్నీ నేను ప్రభుత్వం ఇచ్చిన అదే డబ్బుతోనే చేశాను. నాకు ఒక పైసా అదనంగా ఇవ్వలేదు, ఒక్క పైసా తగ్గించలేదు.

**జేపీ:** ఇది కీలకం. ప్రవీణ్ అక్కడ చేయగలిగితే అంత డబ్బు ఖర్చుపెడుతున్నా పిల్లల మీద మిగతా చాలా చోట్ల ఫలితాలు రావటం లేదు. తెలంగాణలో 80,000 ఏడాదికి ఒక్కో బిడ్డ మీద ప్రభుత్వ పాఠశాలల్లో ఖర్చు చేస్తున్నారు. ఏపీలో ఇంకొంచెం ఎక్కువ. ఎందుకంటే, వాళ్లేదో 'అమ్మఒడి' అని చెప్పి చెప్పి, అది కూడా విద్యలో కలిపేశారు. 90–95 వేల దాకా ఖర్చు పెడుతున్నారు. వివిధ రాష్ట్రాల్లో వివిధ స్థాయిలో ఉంది. దేశమంతా ఎందుకు జరగటం లేదు? మనకు 28 కోట్ల మంది పాఠశాల విద్యార్థులున్నారు. ప్రవీణ్ చెప్పింది స్ఫూర్తిదాయకం. గుండె ఉప్పొంగుతుంది. అందులో

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వాళ్లకి, ప్రభుత్వ స్కూళ్ల నుంచి వచ్చిన నాలాంటి వాళ్లకు మనసు ఉప్పొంగుతుంది. ఈ దేశంలో 28 కోట్ల మందికీ గనక ఈ అవకాశం అందితే, దట్సాల్. దేశంలోని సమస్యలన్నీ పరిష్కారమైపోయినట్లే. అది ప్రజాస్వామ్యం కావచ్చు, సమాజం కావచ్చు, ఆర్థిక వ్యవస్థ కావచ్చు, పరిపాలన కావచ్చు, చట్టబద్ధపాలన కావచ్చు, అన్నీ పరిష్కారం. అన్నిటికీ ఇది పునాది. ఇది పూర్తిగా సాధ్యం కూడా. ఎందుకంటే డిమాండ్ ఉంది. కానీ తపన లేదు. ప్రభుత్వాలు, అత్యున్నత నాయకత్వ స్థాయిల్లో ప్రాణమొడ్డయినా ఇది సాధించుదామన్న సంకల్పం ఉన్నట్లయితే, ఈ ఒక్క విషయంలో, అందరికీ కాకపోయినా, నాయకత్వానికైనా సంకల్పం ఉండాలి గదా, పూర్తిగా సాధ్యం. అన్నీ ఉన్నాయి. వీళ్లు అదనంగా పైసా డబ్బు ఖర్చు పెట్టనక్కర్లా. ఆ డబ్బును పునర్వ్యవస్థీకరించుకునే అవకాశం ఇస్తే, అద్భుతాలు సృష్టించవచ్చు. పద్ధతుల్ని మార్చితే.

ఆర్ఎస్పీ: డాక్టర్ జేపీ చెప్పినదానికి ఒకటే కరెక్షన్– నిజానికి ఏ రాజకీయ నాయకుడు కూడా ఇది చెయ్యండి, అది చెయ్ అని మాకు చెప్పలేదు. నిజాయతీగా చెబుతున్నా. సీఎంగానీ, మినిస్టర్‌గానీ. నేను అదే వ్యవస్థ నుంచి పుట్టాను, అదే హాస్టల్‌లో చదువుకున్నాను, అదే ప్రభుత్వ పాఠశాలలో, గ్రామీణ ప్రాంతాలలో, జీవితాంతం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను, మూరుమూల అటవీ ప్రాంతాల్లో చదువుకున్నాను. మాకు అందలేనిది ఈ పిల్లలకు అందించాలనే కాంక్ష ఉన్నది, కానీ ఏరోజు కూడా నువ్వు అది చెయ్, నువ్వు ఎందుకు క్లాసుల్లో అదే చెప్తున్నావు, ఇదే చెప్తున్నావు అని ఎవరూ నాకు అడగలేదు, ఒత్తిడి చేయలేదు. అందుకొరకే నైతికత మీద నేను ఎక్కువగా అంత ఫోకస్ చేస్తున్నాను. ఇది ఒకరు చెప్తే వచ్చేది కాదు. వ్యవస్థ ఎంత అద్భుతంగా డిజైన్ చేసినా, నీ లోపల ఆ తపన ఉండాలి. నా ఫేవరేట్ బుక్ ఏమిటి ఒకటి చెప్పండి అని ఎవరన్నా అడిగితే నేనేం చెప్తానంటే– మ్యాన్స్ సెర్చ్ ఫర్ మీనింగ్ అని. విక్టర్ ఫ్రాంకెల్ రాసిన 83 పేజీలో, 100 పేజీలో పుస్తకం అది. మిలియన్ల కాపీలు అమ్ముడుపోయింది. చాలా భాషల్లోకి అను వాదం అయింది. దాంట్లో ఏం చెప్తాడంటే, ఎందుకు బతకాలో నీకు అర్థమైతే, ఎలాగైనా బతకగలవు. విక్టర్ ఫ్రాంకెల్ కాన్సంట్రేషన్ క్యాంప్‌లో బతికాడు. మిగతా వాళ్లంతా చంపే యబడ్డారు, చనిపోయారు. అతని భార్యాపిల్లలు కూడా బతకలేదు. వాళ్లని కూడా చంపేశారు. ఎందుకు బతికాడంటే, అతను ఒక మనస్తత్వ సిద్ధాంతాన్ని ప్రచురించి ప్రపంచానికి పరిచయం చేయాలనుకున్నాడు. ఆ ప్రింట్ చేసే అవకాశం కోసం బతకాలనుకున్నాడు. 4 సంవత్సరాలు కాన్సంట్రేషన్ క్యాంప్‌లో బతికాడు. ప్రతి బ్యూరోక్రాట్‌కి కూడా ఆ అవకాశం వస్తుంది. రాజకీయ జోక్యం వల్ల నేను ఈ పని చేయలేకపోయానని ఎవరైతే అంటున్నారో ఆ వ్యక్తి నేరస్తుడు.

**జేపీ: ముఖ్యంగా విద్య, ఆరోగ్యం. అక్కడ ప్రవీణ్ చెప్పింది నిజం. అక్కడ ఏ ప్రభుత్వమూ అడ్డుకోవటం లేదు, పట్టించుకోవటం లేదుగానీ. ఒక రకంగా దాన్ని వరం అనుకోవాలి.**

**ఆర్ఎస్పీ:** అది వరం. కచ్చితంగా. ఒక మినిస్టర్ అన్నాడు. ఆయన పేరు చెప్పను నేను. నా దగ్గరకు వచ్చాడు. 'మేం చాలా దూకుడుగా ముందుకు పోతున్నాం. నాకు తెలుసు మా రాజకీయ నాయకులకు అది నచ్చదు. ఎందుకంటే, దూకుడు వల్ల నువ్వు పాప్యులర్ అవుతున్నావు, మేం అన్‌పాప్యులర్ అవుతున్నాం. కానీ నేను ఒకసారి నా గతం ఆలోచించుకుంటే, నీలాంటివాళ్లు ఉంటే నేను ఇక్కడ ఈ రాజకీయాల్లో ఉండాల్సినోడ్ని కాదు, ఎక్కడికో ఏ బిలియనీర్ స్థాయిలో ఉండేవాడ్ని, ఐఏఎస్ లాంటివి అయ్యుండేవాడ్ని' అన్నాడు. 'నన్నెవరకూ పట్టించుకోలా. నేను చేయలేనిపని నువ్వు చేస్తున్నప్పుడు నేను వచ్చి అడ్డుకోను' అని చెప్పాడు. పీఏలు, ఓఎస్డీలు చాలా ప్రశ్నలు వేసి, ఈయన్ని అడగండి సార్ ఈ ప్రశ్నలు అన్నారు. అడ్డుకోండి సార్ అన్నారు. మెమో ఇచ్చి డేటా, సమాచారం తీసుకురా, ఫైళ్లు తీసుకురా అని అడగండి సార్ అని చెప్పారు. ఆయన నన్ను లోపలికి పిలిపించి, 'నేను మిమ్మల్ని అడగాలనుకోవటం లేదు, నేను చేయలేని పని మీరు చేస్తున్నారు, నేను నటిస్తాను జోక్యం చేసుకున్నట్లు, మీరేం బాధపడకండి, మీరు చేసే పని మీరు చేయండి' అన్నారు. చాలా ఆనందంగా ఉంది, ధైర్యంగా ముందుకెళ్లండి అని చెప్పినవాళ్లున్నారు. కాబట్టి ఎప్పుడూ కూడా, ముఖ్యంగా మానవ వనరుల విభాగంలో, ఆరోగ్యంలోగానీ, విద్యలో గానీ ఎవరన్నా మంచిపని చేస్తున్నారంటే, ఎవరూ జోక్యం చేసుకోరు. మనకు చేతకాదు, వాళ్లు చేస్తున్నారు, పోనీ చేసుకోనీ అంటారు తప్ప. అప్పుడప్పుడు బదిలీలు లాంటి వాటి దగ్గర గొడవ చేస్తుంటారు తప్ప పాలసీ విషయంలో ఎప్పుడూ ఏ పార్టీ అయినా ఒత్తిడి చేయరు. మరి ఎందుకు జరగటం లేదు? ఇక్కడ ప్రశ్న వస్తుంది. నీకు ఎంతసేపూ ట్రాన్స్‌పోర్ట్ కమిషన్ కనిపిస్తోంది, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ పదవి కనిపిస్తుంది, జీహెచ్ఎంసీలోనే ఉండాలని, పెద్ద స్థాయి, డబ్బున్న వాళ్లతో చెట్టాపట్టాలేసుకు తిరిగే అవకాశం ఉన్న చోటకి బదిలీ అవ్వాలని ఆరాటం ఉంటుంది. కష్టపడకుండా డబ్బు, బోలెడంత అధికారం, బిళ్ల బంట్రోతుల హంగామా, బంగారం ఉంగరాలు, వజ్రాలు పెట్టుకున్నవాళ్లు, వాళ్లు తెలుసు, వీళ్లు తెలుసు అని హడావుడి చేసేవాళ్లు తన వద్దకు రావాలన్నట్లుగా ఉంటుంది. ఇక్కడ ఒక తరాన్ని తయారుచేసే సువర్ణావకాశం పోయి, అక్కడెక్కడో అద్దాలమేడలో కూర్చుని రోజూ వాళ్లతోను వీళ్లతోను మాట్లాడటమనేది రావటం.. ఆ ఎథికల్ కోర్, నైతిక మూలంలోని లోపం వల్లే జరుగుతుంది. అంటే మనం పుట్టిపెరిగిన నేపథ్యం, మనం జీవన సహచరుల నేపథ్యం, మన భార్యాపిల్లల నేపథ్యం, మనం ఉండే సమాజం అవన్నీ చాలా ప్రభావం చూపుతాయి మన మీద.

**ప్రశ్న: జేపీ సర్, ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలన్నిటినీ మెరుగుపరచాలంటే, ఆర్ఎస్‌పీగారు సాంఘిక సంక్షేమ శాఖలో చేసి చూపినట్లు, మనం జనరల్‌గా ఎలాంటి అప్రోచ్ తీసుకోవచ్చు?**

**జేపీ:** ప్రవీణ్ చెప్పింది, రెసిడెన్షియల్ కాబట్టి కొంత ప్రత్యేక సంస్కృతి ఉండొచ్చుగానీ, కానీ మౌలికంగా ఆయన చెప్పినవన్నీ ప్రభుత్వ పాఠశాలలకూ వర్తిస్తాయి. కానీ అది జరగాలంటే అక్కడ సాంఘిక సంక్షేమం పేరుతో ఒక ప్రత్యేక విభాగం ఉంది. ఏదోకరకమైన అధికార వికేంద్రీకరణ ఉంది. మిగతా చోట్ల కూడా మళ్లీ మనం జవాబుదారీతనాన్ని వికేంద్రీకరించాలి. వినూత్న రీతిలో చేయాలి. ఏ జిల్లాకి ఆ జిల్లా, వీలుంటే అంతకంటే కింది స్థాయిలో, ఆ స్కూల్ ఎడ్యుకేషన్ జిల్లా బోర్డులు పెట్టి, టీచర్లు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు అందర్నీ భాగస్వాముల్ని చేసి అక్కడ స్వేచ్ఛ ఇవ్వకపోతే ఫలితాలు తేవటం సాధ్యం కాదు. నేను జిల్లాల నుంచి హైదరాబాద్ వచ్చాక చీఫ్ సెక్రటరీగారు, ఏ రంగంలో పోజిషనైతే బాగుంటుంది అని మాట్లాడుతున్నారు. నాకు విద్యారంగంలో ఇవ్వండి అని అడిగా. ఒక అయిదేళ్లు టైమివ్వండి, నన్ను వదిలేయండి, నా మీద నమ్మకం ఉంది కదా అన్నాను. ఎవరన్నా వచ్చి ఫిర్యాదు చేసినా పట్టించుకోకండి. ఏదోకటి తంటాలు పడతాను నేను అనడిగా. అమ్మమ్మ, నువ్వు గందరగోళం చేస్తావు అన్నారు. పోనీ మూడు జిల్లాలు ఇవ్వండి అన్నా. నువ్వు సీనియర్‌వి అలా కుదరదు అన్నారు. అంటే, ఇప్పటికైనా ఆ కొత్త పోకడలకు అవకాశం ఇవ్వాలి మనం. అది వికేంద్రీకృత వాతావరణంలో జరుగుతుంది. కేంద్రీకృతంలో జరగదు. రెండోది, పిల్లలు ఏం నేర్చుకున్నారో బేరీజు వేయటం. ఇందాక ప్రవీణ్ ఒకమాట చెప్పారు. పరీక్షల్లో స్టాక్ క్వశ్చన్స్, బట్టీ పడితే, కాపీ కొడితే డిగ్రీ, ఇంజినీరింగ్ సహా గ్యారంటీ. ఏం విద్య అది? మోసం చేయటం తప్ప. నా దృష్టిలో ఈవేళ అతి తేలిగ్గా దేశాన్ని మార్చగలది పరీక్షల పద్ధతిని మార్చటం. ఎసెస్‌మెంట్‌ను గనక మారిస్తే చాలా మారుతుంది. అందరూ కోరుతున్నది సక్సెస్. తల్లిదండ్రులు, పిల్లలు సక్సెస్ కోరుతున్నారు. టీచర్లకు సక్సెస్ కావాలి, మేనేజ్‌మెంట్‌కి అదే కావాలి, సమాజం అదే కోరుకుంటుంది. కానీ సక్సెస్ నిర్వచనం మాత్రం అధ్వాన్నంగా ఉంది. దిక్కుమాలిన పరీక్షలు పెట్టి బట్టీ పట్టి కాపీ కొడితే 99% మార్కులు. దాని కోసం సమాజం మొత్తం పరిగెడుతోంది. దాన్ని మార్చండి మీరు. అదీ నిజాయతీగా. 30-40 ఏళ్ల క్రితం ఈ మాట చెప్పాల్సిన అవసరం ఉండేది కాదు. కాపీ కొట్టకుండా పరీక్షలు అని. కానీ ఈరోజు సాంకేతిక పద్ధతులున్నాయి కాబట్టి చెప్పాల్సి వస్తోంది. అది చెయ్యండి, ఆ తర్వాత మిగతావన్నీ దారికొచ్చేస్తాయి. అది రాగానే టీచర్లకి సంబంధించిన అంశం. ఉపాధ్యాయులకు ఇప్పుడు మంచి జీతాలు కూడా ఇస్తున్నారు. టీచర్లలో ఎప్పుడూ కూడా ఓ 20% మంది ప్రాణం పెట్టి పనిచేసేవాళ్లున్నారు. సొంత డబ్బులతో పనిచేసేవాళ్లున్నారు. నాకు తెలుసు. ల్యాబ్, ఎక్విప్‌మెంట్ తయారుచేయటం వంటివి చేస్తున్నారు. కానీ మిగతావారందరిలో ఇతరుల్ని చూసి, చుట్టూ ఉన్న సమాజం ప్రభావంతో మనకెందుకు అనే ధోరణి ఉంది. దాన్ని కొంచెం మార్చి వినూత్న రీతిలో ప్రయత్నం చేసినట్లయితే, ఆ వాతావరణం కల్పిస్తే చాలా తేలిగ్గా మారుతుంది. ఎందుకంటే, డిమాండ్ కోణం బలంగా ఉంది. మన సమాజంలో విద్యకున్నంత డిమాండ్ ఒక పేద దేశంలో ఎక్కడా ఉండదు. తల్లిదండ్రులు పిల్లల కోసం ప్రాణాలివ్వటానికి సిద్ధంగా ఉన్నారు. రిక్షా కార్మికులు, ఆటోడ్రైవర్లు, తట్టలు బుట్టలతో అమ్మేవారు ప్రభుత్వ పాఠశాల్లో చదువు రావటం లేదని 20-30 వేలు ఖర్చు పెట్టి ప్రయివేటు స్కూళ్లలో ఖర్చు పెట్టటానికి సిద్ధంగా ఉన్నారు. ఈమధ్య బెంగళూరులో నన్ను తీసుకెళ్తున్న ట్యాక్సీ డ్రైవర్‌ను అడిగా. తన, తన అన్నగారి పిల్లలు మొత్తం ముగ్గురికి స్కూలు ఫీజు ఏడాదికి రూ.2,50,000 కడుతున్నట్లు చెప్పాడు. అంటే ఒక్కో బిడ్డ మీద రూ.80,000. ట్యాక్సీ డ్రైవర్. అంటే ఏమిటి? ఎంత త్యాగమైనా చేసి పిల్లల్ని చదివించాలన్న తపన ఉంది. కాబట్టి డిమాండ్ చాలా బలంగా ఉంది ఈ దేశంలో. సమాజం విద్యను గౌరవిస్తుంది. ఆర్థిక వ్యవస్థకి నాణ్యమైన విద్య, ఆవిష్కరణలు కావాలి. మనం కొద్దిపాటి మార్పులు కొత్త రీతిలో చేసినట్లయితే, మనం మార్చగలమని నేను నమ్ముతున్నా. చాలా అన్యాయం చేశాం ఇప్పటికే. కానీ ఇది చేయగలం. అదృష్టవశాత్తూ వనరులు ఉన్నాయి. కొందరొచ్చి ఇంకా కొన్ని లక్షల కోట్లు ఖర్చుపెట్టాలనటం అబద్ధపు మాటలు. జరగని పనులు చెప్పి జరిగేదాన్ని నాశనం చేస్తున్నారు. అట్లాగే మరికొంతమంది వితండవాదం చేస్తున్నారు. వామపక్ష సంస్థలు సహా. మావోయిస్టులకి అనుబంధంగా ఉన్న టీచర్స్ ట్రేడ్ యూనియన్ నాయకుల రాష్ట్ర సమావేశం చాలాకాలం క్రితం జరిగినప్పుడు అందులో వాళ్లు నాతో చాలా విడ్డూరమైన వాదన చేశారు. బీదరికం పోకుండా విద్య ఎట్లా వస్తుంది సార్ అని. నేను చాలా పరుషంగా చెప్పాల్సి వచ్చింది. ఎంత మూర్ఖంగా మాట్లాడుతున్నాం? విద్య లేకుండా బీదరికం పోయిన సమాజం ఎక్కడన్నా ఉందా? మీకు అన్నీ ఇచ్చి విద్యను అందించమంటే వంకలు పెడుతున్నారే జీతాలు తీసుకుని అని. వాళ్లు పేరుకి వామపక్ష భావాలు చెప్పినా కూడా పిల్లలు బాగుపడాల, విద్య రావాలన్న తపన లేదు. ఇక్కడే మనకి సమాజంలో ఒక మౌలికమైన లోపం విషయంలో మనకి చర్చ జరగాలి బహిరంగంగా వీటితోపాటు. మైరన్ వీనర్ ఒక పుస్తకం రాశాడు. ది చైల్డ్ అండ్ ది స్టేట్ ఇన్ ఇండియా. గొప్ప సామాజికవేత్త ఎంఐటీలో పనిచేశారు. కొన్నేళ్ల క్రితం చనిపోయారు. ఎందుకు వామపక్షవాదులు అధికారంలో ఉన్న

చోట కూడా మంచి విద్య పిల్లలకు అందటం లేదు అనే అంశాన్ని తీసుకున్నాడాయన. చివరికి ఆయనొచ్చిన అభిప్రాయం ఏంటంటే, సైకాలజీ ఆఫ్ క్యాస్ట్. పుట్టుకతో వచ్చిన అసమానత విద్య రూపంలో పోవాలి. ఎదిగే అవకాశం అందరికీ రావాలి ఏ తల్లి గర్భాన పుట్టినా కూడా అనే భావన సమాజంలో రావాలి. కానీ మన సమాజంలో కులాన్ని మామూలుగా పాటించకున్నా, కులంతో నిమిత్తం లేకుండా మీ పనివాళ్లతో మీరు దయగా ప్రవర్తించినా, వాళ్ల పిల్లలకి మన పిల్లలతో సమానంగా చదువొచ్చి వాళ్ల తెలివితేటలు వికసించాలన్నది ఇంకా ఇంకలా. నాకు అనుమానం- కొంచెం పరుషంగా మాట్లాడుతున్నానేమో- నా పిల్లలతో పోటీపడతారేమోనన్న భయం కూడా కొంత ఉందేమో అనిపిస్తుంది.

**ఆర్ఎస్పీ:** అంతరాయం కలిగిస్తున్నందుకు మన్నించాలి సర్. విద్యలో ప్రభుత్వ జోక్యం ఎంత సమస్యో, పట్టించుకోకపోవటం కూడా అంతే సమస్య. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోవటం అంటే సానుకూల జోక్యం ఉండటం. ఇప్పుడు పాలకులు విద్యను అసలు పట్టించుకోవటం మానేశారు. అది కూడా ప్రమాదకరం. ఒక్కొక్కరికీ ఒక్కో కల ఉంటుంది. ఒక రాజకీయ నేతకి ఆరోగ్యం, ఇంకో పొలిటీషియన్‌కి భూమి, ఇంకొకరికి భూసంస్కరణలు, ఇంకో రాజకీయ నాయకుడికి సాగునీరు ఉంటుంది. వీటన్నిటికీ ఉమ్మడిగా వర్తించేది విద్య. ఇవన్నీ విద్య లేకుండా అర్థం కావు కదా. ఈ విద్య గురించి పట్టించుకోకపోవటం కూడా ఒక పెద్ద కుట్ర అంటాను. ఇటీవల ఒక పుస్తకం చదివాను. డేరన్ అసిమోగు, జేమ్స్ రాబిన్‌సన్ రాసిన 'వై నేషన్స్ ఫెయిల్'. దాంట్లో వాళ్లు విఫల దేశాల్ని, అభివృద్ధి చెందిన దేశాల్ని పోల్చి విశ్లేషిస్తారు. వాటి మధ్య తేడా, వ్యవస్థలు. మీ కులం, మతంతో సంబంధం లేదు. వ్యవస్థలు - ఇంతకు ముందు జేపీ గారు చెప్పారు ఈ విషయం గురించి. దాంట్లో ఒక అధ్యాయంలో ఇస్లామిక్ దేశాల్లోకి ప్రింటింగ్ ప్రెస్ పరిచయం గురించి చెబుతారు. యూరోప్ పక్కనే టర్కీ ఉంది. యూరప్‌లో 12వ శతాబ్దం తర్వాత కాలంలో ప్రింటింగ్ సాంకేతికత వచ్చింది. కానీ టర్కీకి రావాలంటే 200-250 ఏళ్లు పట్టింది. అధికారంలో ఉన్నవాళ్లు ఏమి ఆలోచించారంటే, మనం ప్రింట్ చేసి ఖురాన్ ఇవన్నీ ఇచ్చేస్తే రేపు మా మీద ప్రజలు తిరగబడతారు. సార్ ఇప్పుడు చెప్పిందదే. రేపు వాళ్లు మా పిల్లలతో పోటీ పడితే, ఈ సమాజంలో ఉండే వనరుల మీద గుత్తాధిపత్యం మాకు పోతుంది అనే భయం కూడా మన వద్ద ఉంది. నాకు ఒక మినిస్టర్ చెప్పాడు- ఓసారి మహేంద్రహిల్స్ స్కూల్‌కి ఆయన వచ్చినప్పుడు పిల్లలతో 10 కమాండ్‌మెంట్స్ చెప్పించాం. మంత్రిగారికి మంచి అభిప్రాయం కలుగుతుందని, ప్రభుత్వం ఇచ్చే ప్రతి రూపాయీ సద్వినియోగం అవుతుందనే అభిప్రాయం కలుగుతుందని అలా చేస్తాం. ఇళ్లల్లో పనిచేసే మహిళల పిల్లలు, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలు అందరూ చక్కటి ఇంగ్లిష్‌లో చెబుతున్నారు. ఆయనన్నారు నన్ను పక్కకు పిలిపించి- మా బాస్ ఇవన్నీ విన్నారంటే ఈ స్కూల్ బంద్ చేయిస్తారు అని. వాళ్ల పిల్లలు మాట్లాడే ఇంగ్లిష్, వీళ్ల మాట్లాడే ఇంగ్లిష్ రెండూ ఒకటే అయినప్పుడు, వాళ్లకంటే కూడా బాగా మాట్లాడుతున్నారన్న ఫీలింగ్ ఒక్కసారి వాళ్ల కొస్తే, అమ్మో పెద్ద ఉపద్రవానికి ఏదో నిశ్శబ్దంగా జరుగుతుందనే భావన వాళ్లకు కలుగుతుంది. కాబట్టి, ఉంటుందది. అందుకనే నేనేమంటున్నానంటే, ఈ ప్రాతినిధ్యం అనే కాన్సెప్ట్ అక్కడనే వచ్చింది. అంటే, వీళ్లకు కూడా స్వతంత్రంగా పాలకులయ్యే అవకాశం రావాలి, ఇక్కడ రాజకీయాలు, రాజకీయ ప్రాతినిధ్యం గురించి మాట్లాడటం కాదు, ఆచరించి చూపాలి. అందరూ ఆ ఇంగ్లిష్ మాట్లాడగలగాలి. అందరూ అమెరికా పోగలగాలి. ఆత్మగౌరవంతో మాట్లాడగలగాలి. ఈ ఆత్మన్యూనత భాషలో కొట్టుమిట్టాడకుండా వాళ్లు తమ సొంత అస్తిత్వాన్ని కనుగొనాలి. ఇవన్నీ వచ్చే అవకాశం రావాలి. అందుకే నేను జోక్యం చేసుకోను, వాళ్ల పని వాళ్లు చేసుకుంటారు అనుకోవటం, అది కూడా కుట్రే. బడ్జెట్ రావాలి గదా, జోక్యం లేకుంటే బడ్జెట్ రాదు, వస్తే చివరి నిముషం బడ్జెట్, మొక్కుబడి బడ్జెట్, అందరికీ చూపెట్టుకోవటం కోసమే 8,000 కోట్లు ఇచ్చాము, ఆ స్కీమ్, ఈ స్కీమ్ చివరికి అది ఏమిటి? కేవలం రియల్ ఎస్టేట్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారుతుంది. కానీ నిజంగా బ్రెయిన్ ప్రోగ్రామింగ్ జరగదు.

**జేపీ:** దాన్లో రెండు అంశాలు. నేరసమాన నిర్లక్ష్యం. కచ్చితంగా ఉంది డబ్బులు లక్షల కోట్లు పెడుతున్న దీంట్లో. రెండోది, సమాజంలో ఈ సైకాలజీ ఆఫ్ క్యాస్ట్ పోవటం. వాళు అలాగే ఉండాలంటే వాళ్లను అణచివేయటం, వంచటం కోసం నువ్వు కూడా ఒంగిపోతున్నావు, నువ్వు ఎదిగి వాళ్లు ఎదగటం సాధ్యం అన్నది మన దేశంలో మనసుకి ఇంకా ఇంకలా. బాగా ఎదిగిన సమాజాలు ఏం చేశాయి? అవకాశాలిస్తే అందరూ ఎదిగారు. ఒక విషయం మనం నైతికంగా చెప్పటం కంటే ఈ వాస్తవం అర్థమయ్యేలా చేయాలి. కొందర్ని అణచివేయాలంటే నువ్వు కూడా అలాగే ఉంటావు. ఒక వర్గం ప్రజల్ని విముక్తి గావించటమంటే నువ్వు నష్టపోవటం కాదు, నిజానికి నువ్వు కూడా లాభపడటం అని. గాంధీజీ మహిళల గురించి చెప్పారు- మహిళల్ని అణచివేతలో ఉంచినట్లయితే మీరు కూడా అణచివేతకు గురవుతారు మీకు తెలియకుండా. మహిళల విముక్తి పురుషుల విముక్తి కూడా. అణగారిన వర్గాల విముక్తి మిగిలిన మానవాళి విముక్తి. ఎదుటివాళ్లు నష్టపోతేనే నాకు లాభం అనే జీరో సమ్ గేమ్ భావన ఎక్కడో మన సమాజంలో బలంగా నాటుకున్నది. ఇది సరికాదు. అభివృద్ధి అందరికీ మంచిది. ఈ సమాజంలో అందరూ నైపుణ్యంగా లేకపోతే, తెలివి వికసించకపోతే, గౌరవప్రదంగా బతక లేకపోతే అందరూ నష్టపోతారని చెప్పటంలో విఫలమయ్యాం మనం.

# భారతదేశాన్ని పీడిస్తున్న అతిపెద్ద సమస్య




- శ్రీరామ్

భారతదేశాన్ని పీడిస్తున్న అతిపెద్ద సమస్య. ఇది చదవగానే మీకు ఏది గుర్తుకు వచ్చింది? నిరుద్యోగం? పేదరికం? విద్యా? వైద్యం? మౌలిక సదుపాయాలు? అవినీతి? ఇవన్నీ సమస్యలే అయినా అతి పెద్ద సమస్య మాత్రం మనకు వినిపించని కనిపించని OPS/ Old Pension Scheme- పాత పింఛను పద్ధతి.

నేపథ్యం: మన దేశంలో రాజకీయ నాయకుల నైతిక విలువలు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి మెల్లగా తగ్గుతూ వస్తున్నా, మన దేశం మాత్రం బాగానే పురోగమించింది. ఎందుకు అని ఎప్పుడైనా ఆలోచించారా? ఆర్థిక సంస్కరణలు వలన మనమందరం ఆర్థికంగా ముందుకు వెళ్లాం. ప్రభుత్వ ఖజానా కొంత నిండింది. ఆ ఆర్థిక వనరుల వల్ల మనకి కొంత సంక్షేమం, కొంత ఆర్థిక అభివృద్ధి వైపు వెళ్ళటానికి ప్రభుత్వాలు దోహదపడగలిగాయి. అదే ఆర్థికంగా కూడా మన పురోగమించకపోతే, మనం తిరోగమిస్తే, మన ప్రభుత్వాలు దివాలా తీస్తే మన సమాజంలో తీవ్రమైన అశాంతి కలుగుతుంది. మన ప్రభుత్వాలను దివాలా తీయించే అంత పెద్దది OPS - పాత పింఛను విధానం.




**OPS అంటే ఏంటి?:** 2004 దాకా ప్రభుత్వంలో చేరిన ప్రభుత్వోద్యోగులకు ప్రభుత్వం పింఛన్లు ఇచ్చే విధానం. దీని ప్రకారం పదవీ విరమణ తర్వాత ప్రభుత్వ ఉద్యోగికి వాళ్ళ జీతంలో 50 శాతం పింఛను ఇస్తారు. ఈ పింఛను PRCలతో, DAలతో పెరుగుతూ ఉంటుంది. ఈ డబ్బులు ప్రభుత్వాల వార్షిక బడ్జెట్‌లో నుండి కేటాయిస్తారు. ఈ కేటాయింపు ఎంత ఉందంటే రాష్ట్రం ఆదాయంలో 25-30% దాకా వచ్చేసింది. మీరు చదివింది నిజమే. 25-30%. అంటే మనం పన్ను కట్టే డబ్బులలో, ప్రభుత్వ ఆదాయంలో, ప్రతి నాలుగు రూపాయలలో ఒక రూపాయి ఈ పింఛనుకు వెచ్చిస్తున్నారు. ప్రభుత్వోద్యోగుల సంఖ్య కార్మికశక్తిలో 3 శాతం మాత్రమే. అంటే 97 శాతం మంది కట్టే పన్నుని 3 శాతం మందికి ఖర్చు చేస్తున్నారు.

**పరిష్కారం ఏమిటి?:** అన్ని దేశాలలో పింఛను విధానం ఎలా ఉందో మనం కూడా అదే విధానం అమలు చేస్తే సరి. అది ఏంటంటే, ప్రతి నెలా ప్రభుత్వ ఉద్యోగి ఉద్యోగం చేస్తుండగా జీతంలో 10 శాతం మరియు ప్రభుత్వం 10-14 శాతం ఉద్యోగి పింఛను ఖాతాలో జమ చేస్తారు. ఈ ఖాతాలో జమ అయ్యిన డబ్బులని పెట్టుబడి పెట్టి, పెంచి ప్రభుత్వోద్యోగికి పింఛనుగా పదవీ విరమణ తర్వాత ఇస్తారు. శుభవార్త ఏంటంటే ఈ విధానం 2004 నుండి ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారికి ఇప్పటికే వర్తింపచేస్తారు. దానినే NPS (నేషనల్ పెన్షన్ స్కీం) అంటుంటారు. ఇలా చాలా బాగా అమలు చేశారు.

**మరి ఇబ్బంది ఏంటి?:** 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన ప్రభుత్వోద్యోగులకు వారి వారి NPS ఖాతాలో ఈ డబ్బు క్రమంగా జమ అవుతున్నా మాకు పాత పింఛను విధానంలో లాగా మేము ఏమీ జమ చెయ్యకుండా మాకు చాలా ఎక్కువ పింఛను కావాలి అని పట్టుపట్టి పోరాటాలు చేస్తున్నారు. ఈ పోరాటం రైతుల పోరాటం లాగా, నిరుద్యోగుల పోరాటం లాగా మనకి బయటకి కనిపించదు. కానీ ప్రభుత్వోద్యోగులు గట్టిగా పోరాడుతున్నారు. ఈ పోరాటాలకి లొంగి అప్పుడే 5 రాష్ట్రాలలో రాష్ట్ర ప్రభుత్వాలు పాత పింఛను పద్ధతినే మళ్ళీ అమలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే చాలా రాష్ట్రాలలో పాత పింఛను పద్ధతినే అమలు చేస్తానని హామీ ఇచ్చేశారు.

**దాని వల్ల నాకు వచ్చే ఇబ్బంది ఏంటి?:** ఇప్పటికే 25-30 శాతం రాష్ట్ర డబ్బులు పింఛను కోసం ఖర్చు పెడుతున్న ప్రభుత్వాలు కాలక్రమేణా 20 సంవత్సరాలలో 40-45 శాతం పింఛనుకి మాత్రమే ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి వస్తుంది. అంటే 15-20 సంవత్సరాలలో పాత పింఛను అమలు చేస్తున్న, చేయబోతున్న రాష్ట్రాలు దివాలా తీస్తాయి అని అనటంలో ఏ మాత్రం అనుమానం లేదు. అప్పుడు మనకి ఇప్పుడు అరకొరగా అందుతున్న కనీస ప్రభుత్వ సేవలు అందనే అందవు. మన మీద పన్నుల భారం ఇంకా పెరిగిపోతుంది. ఈ ప్రభుత్వాలు కనీస ఖర్చులు కూడా చేయలేని పరిస్థితికి వచ్చేస్తాయి. మనం ఇప్పుడు దీని గురించి పట్టించుకోకపోతే మన జీవితకాలంలో ఈ దుస్థితి మనం చూస్తాం. మన రాష్ట్రాల ఆర్థిక ప్రగతితో పాటు మనకు ఉన్న ఆర్థిక అవకాశాలు కూడా మెల్లగా తగ్గిపోతాయి.

**పార్టీలు ఎందుకు భయపడుతున్నాయి?:** 3% మాత్రమే ఉన్న ప్రభుత్వోద్యోగులు కలిసికట్టుగా పాత పింఛను విధానానికి సమ్మతించిన పార్టీలకు మాత్రమే ఓటు వేస్తాం అని కరాకండిగా చెప్పేశాయి. దీనివల్ల నష్టపోయే మనలాంటి వాళ్ళకి నష్టపోతున్నామని తెలియదు. పార్టీలు పాత పింఛను విధానానికి వ్యతిరేకంగా పని చేస్తే ప్రభుత్వోద్యోగులు వాళ్ళకి ఓటు వేయరు సరికదా వాళ్ళ దగ్గరికి సేవల కోసం వచ్చే పదిమందికి ఓటు వేయొద్దని చెబుతారు. ఎవరి కోసం పార్టీలు మాట్లాడాలో వారికి దీని గురించి తెలియదు. రాజకీయ పార్టీలు OPSకు వ్యతిరేకంగా మాట్లాడితే వారి నిజాయితీ వల్ల లాభం లేకపోగా వారికి విపరీతమైన నష్టం.

**నేను ఏమి చేయగలను:** ఈ OPS వల్ల జరిగే నష్టాన్ని పదిమందికి చెప్పండి. Loksatta/FDR JP గారు మరియు శేఖర్ గుప్త గారు దీని గురించి చెప్పారు. చెప్తూనే ఉన్నారు. మీరు దానికి సంబంధించిన వెబ్‌సైట్‌లో (refuseops.in)లైక్ చేసి, ఆ వెబ్‌సైట్‌ను పదిమందికీ షేర్ చెయ్యండి. మామూలు ఓటరుకు దీని మీద అవగాహన వస్తే ఒక 10% మందికి OPS వల్ల వచ్చే నష్టం గురించి అవగాహన ఉంది అని పార్టీలు అనుకుంటే ఈ 10% ఓట్లు మనకి రావు అని అనుకుంటే మనం మన దేశానికి ఉన్న అతి పెద్ద సమస్యని ఎదుర్కోవటానికి మన వంతు సక్రమంగా చేసినట్టే.

## దేశమే గెలిస్తే ఎవరు ఓడినట్లు?. దేశమే ఓడితే ఎవరు గెలిచినట్లు?

# పార్టీల మేనిఫెస్టోల మతలబు ఏమిటి?

**-బండారు రామ్మోహన రావు,** సెల్ నెంబర్:98660 74027

దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 30వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ దశలో పార్టీల పరస్పర విమర్శలు అనుచిత ఉచితాల మేనిఫెస్టోలు, పరస్పర రాజకీయ విమర్శలు ప్రతి విమర్శలు చూస్తుంటే “దేశమే ఓడిపోతే గెలిచేది ఎవరు? దేశమే గెలిస్తే ఓడేది ఎవరు?”అన్న భారత ప్రప్రథమ ప్రధాని పండిత్ జవహర్లాల్ నెహ్రూ అన్న మాటలు గుర్తొస్తున్నాయి.

దేశ శాశ్వత ప్రయోజనాలను పక్కనపెట్టి,ప్రజల ఉజ్వల భవిష్యత్తును తాకట్టుపెట్టి తాత్కాలిక ఎన్నికల ప్రయోజనాల కోసం దేశవ్యాప్తంగా అన్ని సాంప్రదాయ పార్టీలు అనుచిత ఉచితాల పేరు మీద ప్రజలు కట్టే పన్నుల డబ్బులను పందేరం చేస్తున్నాయి. అలాగే కార్పొరేట్ సంస్థల వ్యక్తులకు కొమ్ము కాస్తూ రైట్ ఆఫ్ ల పేరు మీద లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పంచి పెడుతున్నాయి. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఎన్ని జిమ్మిక్కులు అయినా చేసి వ్యక్తిగతంగా తాము,అధికారం కోసం పార్టీలు గెలవాలని కోరుకుంటున్న సందర్భంగా నెహ్రూ మాటలు మరొక్కసారి గుర్తు చేసుకోవాల్సిన సందర్భం వచ్చింది.



“గాంధీ పుట్టిన దేశం రఘురాముడు ఏలిన రాజ్యం ఇది సమతకు మమతకు సంకేతం” అన్న పాటను పాడుకున్న మనమే “ “గాంధీ పుట్టిన దేశమా ఇది. నెహ్రూ కోరిన సంఘమా ఇది” అని ప్రశ్నించే పాటను కూడా పాడుకోవలసిన పరిస్థితులు ప్రస్తుతం కనిపిస్తున్నాయి. వ్యక్తి కంటే పార్టీ ముఖ్యమని పార్టీ కంటే దేశం ముఖ్యమనే విలువలను రోజురోజుకు కాల రాస్తూ విలువలకు వలువలు విప్పుతూ ఆట నియమాలు మార్చే సంగతి అటుంచి ఆటగాళ్లు మాత్రమే మారుతున్న ఎన్నికల సందర్భం ఇది.

దేశవ్యాప్తంగా డెంగ్యూ,చికెన్ గునియా జ్వరాల వ్యాప్తి వేగంగా జరుగుతుంది.దాంతో పాటు అక్టోబర్ 5 నుండి నవంబర్ 19 వరకు మన దేశంలో జరిగే వన్డే ప్రపంచ కప్ సంబరాల జ్వరం ఒకవైపు కొనసాగుతుంది. మరోవైపు తెలంగాణ చత్తీస్ గడ్ మధ్యప్రదేశ్ రాజస్థాన్ మిజోరం రాష్ట్రాల ఎన్నికలకు షెడ్యూలు వచ్చింది.నవంబర్ 30 నాటికి ఈ ఐదు రాష్ట్రాలలో విడతల వారీగా పూర్తవుతుంది. ఒకవైపు దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ బిజెపితో సహా తెలంగాణలో ప్రాంతీయ పార్టీ అయిన భారత రాష్ట్ర సమితి తో సహా అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే తమ పార్టీ అభ్యర్థుల జాబితాలు వెల్లడించాయి. అలాగే మరోవైపు తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామనే విషయాలను వివరిస్తూ మేనిఫెస్టోలు విడుదల చేశాయ. దేశంలో పోలింగ్ జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల జ్వరం కరోనా వైరస్ కంటే వేగంగా పరిగెడుతుంది.

**ఒకరి కంటే ఒకరు.....**

2024లో జరిగే లోక్‌సభ ఎన్నికలకు ప్రీ ఫైనల్‌గా భావించే ఐదు రాష్ట్రాల ఎన్నికలను అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన పార్టీ ప్రచారంలో తల మునకలై ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే ఆయా రాష్ట్రాలలో ఆయన వరస పర్యటనలు చేశారు. తెలంగాణలోనూ జాతీయ పార్టీల ప్రధాన నాయకుల వరస పర్యటనలు జరుగుతూనే ఉన్నాయి. అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రంలో వరస ఎన్నికల సభలలో ప్రసంగిస్తున్నారు. ఉచిత హామీల తాయిలాలు గుప్పించే మేనిఫెస్టో ప్రకటనలో అన్ని పార్టీల కంటే కాంగ్రెస్ పార్టీ ముందుంది.మూడు పువ్వులు ఆరు కాయల సామెతను గుర్తు చేస్తూ 6 గ్యారంటీలు 12 హామీలు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇప్పటికే తన మేనిఫెస్టోను ప్రకటించింది. కాంగ్రెస్ ఇస్తున్న ఈ గ్యారెంటీలు, హామీలన్నీ తాము ఇప్పటికీ అమలు చేస్తున్న పథకాలకు కొనసాగింపు మాత్రమే తప్ప మరొకటి కాదని బిఆర్ఎస్ పార్టీ వాదిస్తుంది. ఒక్క కొత్త పథకం కూడా కాంగ్రెస్ ప్రకటించలేదని రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ విమర్శిస్తుంది.

**నేనే గ్యారెంటీ అంటున్న మోడీ!!!**

కాంగ్రెస్ పార్టీగా మాత్రమే గ్యారెంటీ ఇచ్చింది కానీ తెలంగాణ సమాజానికి “నేనే గ్యారెంటీ” అని నరేంద్ర మోడీ తనకు తానే కితాబు ఇచ్చుకొని గతంలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేసిన డీకే బారువా “ఇందిరాయే ఇండియా-ఇండియాయే ఇందిరా” అనే మాటలను గుర్తు చేశారు.

**ఎన్నికలప్పుడే ఓడ మల్లయ్యలా?**

గత తొమ్మిదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీల ఊసే తలవని ప్రధానమంత్రి మోడీ కృష్ణా జలాల వివాదం పరిష్కారానికి ఇప్పటికే అమలులో ఉన్న బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కి అప్పజెప్పడం మొదలుకొని పసుపు బోర్డు ఏర్పాటు,గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు, దేశవ్యాప్తంగా ఉజ్వల గ్యాస్ వినియోగదారులకు మొన్నటి నుండే అమలవుతున్న 200 రూపాయల సబ్సిడీ కి తోడుగా కొత్తగా మరొక 100 రూపాయల సబ్సిడీ అదనంగా పెంచారు. “రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా” అన్నట్లు ప్రధానమంత్రి ప్రకటన తర్వాతే యూనియన్

క్యాబినెట్ వీటిని ఆమోదించింది. ఇక కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే మొన్నటికి మొన్న కర్ణాటకలో ఇచ్చిన ఐదు హామీలకు తోడు మరొక హామీని జతపరిచి తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలు 14 పథకాలను ప్రకటించింది. ఇందులో ప్రధానంగా గ్యాస్ బండ సబ్సిడీని బిజెపి 300కు పరిమితం చేస్తే గృహ వినియోగ దారులందరికీ కూడా తమ పార్టీ అధికారంలోకి వస్తే ఐదువందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటన చేసింది దానికి తోడు ప్రతి ఇంటికి 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు ఇస్తామని కూడా వారు చెప్పారు. దానికి తోడు రాష్ట్రంలోని 18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి నెల 2500 జీవన భృతిని కూడా ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది.ఇక టిఆర్ఎస్ కాంగ్రెస్ మా పథకాలనే నకలు కొట్టింది అని విమర్శిస్తూనే తెల్ల కార్డు కలిగిన కుటుంబాలలో ఉన్న మహిళలకు నెలకు 3000 రూపాయలు పెన్షన్ ఇస్తామని ప్రకటించింది అలాగే రాష్ట్రంలో ఉన్న 93 లక్షల తెల్లకార్డుదారులకు అందరికీ ఐదు లక్షల ఉచిత భీమా సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని ప్రకటించింది. అలాగే గ్యాస్ బండ 400 రూపాయలకు అందిస్తామని బిఆర్ఎస్ ప్రకటించింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ టిఆర్ఎస్ తమ పథకాలను కాపీ కొట్టిందని విమర్శిస్తుంటే టిఆర్ఎస్ కొనసాగింపును మాత్రమే కాంగ్రెస్ తీసుకుంటుందని ప్రతి విమర్శ చేస్తుంది.

**ఇచ్చిన హామీలు అమలయ్యేనా?**

ప్రస్తుతం కాంగ్రెస్ డిఆర్ఎస్ తోపాటు రేపు బిజెపి ప్రకటించబోయే ప్రజలకు ఇచ్చే ఉచిత హామీల సంగతిని ఒకసారి పరిశీలిస్తే ఇవి అమలు అయ్యేవేనా అని అనిపిస్తుంది. ఇప్పటివరకైతే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలకు ప్రతి సంవత్సరం సుమారు 70,000 కోట్ల రూపాయల ఆర్థిక వనరులు అవసరమవుతాయి. టిఆర్ఎస్ ప్రస్తుతం తెలంగాణ ప్రజలకు ఇస్తున్న అమలు చేస్తున్న హామీల కంటే పెంచిన కొనసాగింపుకు కొత్త హామీల అమలుకు మరొక 30 వేల కోట్ల రూపాయలు అదనపు భారం రాష్ట్ర ప్రభుత్వం పై పడుతుంది. ఇక బిజెపి హామీల సంగతి తెలిస్తే ఇంకా ఎంత భారం పడుతుంది అనేది సరైన అంచనాకు రావచ్చు.

ప్రజాస్వామ్య విలువలతో, అంతర్గత ప్రజాస్వామ్యంతో, ఉమ్మడి రాజకీయ నాయకత్వంతో నడవాల్సిన రాజకీయ పార్టీలు ఏక వ్యక్తి పాలనలో మగ్గిపోతున్నాయి. ఇక ప్రాంతీయ పార్టీలు అన్ని ప్రైవేట్ ఆస్తులుగా మారిపోయాయి.పార్టీ అంటే తామే,తామంటే పార్టీయే అనే విధంగా ప్రాంతీయ పార్టీల వ్యవస్థాపకులు వ్యవహరిస్తున్నారు.

ఈ దశలో రాష్ట్రాల ఖజానాతో ఆర్థిక వెసులుబాటు, సాధ్యాసాధ్యాలతో నిమిత్తం లేకుండా ఒకరి కంటే ఒకరు అన్ని వర్గాల ప్రజలకు అనుచిత ఉచిత హామీలు ఇబ్బడి ముబ్బడిగా ఇచ్చాయి. ఇంకా ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది కొత్త హామీలు ఇవ్వనున్నాయి. రాష్ట్రాలలో అభివృద్ధి, మౌలిక వసతులు ఏర్పాటు విద్య,ఆరోగ్య సేవల మెరుగుదల, యువతకు ఉపాధి, వ్యవసాయాన్ని లాభసాటి చేయడం, అసంఘటిత రంగ కార్మికులకు ఉపాధి కల్పించడం, రోడ్లు,వీధి దీపాలు,మురుగు కాలువలు నిర్మించడం, సాగు, తాగునీటి సౌకర్యం కల్పించడం, నివాసయోగ్యమైన గ్రామాలు, పట్టణాలను తీర్చిదిద్దడం ఇలాంటి అవసరమైన పనులను పక్కనపెట్టి "ఫక్తు"నగదు బదిలీ స్కీములను ప్రవేశపెట్టి ఆలోచనలతో అన్ని సాంప్రదాయ రాజకీయ పక్షాలు ఒకరిని మించి మరొకరు పోటీలు పడుతున్నాయి.

**తమిళనాడు రాష్ట్రాన్ని తలదన్నిన బి.ఎస్.పి హామీలు**

ఇక తెలంగాణ రాష్ట్రంలో మరొక జాతీయ పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ (బి ఎస్ పి.) ప్రకటించిన బిఎస్పీ మేనిఫెస్టో చూస్తే వారు కూడా అనుచిత ఉచితాలను ఎన్నింటినో సాంప్రదాయ రాజకీయ పక్షాల కంటే ఎక్కువే ఇచ్చేటట్టు కనిపించింది. అందులో ప్రధానంగా మహిళలకు వాషింగ్ మిషన్లు, లాప్‌టాప్‌లు, మిక్సీలు, గ్రైండర్లు ఇస్తామని హామీలు కూడా గుప్పించారు. ఈ హామీలు చూస్తే తమిళనాడు రాజకీయాలు గుర్తుకొస్తున్నాయి. మిక్సీలు గ్రైండర్లు వాషింగ్ మిషన్లు టీవీలు ల్యాప్టాప్ లు సైకిళ్ళు,మోపెడ్లు మన తెలంగాణ రాష్ట్రంలో కూడా రాజకీయ ఎన్నికల మేనిఫెస్టో హామీలుగా చేరిపోయాయి.

**కార్పొరేట్లకు రైట్ ఆఫ్ లు సబబేనా?**

**పేదలకు ఉచితాలు వద్దా?**

ఈ ఉచిత హామీలను వ్యతిరేకించే వాదనకు వ్యతిరేకంగా దేశంలో మరొక వాదన వినిపిస్తుంది. కార్పొరేట్ సంస్థలకి పలుకుబడి ఉన్న వ్యాపారులకి లక్షల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేస్తూ వాటిని రైట్ ఆఫ్ గా పేర్కొంటూ ప్రజల సొమ్మును పెద్దలకు పందేరం చేస్తున్న ప్రభుత్వాల సంగతి ఏమిటని వీరు ప్రశ్నిస్తున్నారు. ఈ వాదన కూడా నిజమే ఎందుకంటే భూములతో పాటు ఇతర ఉత్పత్తి వనరులు,సంపద అంతా ఒకవైపు కేంద్రీకృతం అవుతున్న సమాజంలో పేద ప్రజల జీవన భద్రతకు అవసరమైన చర్యలు ఆయా ప్రభుత్వాలు చేపట్టాల్సిందే. కానీ అవి శృతి నుంచి రాగానే పడ్డప్పుడు మాత్రమే కష్టాలు వస్తాయి

**ఉద్యోగుల పాత పెన్షన్ విధానం మరింత ప్రమాదకరం**

ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు సంబంధించిన పాత పెన్షన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా రాష్ట్రాల్లో రద్దుపరిచింది. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని గత 20 ఏళ్లుగా కొనసాగిస్తుంది. ఆయా రాష్ట్రాలు దీనికి ఒప్పుకొని ఈ పెన్షన్ విధానాన్ని అవలంబిస్తున్నాయి. కానీ ప్రస్తుతం ఉద్యోగుల వత్తిడికి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మళ్ళీ ఓల్డ్ పెన్షన్ స్కీంకు మళ్ళీ మళ్లు తున్నారు. దానివల్ల రాష్ట్ర ఆర్థిక స్థితి మరింత అధ్వానంగా మారుతుంది.

**ఏది ఉచితం ఏది అనుచితం**

అవసరమైన సంక్షేమ పథకాలు ఎవరూ వద్దనరు. మెరుగైన సమాజం కోసం సంక్షేమం, అభివృద్ధి రెండు కూడా బండి చక్రాల్లాగా కొనసాగాల్సిందే. అనవసర అనుచిత ఉచితాలు వ్యతిరేకించాల్సిందే.ఓటు బ్యాంకు రాజకీయాల విషవలయంలో అన్ని అధికార, విపక్ష రాజకీయ పక్షాలు చిక్కుకొని విలవిలలాడుతున్నాయి.వీటిని నిజాయితీగా వ్యతిరేకిస్తే తమకు ఓట్లు పడవనే భయంతో ఒకరిని మించి మరొకరు ప్రజలు అడగని హామీలు కూడా ఇస్తున్నారు. ప్రజలకు ఏది అవసరమో ఏది అనవసరమో కనీస విచక్షణా జ్ఞానంతో ఆలోచించే పరిస్థితి కూడా వీరికి ఉండడం లేదు. అందుకే ఏ పార్టీ కూడా మిగతా పార్టీలకు భిన్నంగా వ్యవహరించడం లేదు. తాము ఒకటంటే మరొకరు రెండు అంటున్నారు. పెరుగుట విరుగుట కొరకే అన్నట్లు ఈ అనుచిత ఉచిత హామీలు తడిసి మోపెడై రాష్ట్రాల ప్రగతి కుంటుపడుతుంది. దీంతో దేశ ప్రగతి కూడా కునారిల్లుతుంది.

**పిల్లి మెడకు ఎవరు గంట కట్టాలి?**

అనుచిత ఉచితాలను వ్యతిరేకించే "పిల్లి మెడకు" ఎవరు గంట కట్టాలి. అనుచిత ఉచితాల విషవలయంలో అన్ని పార్టీలు చిక్కుకుపోయాయి. ప్రస్తుతం అమలు జరుగుతున్న అనుచిత ఉచితాలు రద్దు చేసే సాహసం ఏ ఒక్క పార్టీ చేసే అవకాశం లేదు. పాత పథకాలను కొనసాగిస్తూనే వాటికి మరింత ఆర్థిక సహాయం పెంచుతూనే కొత్త పథకాలకు కూడా రూపకల్పన చేస్తున్నారు.

**ఆపద్ధర్మ పథకాలు ఎన్నికలలో గెలిపిస్తాయా?**


ఒకసారి దేశ ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే ఎన్నికల ఆపద్ ధర్మ పథకాలు చాలాసార్లు వర్క్ అవుట్ కాలేదు. 1982లో ఎన్టీ రామారావు గారు తెలుగుదేశం పార్టీ స్థాపించి మొట్టమొదట రెండు రూపాయలకు కిలో బియ్యం అనే ఎన్నికల హామీని ప్రకటించారు. దాన్ని ఓడించడానికి అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఒక్క రూపాయి కిలోబియ్యం ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న పేదలందరికీ అందించారు. ఒక రూపాయి హామీని పక్కనపెట్టి రెండు రూపాయలకు కిలో బియ్యం హామీనే ప్రజలు ఆదరించి ఎన్టి రామారావును ఆ ఎన్నికలలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు గెలిపించారు. అలాగే రాష్ట్ర విభజన తర్వాత ఆపధర్మ హామీలు ప్రజలు నమ్ముతారా నమ్మరా అనే రెండు ఉదాహరణలు ప్రస్తావించుకుందాము. మొదటిది 2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించింది కానీ తాము మాత్రం 1 లక్ష రూపాయల రుణమాఫీ మాత్రమే చేయగలుగుతామని ఆనాటి అధికార పార్టీ టిఆర్ఎస్ ప్రకటిం చింది. ఒక లక్ష కంటే రెండు లక్షలు ఎక్కువైనా సరే ప్రజలు టిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఒక లక్ష రూపాయల రుణమాఫీని నమ్మి మళ్ళీ టిఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టారు. అలాగే విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం నాయకుడు చంద్రబాబు నాయుడు పసుపు కుంకుమ అనే పథకాన్ని 2019 అసెంబ్లీ ఎన్నికల కన్నా ఆరు నెలల ముందే ప్రవేశపెట్టి అమలు చేశారు. కానీ నవరత్నాలు అనే హామీలతో ముందుకు వచ్చిన జగన్మోహన్ రెడ్డిని ప్రజలు గెలిపించారు. ఇలాంటి ఉదాహరణలు మన రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. ఉచిత హామీల మీదనే రాజకీయాలు నడుస్తాయా లేక వారి ప్రభుత్వం పనితీరు నిజాయితీ ఈ విషయాలు పరిగణలోకి వస్తాయా అన్న విషయాలను రాజకీయ పార్టీలు గమనించాలి. ఎన్నికల్లో ప్రజల నిర్ణయం ఎలా ఉంటుందో ఈ నిజాన్ని తెలుసుకుంటే రాజకీయ పార్టీలు ప్రజలకు ఇస్తున్నవి "వరాలా? శాపాలా? అనే విషయం అర్థం అవుతుంది.

# ఎన్నికల్లో ప్రజలే గెలవాలి

## -బండారు రామ్మోహనరావు-



ఎన్నికల్లో డబ్బు మద్యం ఇతర తాయిలాలకు,ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఎన్నికల్లో గెలవాల్సినవి పార్టీలు, నాయకులు కాదని ఎన్నికల్లో ప్రజలే గెలవాలని లోక్ సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు అన్నారు. నవంబర్ 5న హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 1 లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో" సాఫ్ట్వేర్ రంగంలోని యువతి, యువకులు స్థాపించిన గ్లోబల్ రెస్యూ గ్రూప్" అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఓటరు చైతన్య సదస్సులో రామ్మోహన రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి దినేష్ ,వరుణ్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. రాజకీయం అంటే ఒక పవిత్ర వ్యాసంగమని పార్టీలు, కుల మతాలకు అతీతంగా మంచివారిని ఎన్నుకోవడానికి ప్రజలు ఆలోచించి ఓటేయాలని రామ్మోహన రావు అన్నారు. మన ఓటు- మన గౌరవం -మన భవిష్యత్తు గురించి ఆలోచించాలని రామ్మోహనరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నడుస్తున్నది "జన రాజకీయం"కాదని "ధన రాజకీయమని"ధన రాజకీయాన్ని తిరస్కరించాలని జన రాజకీయాన్ని ఆహ్వానించాలని ఆయన అన్నారు. అందరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని రామ్మోహనరావు కోరారు. గ్లోబల్ రెస్యూ గ్రూపుకు చెందిన వరుణ్,దినేష్ మాట్లాడుతూ చదువుకున్న వాళ్ళు ఓటింగ్ కు వెళ్లడం లేదని అక్షరాస్యులు చదువుకున్న వాళ్ళు తప్పక ఓటు వేయాలని దానికోసమే ఓటర్ చైతన్య సదస్సు నిర్వహించామని వారు అన్నారు. మధ్యతరగతి చదువుకున్న వారు ఒక గ్రూపుగా నిరక్షరాస్యులు చిన్న చిన్న పనులు వృత్తులు చేసుకునేవారు రెండవ రెండు గ్రూపులుగా ఈ ఓటర్ చైతన్య సదస్సులో పాల్గొని వారి వారి అభిప్రాయాలు వ్యక్తం చేశారు.



# మీరు ఓటరో కాదో తెలుసుకోండి



రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు ఉందో లేదో రాష్ట్రంలోని ప్రతి ఓటరూ వెంటనే చూసుకోవాలని 'ఓట్ ఇండియా – సేవ్ డెమోక్రసీ' ఆంధ్రప్రదేశ్ సమన్వయకర్త, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజ్ఞప్తి చేశారు. విజయనగరంలోని కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 4,02,21,450 మంది ఓటర్లుగా నమోదైనట్లు ఎన్నికల సంఘం తెలిపిందని, వీరిలో 1,98,31,791 మంది పురుషులు, 2,03,85,851 మంది మహిళలు, ఇతరులు 3,808 మంది ఉన్నారని, ముసాయిదాలో పేరులేని అర్హులు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వద్ద తప్పులు సరిదిద్దుకునేందుకు డిసెంబర్ 9 వరకూ రెండుసార్లు – నవంబర్ 4,5, డిసెంబర్ 2,3 తేదీల్లో ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. పేర్లు లేకున్నా, అడ్రస్ తప్పుగా ఉన్నా, పోలింగ్ స్టేషన్ మారిపోయినా ఫారం 6, ఫారం 7, ఫారం 8 ద్వారా తుది జాబితాలో పేరు నమోదయ్యేట్లు చూసుకోవచ్చన్నారు. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జేపీ సూచనల మేరకు ఉత్తరాంధ్రలో ఓటు చైతన్యం కోసం అనేక డిగ్రీ కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహించామని, డిసెంబర్ 3 లోగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని బాబ్జీ తెలిపారు. సమావేశంలో ఓట్ ఇండియా – సేవ్ డెమోక్రసీ ప్రతినిధులు పిడకల ప్రభాకరరావు, ఇప్పలవలస గోపి, జాగరపు ఈశ్వరప్రసాద్, తాడేపల్లి నాగేశ్వరరావు, కృష్ణం నాయుడు, అప్పుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఆలోచించి ఓటు వేయండి

**మన అభివృద్ధిని, పిల్లల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు హక్కును వినియోగించుకోవాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసవర్మ విజ్ఞప్తి చేశారు. ప్రధాన పార్టీలు పోటాపోటీగా తాత్కాలిక తాయిలాల్ని ప్రకటిస్తున్నాయని, కేవలం అటువంటి పథకాలు మాత్రమే ఇచ్చే పార్టీలకు ఓటు వేయొద్దని, తాత్కాలిక సంక్షేమ పథకాలతోపాటు ఆర్థికాభివృద్ధి, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు కూడా అందించే పార్టీలకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.**

# సంపద సృష్టించకపోతే.. పంచటమెలా సాధ్యం?

సంపద సృష్టించకపోతే డబ్బు ఎక్కడి నుంచి తీసుకొచ్చి పంచుతారని ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, ఐప్యాక్ (ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ) వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ప్రశ్నించారు. సంపద సృష్టించే వాతావరణాన్ని సమాజంలో కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు. "సంపద సృష్టికి ప్రభుత్వాలే సహకరించకపోతే.. పంచటానికి సొమ్ము ఎక్కడ నుంచి వస్తుంది? ఇది అపరిమితంగా అప్పులు చేసే పరిస్థితికి దారితీస్తుంది. సంపద సృష్టిస్తేనే పంచగలం" అని వ్యాఖ్యానించారు. 'అవతార్ లైవ్' యూట్యూబ్ ఛానల్ నిర్వహించిన 'షార్ప్ ఇన్‌సైట్స్ ఆన్ ఇండియా–2024' కార్యక్రమం ఇంటర్వ్యూలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు ప్రస్తావనకు రాగా, ఈ విధంగా వ్యాఖ్యానించారు. సంపద సృష్టిస్తేనే పంచగలం అని ప్రశాంత్ కిషోర్ చెబుతుండగా, ఆయన రాజకీయ వ్యూహకర్తగా వ్యవహరిస్తున్న వైకాపా ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధితో సమతూకం లేకుండా తాత్కాలిక తాయిలాల్ని పరాకాష్టకు తీసుకెళ్లటం గమనార్హం. రాష్ట్రంలో ఎన్ని రాజధానులుండాలన్న చర్చ తప్ప హైదరాబాద్ తరహాలో రాష్ట్రానికి ఆదాయవనరుగా ఉండటానికి అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అభివృద్ధి చేసే ప్రయత్నం చేయకపోవటంతో ఆర్థిక మూల్యం చెల్లించాల్సి వచ్చింది. తలసరి ఆదాయం ఏపీలో దక్షిణాది రాష్ట్రాలలోనే అతి తక్కువ. ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం తాజా ధరల ప్రకారం 2022–23లో 2,19,518 ఉండగా, స్థిర ధరల ప్రకారం రూ. 1,23,526 ఉంది.

# యానాం ఆచరిస్తోంది..

## తెలుగు రాష్ట్రాలు, భారతదేశం నేర్చుకోవాలి




తెలుగునాట ఉన్న సాంప్రదాయానికి విరుద్ధంగా డబ్బులు ఆశించకుండా, తాగుడు కోరకుండా, కులం, మతం ప్రసక్తి లేకుండా మందిహితం కోసం ఎవరు పనిచేస్తారని ఆలోచించి వరుసగా అయిదుసార్లు మల్లాడి కృష్ణారావు లాంటి నాయకుడ్ని ఎన్నుకున్నందుకు యానాం ప్రజల ఇంగితజ్ఞానాన్ని మనసారా అభినందిస్తున్నట్లు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. మల్లాడి కంటే ఈ విషయంలో ప్రజలు ముందుగా ప్రశంసనీయులన్నారు. పాడి ఆవు పాలిస్తోంది గదా అని ఆవును గౌరవించకపోతే, నష్టపోయేది పాలు తాగేవాళ్లు, పాల వల్ల ఫలితం పొందేవాళ్లని ఇక్కడి ప్రజానీకం గుర్తించారన్నారు.

యానాం వృద్ధాశ్రమ రజతోత్సవ వేడుకలను సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ మల్లాడి కృష్ణారావు, జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వి.వి లక్ష్మీనారాయణ, ఎన్ఎఫ్‌డీబీ మాజీ ఛైర్మన్ శంకర్రావు, ప్రజాపనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అన్బురసులతో కలిసి జేపీ ప్రారంభించారు.

**జేపీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు:**

ఆలోచనకి, మాటకి, చేతకి ఏ మాత్రం అంతరం లేని మల్లాది సారథ్యంలో ఎన్నో సంస్థలు ఏర్పాటయ్యాయి. వాటిలో ఒకటి పాతికేళ్లు నిండిన సందర్భంగా పాలుపంచుకోవటం ఆనందంగా ఉంది. మల్లాడి గారు ఒక మనసున్న మనిషి. మంచి మనిషి. ఒక పౌరుడిగా మందిహితాన్ని కోరేవాడు. ఒక రాజనీతిజ్ఞుడిగా కులం, మతం, ప్రాంతం వంటి వాటికి అతీతంగా ప్రజలందరినీ కలిపే ప్రయత్నం నిరంతరం చేస్తున్నవాడు. ఒక నాయకుడిగా ఓ పక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధి రెంటినీ సమపాళ్లలో నడిపి భవిష్యత్తుకి బాటలు వేసినవాడు. ఆదర్శాన్ని ఆచరణలో చూపెట్టినవాడు, చూపెడుతున్నవాడు. రెండోది, వృద్ధాశ్రమం అవసరమే. కానీ అవసరం లేకుండా చేయటం మరింత అవసరం. మన సమాజంలో ఎన్ని లోపాలున్నా చాలా బలమైనది కుటుంబం. ఒకళ్లనొకళ్లు కాపాడుకోవటం, తరతరాలు సహజీవనం చేయటం, పెద్దల్ని గౌరవించటం. కాబట్టి నేను అందర్నీ కోరేది, వృద్ధాశ్రమం అవసరమైనంత వరకు ఉపయోగించుకుందాం, కానీ అవసరం లేకుండా చేద్దాం. పెద్దలందర్నీ కోరేది.. పిల్లల పట్ల ప్రేమ చూపెట్టండి, ఇప్పటికే మీరు చూపెడుతున్నారు, ప్రాణాలైనా ఇస్తున్నారు, మీ సుఖాలు చంపుకొని త్యాగాలు చేస్తున్నారు, కానీ ఒక్కసారి వృద్ధాప్యం గురించి ఆలోచించి 1) వీలైనంత మేర ఆరోగ్యాన్ని కాపాడుకోండి 2) ఆస్తులు మొత్తాన్నీ ఇచ్చేయబోకండి. ఈ రెండూ మనసులో పెట్టుకోండి. ఎందుకంటే, మొత్తం ఇచ్చేశాక, ఆరోగ్యం కూడా కుదేలయ్యాక ఏమవుతుందో మీ చేతుల్లో లేదు. పరాధీనులవుతారు. మూడోది, నాకీ వేళ యానాం చూస్తుంటే, మీరంతా కలిసి సాధించుకునే కార్యక్రమాలు, కృష్ణారావు గారి నాయకత్వం మిగతా చోట్లకి,

ఇక్కడికి తేడా ఏమి కనిపిస్తోంది? ఒక వ్యక్తి, ఏక నాయకత్వం కాకుండా కాకతాళీయంగా వికేంద్రీకరించిన వ్యవస్థ ఇక్కడ ఏర్పాటైంది.




యానాం ఒక చిన్న పట్టణం. అందరికీ ముఖాలు తెలుసు. గుణగణాల అంచనా ఉంది. ఎవర్ని నమ్మితే మంచి జరుగుతుందో తెలుసు, నమ్మకూడనివాడిని నమ్మితే జరిగే చెడు కూడా తెలుస్తుంది. అనుభవం నుంచి. నిజమైన ప్రజాస్వామ్యం అది. మనకు ముక్కు, మొహం తెలియనివాళ్లు, మనకు అర్థం కానంత దూరంలో ఉన్నవాళ్లు, తెలియనిరీతిలో పాలన చేసేవాళ్లు.. వాళ్లు ఎంత గొప్పవాళ్లయినా వాళ్ల వల్ల మంచి జరగదు. అలాంటిచోట ప్రజలకు ఓటు అర్థం కాదు. అందుకే ఓటుని అమ్ముకుంటున్నాం డబ్బుకి. మీ చుట్టుపక్కల నియోజకవర్గాల్లో తెలుగునాట రెండు రాష్ట్రాల్లో చూస్తున్నారు, కర్ణాటక, తమిళనాడులో చూస్తున్నారు ఓట్ల అమ్మకమేంటో. ఓటు అర్థంకాకే తాయిలాలకు మోసపోతున్నాం. అందుకే కులం, మతం అనగానే వెర్రెక్కి పూనకం వచ్చి మన బతుకుల్ని సమాధి చేసుకుంటున్నాం. ఎప్పుడు అధికారం మనకు చేరువగా ఉంటుందో, అప్పుడు ఒకవేళ కొన్ని సందర్భాల్లో పొరపాట్లు చేసినా, సరైన నాయకత్వాన్ని ఎంచుకోకపోయినా ఆ గుణపాఠం మనం వేగంగా నేర్చుకుంటాం. అదీ ప్రజాస్వామ్యం!

మనది నిజమైన ప్రజాస్వామ్యం కాదు. కొన్ని ప్రజాస్వామ్య ఛాయలున్నాయి, ఓటు ఉంది, అరిచే స్వేచ్ఛ ఉంది, రోడ్డు మీదకి ఎక్కి రాస్తారోకో చేసే స్వేచ్ఛ ఉంది తప్ప నిజమైన ప్రజాస్వామ్యం ఇంకా రాలా. యానాం చూపెడుతోంది – నిజంగా అధికారం వికేంద్రీకరిస్తే గొప్ప నాయకత్వం ఎట్లా వస్తుందో! ఆ గొప్ప నాయకత్వ రుచి ప్రజలు మరిగితే తప్పులు కొన్ని సందర్భాల్లో జరిగినా వాళ్లు బాగుచేసుకుంటారు. తమ కోసం. నాయకుల కోసం కాదు. అధికారాన్ని ప్రజల దగ్గరికి తీసుకురాకుండా, ఓటుకి, భవిష్యత్తుకి అసలు సంబంధం లేకుండా, మనం కట్టే పన్నులు, సేవలకు మధ్య సంబంధం అర్థం కాకుండా, మనం ప్రజాస్వామ్యాన్ని, ఉమ్మడి జీవితాల్ని బాగుచేసుకోవటం సాధ్యం కాదు. యానాం నుంచి ఈ దేశంలో మనందరం నేర్చుకోవాల్సిన మౌలికమైన గుణపాఠం ఇది.

రాజకీయాన్ని పవిత్ర వ్యాసంగంగా నేను భావిస్తాను. అది సాధ్యమని రుజువు చేసిన, చేస్తున్న మనిషి మల్లాడి. అయితే అది ఒక్క యానాంలో, మల్లాడి గారి వల్లే కాదు. ఈ దేశంలో సర్వవ్యాప్తమై అందరి వల్లా కావాలి. అప్పుడు ఈ దేశం బాగుపడుతుంది, అప్పుడు బిడ్డల బతుకులు బాగుపడతాయి. అలా జరగాలంటే ఎన్నికల తీరు మారాలి.

మల్లాడి గారు ఎన్నికల రాజకీయం నుంచి తప్పుకోగానే, యానాంలో ప్రజలు గందరగోళానికి గురవుతున్నట్లు, పక్కనవాళ్లను ప్రభావితం చేయాల్సిందిపోయి మీరు ఆ ప్రభావానికి లోనయ్యారని విన్నా. అది కాదు మీరు చేయాల్సింది. ఈ జిల్లా నాకు కరతలామలకం. రూ. 30 కోట్లు అసెంబ్లీ ఎన్నికకు ఖర్చు పెట్టటం ఇక్కడ గొప్పగా భావిస్తారు. కానీ ఇది కాదు మీరు పక్కవాళ్లకు, ఇతర ప్రాంతాలకు చెప్పాల్సింది! దారి చూపెడతారా? వక్రమార్గం పడతారా?.. యానాం ప్రజలు తేల్చుకోవాలి. సమానావకాశాలు కావాలంటే చట్టబద్ధపాలన మనకు ఎంతో అవసరం, మల్లాది గారు 25 ఏళ్లలో ఏనాడూ పోలీసుల అరాచకాన్ని ప్రోత్సహించలేదు, నేరముఠాల్ని, అక్రమాల్ని పెంచలేదు. సామాన్యుడు, సంపన్నుడు అందరికీ చట్టం అందరికీ సమానం కావాలని కోరుకున్నారు తప్ప ఫ్యూడల్ రాజకీయం, పెత్తందారీ రాజకీయం చేయలేదు. అదీ రాజకీయానికి పరమావధి. ఏ కులం వాడు, ఏ కుటుంబం పెత్తనం చేస్తోంది అని ఆలోచించే వికృత రాజకీయం స్థానంలో నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కావాలి. అది కేవలం యానాంకు పరిమితం కాకుండా తెలుగునాట, ఈ దేశంలో సర్వవ్యాప్తం కావాలి. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోకుంటే, సంక్షేమాన్ని, అభివృద్ధిని కలపకపోతే దేశ భవిష్యత్తు అంధకారమవుతుంది. కష్టంలో ఉన్నవారిని తాత్కాలికంగా ఆదుకోవాలి, కానీ అంతటితో ఆగితే, ఎదిగే అవకాశాలనివ్వకుంటే పేదరికం కొనసాగుతుంది, పేదల పిల్లలు పేదలుగానే కొనసాగుతారు. అది బానిసత్వం అవుతుంది తప్ప రాజకీయం అవదు. యానాంలో జరిగిన, జరుగుతున్న ప్రయత్నం దేశమంతా జరుగుతుందని, అధికార వికేంద్రీకరణ జరుగుతుందని, ఎన్నికల్లో డబ్బు, మద్యం, కులం, మతం ప్రభావం తగ్గించేందుకు అధికారంలో ఉన్నవాళ్లు ప్రయత్నిస్తారని, ఆ ప్రయత్నాన్ని ప్రజలు ఆదరిస్తారని ఆశిస్తున్నా.

# ప్రైవేటు రంగం బీదలకు వ్యతిరేకమా?

## డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో ఆకెళ్ల రాఘవేంద్ర ముఖాముఖి (నాలుగో భాగం)




**ప్రశ్న: ప్రైవేటురంగం విస్తరిస్తున్న నేపథ్యంలో నిమ్నకులాలు రిజర్వేషన్లకు దూరం అయ్యే అవకాశం ఉందా? ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లపై లోక్‌సత్తా వైఖరేంటి?**

**జేపీ:** కులవ్యవస్థ ఘనీభవించిన వ్యవస్థ మనది. పుట్టుకతో అసమానతలకు గురవుతున్నారు. దాన్నుంచి బయట పడడానికి రకరకాల మార్గాలు కావాలి. రిజర్వేషన్లు ఒక మార్గం. రిజర్వేషన్లు ఒక్కటే మార్గం అనుకుంటే.. ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు 100 ఉంటాయి. వాటిలో 20 లేదా 30 పంచుకుని తృప్తిపడటమా? 100ని 1000 లేదా 2000 చేసి 20-30 నుంచి 200 ఉద్యోగాలు వచ్చేటట్టు ప్రయత్నం చేయడమా..మనం అలా ఆలోచించాలి. ప్రభుత్వరంగం నుంచి ప్రైవేటురంగం ఎంత పెరిగితే అవకాశాలు అంత పెరుగుతాయి. కాబట్టి ఇది బీదలకు వ్యతిరేకంగా కాదు...అనుకూలం. రెండోది అలాంటప్పుడు బీదవర్గాలకి, అణిచివేతకు గురైన వర్గాలకి అవకాశాలు పెంచడం ఎలా? ఇది సరైన ప్రశ్న. నైపుణ్యం ఉంటే ఏ సంస్థలో అయినా సరే అవకాశాలు వస్తాయి. మార్కెట్‌లో నెగ్గాలి, మంచిపేరు తెచ్చుకోవాలనే ఏ యజమాని అయినా భావిస్తాడు. నీ కులం ఫలానా కాబట్టి ఉద్యోగం ఇవ్వననే వారు ఉండరు..ఉంటే వారు నాశనం అయిపోతారు. కులం, ప్రాంతం గురించి ఆలోచిస్తే సంస్థ నడవదు. చిన్న సంస్థే నడవకపోతే పెద్ద ఆర్థికవ్యవస్థ నడవడం అసాధ్యం. కాబట్టి మార్గం నైపుణ్యాన్ని పెంచడం. అది చేయకుండా ఏదో చేస్తున్నామనే భ్రమ కల్పించడానికి రకరకాల విన్యాసాలు చేస్తున్నాం. నిజంగా ఇప్పుడున్న పద్ధతుల్లోనే పరిష్కారం అయితే 75 ఏళ్లు అమలు చేశాం కదా? ఈ పాటికి పరిష్కారం అయిపోవాలి కదా? ఎందుకు కాలేదు. చైనాలో 25 ఏళ్లలోనే అద్భుతాలు సాధించారు కదా. 75 ఏళ్లలో ఈ మాత్రం అయినా ఎందుకు సాధించలేకపోయాం. రెండోది..అయినా కొన్నిచోట్ల వివక్ష ఉండొచ్చు. ఎంత పెద్ద కంపెనీ అయితే వివక్ష అంత తక్కువ ఉండొచ్చు. వ్యాపారంలో నా స్థానం అనే తప్ప వివక్ష ఉండదు. కానీ కొన్ని చిన్న కంపెనీలు..కులతత్వం పోకుండా ఉన్నవాళ్లు కొంత ఉండొచ్చు. సామర్థ్యం దెబ్బతినకుండా మార్కెట్‌లో నిలబడే అవకాశం ఇస్తూనే మార్కెట్‌ను మార్చాలి అంటే.. వినూత్నమైన పద్ధతులను అవలంబించాలి. ఆర్థిక ప్రగతికి తగ్గట్టుగా ఉపాధి కల్పన జరగడం లేదు. కాబట్టి ప్రత్యేకమైన దృష్టి ఉపాధి కల్పన మీద పెట్టాలి. కాటన్ ఉత్పత్తిలో మనం నెంబర్ 1 కానీ మనకంటే బంగ్లాదేశ్ బట్టలను ఉత్పత్తి చేసి ఎక్కువగా అమ్ముతోంది. పోనీ బంగ్లాదేశ్ బీద దేశం ప్రపంచ దేశాలు రాయితీ ఇచ్చాయనుకుంటే చైనా మనకంటే ఐదు రెట్లు సంపద ఎక్కువగా ఉన్న దేశం. మనకంటే చైనా పదిరెట్లు అధికంగా దుస్తులను అమ్ముతోంది. దుస్తుల తయారీలో కోట్ల మంది ఉద్యోగులు ఉన్నారు. ఎందుకని మనదేశంలో ఆ పరిస్థితి లేదు. మూర్ఖమైన కార్మిక చట్టాలు పెట్టి ఒక కంపెనీ పెరగకుండా దుస్తుల కంపెనీలు చిన్న చిన్నవి తయారు చేశాం. విశాఖపట్నం జిల్లాలోని అచ్యుతాపురం వెళితే అక్కడ బ్రాండెక్స్ అనే దుస్తుల తయారీకంపెనీ 22 వేల మంది మహిళలకు ఉపాధి కల్పిస్తుంది. చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లోని దళిత మహిళలందరికీ ఉపాధి ఉంది. అది బలహీనవర్గాలకు ఉపాధి వచ్చే తీరు. వారి ఊర్లనుంచే బస్సుల్లో తీసుకొచ్చి టైమ్‌కు పనిచేయించి వాళ్లకి అన్ని సదుపాయాలు, ఆరోగ్యవసతి కల్పించి టైమ్‌కు ఇంటికి పంపిస్తున్నారు.

అలాంటి పరిస్థితి రాకుండా మన ఆర్థిక వ్యవస్థ విధానాలు అడ్డుకున్నాయి. కాబట్టి నిర్మాణాత్మక ఆలోచన చేయాలి. గుడ్డెద్దు చేలో పడ్డట్టుగా ఇదొక్కటే మార్గం అనుకుంటే పరిష్కారాలు రావడం లేదు. మనం చూస్తున్నాం. అందుచేత కచ్చితంగా ఉపాధి ఫలితాలు నిరుపేదలకు అందాలి..అణగారిన వర్గాలకు అందాలి. దానికి నైపుణ్యము, మార్కెట్ పద్ధతులను ఉపయోగించడమూ, విద్యను పెంచడము, ఉపాధి కల్పించే పరిశ్రమలను ప్రోత్సహించే ఏర్పాట్లు చేయడం. అది మార్గం తప్ప ఇంక ఏదీ కాదు.

**ప్రశ్న: అస్తిత్వవాద ఉద్యమాలపై కాకుండా ముందుకు వెళ్లాలనుకుంటే లోక్‌సత్తా ఏ చైతన్యాన్ని తీసుకురాగలదు.. తీసుకురాగలిగిందా? దీనిపై మీ అభిప్రాయం.**

**జేపీ:** ఐదువేల సంవత్సరాల చరిత్ర ఉన్న సమాజం మనది. భారతదేశంలో లేని మతం లేదు. నాలుగైదు మతాలు ఇక్కడే పుట్టాయి. ఇతర దేశాల్లో పుట్టిన మతాలు ఇక్కడికి వచ్చాయి. ఇంత వైవిధ్యం ఉన్న మన దేశంలో సహజంగానే అస్తిత్వవాదం ప్రజల్లో ఉంటుంది. కొన్నేళ్లక్రితం ఆఫ్రికాలో రువాండా, బురిండి రెండు దేశాలు ఉన్నాయి. అక్కడ ఉన్న రెండు తెగలు ఒకరినొకరు చంపేసుకుని శవాలను పడేశారు. అంటే ఆటవిక లక్షణం. నీ కులానికి నా కులం పడదు.. నీ మతానికి నా మతం పడదు..అని ఎప్పుడైతే అనుకుంటామో అది సమాజంలో తీవ్రమైన సంఘర్షణకు దారి తీస్తుంది. అందుకే మన రాజ్యాంగంలో పౌరసత్వాన్ని ప్రాతిపదికగా చేశారు. పౌరసత్వం అనేది మౌలికమైన చైతన్యం కావాలి. సమాజం రాజ్యం కంటే పెద్దది..రాజ్యం కంటే బలమైంది. అది కానీ ప్రమాదానికి దారి తీస్తుంటే తగ్గించే ప్రయత్నాన్ని రాజకీయంగా కానీ, సామాజికంగా కానీ నాయకత్వం చేయాలి. కులం స్పృహ ఇతరులను ద్వేషించే స్థాయికి తీసుకువస్తే కచ్చితంగా తగ్గించాలి. మతం స్పృహ హిందూ, ముస్లిం కలహాలకు దారితీస్తే తగ్గించాలి కదా..ఈ చైతన్యం ఎలా ఉండాలంటే ఒక తెగ కంటే ఒక భాష కానీ, ఒక మతం కానీ ఆ చైతన్యం పెద్దది. రెండు వర్గాల మధ్య పోరాటం వస్తే అంతకంటే జాతి చైతన్యం మరింత పెద్దది. రేపొద్దున భారత్ పాకిస్తాన్ మధ్య అనవసరంగా కయ్యాలు వస్తే మానవాళి చైతన్యం అంతకంటే గొప్పది. పాకిస్తాన్‌లో ఉన్నవాళ్లు మనుషులే..ఒకప్పుడు వాళ్లు మనం కలిసే ఉన్నాం. నాగరికతలో చైనాకు మనకు ఎన్నో సంబంధాలు ఉన్నాయి..కాబట్టి కొన్ని సందర్భాల్లో దేశాల మధ్య అనివార్యంగా సంఘర్షణ వచ్చినా కూడా ఒకరి నొకరు ద్వేషించుకునే పరిస్థితి రావడం ప్రమాదకరం. దేశ పౌరసత్వం అనేది మానవ విలువల ప్రాతిపదికగా ఉండాలి. కులం పేరుతో రాజకీయాలు అనేవి చాలా మూర్ఖమైన ఆటవిక ధోరణి. అది నాగరికత ధోరణి కాదు. కచ్చితంగా దాన్నుంచి బయటపడేందుకు సంస్థాగతంగా చేయాలి.దానికి ఒక్కటే మార్గం. ఈ గీత కంటే ఇంకా పొడవైన గీత పక్కన గీయండి..ఆ పొడవైన గీత నా జీవితం..నా బిడ్డల భవిష్యత్తు..నా పౌరసత్వం. అమ్మాయికి మంచి చదువు చెప్పే టీచరు కావాలి కానీ కులం ముఖ్యం కాదు. అమ్మాయి భవిష్యత్తు బాగు చేసే అధ్యాపకుడు దొరికాడా లేదా అనే చూస్తాం..తర్వాత కులం గురించి ఆలోచిస్తాం. కొడుకు ప్రాణాలు కాపాడే డాక్టర్ ఉన్నాడా? లేదా? అని చూస్తాం కానీ ఆయన కులం గురించి ముందు ఆలోచించం. పొడవైన గీత నా కుటుంబం..నా శ్రేయస్సు. రాజ్యవ్యవస్థ ఆ ప్రయత్నం చేయాలి. నా దృష్టిలో ఈ సమాజంలో క్రమ క్రమంగా ఆ మార్పు వస్తుంది. కాకపోతే అనుకున్నంత వేగంగా రాకపోవచ్చు. ఆ మార్పు వస్తోంది..దాన్ని ప్రోత్సహించాలి. ఎన్ని పొరపాట్లు ఉన్నా రాజ్యం చాలా ఉదారస్వభావం కలది.. రాజకీయం చాలా సంకుచితమైంది. ప్రజల్ని కలపాలంటే నీకు నిజమైన నాయకత్వం లేనప్పుడు అయితే ప్రజల్లో విభేదాలు సృష్టిస్తారు. లేదంటే తాత్కాలికమైన తాయిలాలకు బానిసల్ని చేస్తారు. ఆ నాయకత్వం నిజమైంది కాదు. మహాత్మాగాంధీ ప్రజలు ఇది కావాలని అని కోరుకున్నా అది తప్పు అని శాసించగలిగాడు. చౌరీచౌరాలో పోలీసుల్ని చంపేస్తే ఉద్యమం మొత్తాన్ని ఆపేశారు. అంతేకాని ఏదో కొంత ఆవేశంతో చేశారు..మనం జిందాబాద్‌లు కొట్టుకుంటూ ముందుకు వెళ్లాలనుకోలేదు. మనకు ఇవాళ అటువంటి నాయకత్వం లేదు. పేలవమైన నాయకత్వం ఉంది. కాబట్టి తాత్కాలికమైన చప్పట్లు, ప్రజల్లో ఉన్న ఆవేశాన్ని పెంచడం అది తప్ప ప్రజల్ని సమీకృతం చేయలేని అసమర్థ రాజకీయ నాయకత్వం. దాన్నుంచి కులాన్ని, మతాన్ని రాజకీయ సమీకరణ కోసం ఆయుధాలుగా వినియోగిస్తున్నారు. ఇది నిర్ద్వంద్వంగా ఖండించాలి. ఇది అస్తిత్వం కాదు. ఆ బిడ్డల భవిష్యత్తు కోసం మంచి విద్యను ఇవ్వండి..అది అస్తిత్వం. ఆత్మగౌరవాన్ని అందించే విధంగా ఉపాధిని కల్పించండి సమాజంలో ఆదాయాలు పెంచే ఏర్పాటు చేయండి...అది అస్తిత్వం. చట్టబద్ధ పాలనకు నిజంగా ఏర్పాట్లు చేసి డబ్బున్నా, లేకపోయినా న్యాయం అందేలా ఏర్పాట్లు చేయండి అది అస్తిత్వం. ఇది అస్తిత్వం కాదు. ఇది అబద్ధం. ఆత్మగౌరవాన్ని పెంచేది అస్తితం..సంకుచిత్వాన్ని పెంచేది అబద్ధం.

**(ఇంకా వుంది)**

# మేలుకో బహుజన, రాష్ట్రాన్ని, దేశాన్ని ఏలుకో శ్రమజన

## - నందిపేట రవీందర్, లోక్‌సత్తా పార్టీ (తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు)



మేమెంతో మాకంత అనే డిమాండ్ అన్ని రంగాలలో సమన్యాయం కోసం జ్యోతిబా ఫూలే, బాబాసాహెబ్ అంబేద్కర్, కాన్షీరాంలు పోరాటాలు సాగించి అందిస్తే కొన్ని పొందగలిగాము. స్వాతంత్ర్యం సాధించిన తర్వాత ఆర్థిక, రాజకీయ, సాంఘిక అసమానతలు లేని సమాజాన్ని ఏర్పాటు చేయాల్సుండె. కానీ 76 సంవత్సరాల స్వాతంత్ర్య భారతంలో మన రాజకీయ పార్టీలు అందరికీ విద్య, ఆరోగ్యం వంటి ఏర్పాట్లతో సమానావకాశాలివ్వకుండా ఆర్థిక అసమానతల్ని పెంచాయి. 10% ప్రజల వద్ద 80% సంపద ఉంటే, 80% ప్రజలకు కేవలం 20% మాత్రమే ఉందంటే, ఆర్థిక అసమానతలు పెరిగినట్లు, కాదా? రాజకీయ రంగంలో బహుజనులకు అవకాశాలు ఎలా ఉన్నాయో చూస్తే గోస కలుగుతది. గత 76 ఏండ్లలో ఎస్.సి, ఎస్.టిలకు కొంత ప్రయోజనం కలిగినా, దామాషా పద్ధతిలో ఆలోచిస్తే వారికి కూడా న్యాయం జరగలేదు. 55% గా ఉన్న బి.సిలు రాజకీయ రంగంలో 20% కూడా అవకాశాలు పొందలేదంటే, అందుకు కారణం ఎవరు? సాంప్రదాయ రాజకీయాలను దేశంలో కొనసాగిస్తున్న జాతీయ, ప్రాంతీయ పార్టీలు కాదా? అందుకు సహకరిస్తున్న బహుజనులమైన మనం కాదా? లేవండి, అసమానతలకు కారణమైన పాతరాజకీయాన్ని పాతరేద్దాం. అందరికీ ఎదిగే అవకాశాలతో బహుజన రాజకీయాన్ని తీసుకొద్దాం. కలసిరండి! బహుజనులు 'తమ కోసం తాము నిలబడకపోతే ఎవరు నిలబడతారు! మీ కోసం మీరు నిలబడకపోతే అసలు మీరెవరు!! ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు!! 'పొలిటికల్ పవర్ మాస్టర్ కీ' అన్నారు బాబాసాహెబ్ అంబేద్కర్. మన రాష్ట్ర, దేశ రాజకీయాల్ని పూర్తిగా కులం, మతం, డబ్బు వంటి వాటి చుట్టూ ఆధిపత్య భావజాలంతో నిస్సిగ్గుగా కొనసాగిస్తున్నారు. ఆ రాజకీయాన్ని అడ్డుకోకుండా వారి పంచన చేరి జేజేలు కొడుతూ, వారి దుర్మార్గాలను సహిస్తూ, చవటల్లాగ వారి చేష్టలను పట్టించుకోకుండా సమర్థకులుగా వారితో కొనసాగడమంటే బహుజన ఆత్మగౌరవం తాకట్టు పెట్టడం కాదా?.. మన రాష్ట్రంలో ఇటీవల ఒక పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది. అందులో ఒకే సామాజిక వర్గానికి చెందినవారికి 40 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వటం దేనికి సంకేతం? మరో సామాజిక వర్గానికి చెందినవారికి 11 సీట్లను కేటాయించారు. అంటే 6%గా ఉన్నవారికి సుమారు 50% పైగా ఇస్తే 93% ఉన్న బహుజనులకు ఎలాంటి ప్రాధాన్యతనో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మహిళల గురించి చాలా గొప్పగా మాట్లాడుతారు. కానీ మహిళా రిజర్వేషన్ చట్టాన్ని మహిళా నాయకత్వం ఎదగలేని రీతిలో, మగమహారాజుల చేతుల్లో వాళ్లు కీలుబొమ్మలుగా ఉండేరీతిలో రొటేషన్ పద్ధతిలో రూపొందించారు. అమలు కూడా ఎప్పుడూ డీలిమిటేషన్ పూర్తయ్యాక చేస్తారట. దేశం అభివృద్ధి చెందాలంటే చట్టం మహిళలు సాధికారత సాధించేలా రూపొందించాల్సిన అవసరం ఉందా, లేదా? దేశ రాజకీయాలను డబ్బు చుట్టూ తిప్పుతూ నిజాయతీపరులకు, పేద ప్రజలకు రాజకీయాలు, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా చేస్తున్న వ్యవస్థను ప్రశ్నిద్దాం. అలాంటి కుట్ర రాజకీయాలను సాగనంపుదాం. డబ్బు లేదు కాబట్టి మనం ఏమీ చేయలేమనే అపనమ్మకం అవసరం లేదు. ఎందుకంటే, మెజారిటీ ఓట్లు మనవి, ప్రభుత్వానికి అధికశాతం పన్నులు కట్టేది మనం. కాబట్టి మన ఓట్లు మనవారికే వేసుకుందాం, మనం కట్టే పన్నుల డబ్బు అందరి ప్రయోజనం కోసం ఉపయోగిద్దాం. వడ్డించేవారు మనవారైతే బంతిలో ఏ మూలనున్నా రావాల్సిన వాటా దక్కుతుందనేది నిజం. 76 సంవత్సరాల అనుభవం చాలదా! విద్య, వైద్యం, యువతకు నైపుణ్యాలు సరిగా అందలేదు. చట్టబద్ధపాలన, పాలనలో జవాబుదారీతనం 80% లేదు. సకాలంలో అందని న్యాయం, ప్రజలంటే గౌరవంలేని పాలకులు, లంచమివ్వనిదే, వేధించనిదే, సామాన్యులు రాజకీయ నాయకుల చుట్టూ తిరగందే పని చేయని అధికార వ్యవస్థ.. ఇవి లేవని చెప్పమనండి? ఇవి ఉంటే, ఆ ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎక్కడున్నట్లు? యజమానులైన ప్రజలకు గౌరవంగా సేవలు అందించాల్సిన సేవకులు ప్రజలను పురుగుల్లాగా చూస్తుంటే ఆ అవ్యవస్థను మార్చుకోవాల్సిన అవసరం మనకే ఉంది. మంచి రాజకీయం, మంచి పాలన అందివ్వలేని, ఆ పనికిమాలిన రాజకీయం ఇంకా కొనసాగించడమా? ఆలోచించండి! అర్థం చేసుకోండి, అర్థమవ్వండి, లక్ష్యాన్ని సాధించేవరకు విశ్రమించకండి!! సామాజిక న్యాయం కోరే విజ్ఞులారా, వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న బహుజన బిడ్డలారా ఇంకెంతకాలం మోసపోతారు? ఇకపై సాగదుగాక సాగదు అనే నినాదం వినిపిద్దాం. మంచి రాజకీయం స్థాపిద్దాం. లేవండి! మేలుకోండి!! లక్ష్యాన్ని సాధిద్దాం కలసిరండి! ఈ సాంప్రదాయ పార్టీలకు ప్రత్యామ్నాయ, బహుజన రాజకీయ వేదిక అవసరముందా, లేదా? ఆలోచించండి. నిలబడండి, కలబడండి, బహుజన రాజ్యం సాధించటమే లక్ష్యంగా కదలిరండి! ఆ సాంప్రదాయ పార్టీలను మా వాటా, మావాటా మాకివ్వండని అడుక్కోవడమెందుకు? 85%గా ఉన్న మనం, విడివిడిగా ఉన్నంతకాలం, మన ప్రయోజనాలు ఇంకా వెయ్యేండ్లయినా పొందలేము. కాబట్టి మనలో మనం సమైక్యతను చాటుదాం, సమానతను సాధిద్దాం. ప్రత్యామ్నాయ, రాజకీయాన్ని సృష్టిద్దాం, బహుజన హిత రాజ్యం సాధిద్దాము.










అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో 'భారతదేశంలో ఎన్నికల సంస్కరణలు' అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్



# విద్యా ప్రమాణాలు - భవిష్యత్తుకి కీలకం

## డాక్టర్ జయప్రకాష్ నారాయణ్




గణతంత్ర భారతదేశ అతిపెద్ద వైఫల్యాల్లో కీలకమైనది విద్య. పెద్ద ఆర్థిక వ్యవస్థలన్నిటిలో అతి తక్కువ చదువున్న సమాజాల సరసన మనం ఉన్నాం.

అపార పేదరికం, కుల విభజనలు, నిరక్షరాస్యత ఉన్నప్పటికీ మన దేశం మొదట్నుంచి అందరికీ ఓటు హక్కు ఇచ్చింది, ప్రజాస్వామ్యాన్ని అనుసరించింది. కుల అణచివేత, పుట్టుకతో అసమానతల్ని ఎదుర్కోవాలంటే ప్రతి బిడ్డకూ నాణ్యమైన పాఠశాల విద్య ఎంతో కీలకం. ప్రాథమిక విద్య లేకుండా నైపుణ్యాలు, ఉత్పాదకత సుదూర స్వప్నాలు. విజయవంతమైన ప్రజాస్వామ్యాన్ని నడపాలంటే ఒక స్థాయి అక్షర జ్ఞానం, గణిత పరిజ్ఞానం ఉండాలి. తార్కిక శక్తి కావాలి. ఓటంటే ఏమిటో, ఓటు వల్ల ఏం జరుగుతుందో ఓటర్లకు అర్థంకాకపోతే, పన్నులకు, సేవలకు మధ్య సంబంధం పన్ను చెల్లించేవారికి అర్థం కాకపోతే, జవాబుదారీతనం ఉండదు; సేవలు సక్రమంగా అందవు; ప్రజాస్వామ్యం పనిచేయదు.

మన ప్రభుత్వాలు విద్య మీద భారీగా ఖర్చు చేస్తున్నాయి. జీడీపీలో 4.3% అంటే, 12 లక్షల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయి. ఇంకా ఖర్చు చేయాలని కొంతమంది వాదిస్తుంటారు. కానీ 40%కి పైగా పిల్లలు ప్రయివేటు స్కూళ్లకు వెళ్తుండటాన్ని మనం పరిగణలోకి తీసుకుంటే, ప్రభుత్వ విద్యపై జీడీపీలో వాటాగా మనం చేస్తున్న ఖర్చు అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఒక్కో బిడ్డ మీద ఏడాదికి సుమారు రూ.90,000 ఖర్చు చేస్తోంది; తెలంగాణలో అది రూ.80,000 దాకా ఉంది. ఒక పేద దేశంలో ఇవి చాలా పెద్ద మొత్తాలు. మన తల్లిదండ్రులు పిల్లల కోసం అపార త్యాగాలు చేస్తున్నారు. తమ పిల్లలు ఒడిదుడుకులు లేకుండా త్వరగా జీవితంలో కుదురుకోవాలని, ఎదిగే అవకాశాలను అందుకోవాలనే ఆశతో ప్రయివేటు చదువుల కోసం శక్తికి మించి అప్పులు చేస్తున్నారు. మన సమాజం విద్యను గౌరవిస్తుంది, విద్యలో విజయాన్ని సంబరం చేసుకుంటుంది. పిల్లలు బరువైన స్కూలు సంచుల్ని మోస్తూ కష్టపడి చదువుతుంటారు. అయినా, విద్యలో మన ఫలితాలు అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయి. ప్రపంచంలోనే నాసి స్థాయిలో ఉన్నాయి. పాఠశాలలో నేర్చుకున్న విద్య ఎంత మేర ప్రామాణికంగా ఉందో తెలుసుకునేందుకు 15 ఏళ్ల వయసు పిల్లలను సర్వే చేయగా (పీసా) 74 దేశాల మధ్య భారతదేశం 73వ స్థానంలో ఉంది. అట్టడుగున ఉన్న కిర్గిజిస్థాన్ కంటే కేవలం ఒక్క ర్యాంకు పైన ఉన్నాం! అత్యధిక శాతం పిల్లల అభ్యసన స్థాయిలు వాళ్లు చదువుతున్న తరగతుల కంటే కనీసం రెండు, మూడు తరగతుల దిగువన ఉన్నాయని మన సొంత జాతీయ ఎచీవ్‌మెంట్ సర్వేల్లో కూడా తేటతెల్లమైంది; కేవలం 15-20% పిల్లల్లో మాత్రమే చెప్పుకోదగిన స్థాయి విద్యా ప్రమాణాలున్నాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఉత్పాదక భాగస్వాములుగా ఎదగటానికి అవసరమైన కనీస స్థాయి చదువు స్కూలు పిల్లలకు అందటం లేదని ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ గ్రామీణ పాఠశాల పిల్లల్లో చేసిన వార్షిక సర్వే (అసర్) తెలియచేస్తోంది. అసర్ మొదటి నివేదికను నేను 2005లో అప్పటి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు మాంటెక్ సింగ్ ఆహ్లువాలియాతో కలసి విడుదల చేశాను. ఏటికేడు పరిస్థితి ఇంకా దిగజారుతున్నట్లు సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయి. పాఠశాలల్లో పిల్లల నమోదు, వారి పేరు మీద ఖర్చు మాత్రం భారీగా పెరగ్గా, ఫలితాలు మాత్రం అధ్వాన్న స్థాయిలో కొనసాగుతున్నాయి. 2022లో 8వ తరగతి చదువుతున్న పిల్లల్లో 55% మందికి పైగా ఒక చిన్న భాగాహారాన్ని కూడా చేయలేకపోయారు. మూడంకెల సంఖ్యను ఒక అంకె సంఖ్యతో (ఉదాహరణకు 365÷7) భాగించలేకపోయారు. 8వ తరగతిలో 30% మంది కంటే ఎక్కువ మంది 2వ తరగతి స్థాయిలోని ఓ పేరాగ్రాఫ్ చదవలేకపోయారు. ఇక్కడ ఇంకో విషయం మర్చిపోకూడదు. తాను చదివే అంశాలపై విద్యార్థికి కాన్సెప్ట్‌పరంగా ఉన్న స్పష్టతను, అవగాహనను 'అసర్' సర్వే పరీక్షించదు; అంక గణితం, చదవటం యాంత్రికంగా చేసే ప్రక్రియలో కూడా చాలామంది పిల్లలు తమ తరగతి స్థాయి కంటే ఎంతో వెనుకబడి ఉన్నారు.

ఇప్పటికీ పేదరికం ఎక్కువగా కొనసాగుతూ, 80% మందికి




పైగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న దేశంలో పాఠశాల విద్య విఫలమవటం తీవ్ర వినాశకర పరిణామాలకు దారితీస్తుంది. స్కూళ్లలో పునాదులు అధ్వాన్నంగా ఉండటం కళాశాల విద్యలో వైఫల్యానికి దారితీస్తోంది. బట్టీ పట్టటం, విశృంఖల కాపీయింగ్ వల్ల ప్రతిభతో సంబంధం లేకుండా కృత్రిమంగా పెంచేసిన గ్రేడ్లు, పాస్ పర్సంటేజీలు వస్తున్నాయి. ఐఐటీలు, ఐఐఎంలు, మెరుగైన వైద్య కళాశాలలు, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలు వంటి కొన్ని అత్యున్నత విద్యాసంస్థల మాటున మన విద్యావ్యవస్థ వైఫల్యాన్ని కప్పిపుచ్చుతున్నాం. అంతర్జాతీయంగా సత్య నాదెళ్లలు, సుందర్ పిచాయ్‌లు, ఇంద్రా నూయీల విజయాల్ని చూసి మన విద్య ప్రపంచస్థాయిలో ఉందని మనల్ని మనం మోసం చేసుకుంటున్నాం. అవకాశం లభిస్తే మన పిల్లలు ప్రపంచంలో అత్యుత్తములకు దీటైనవారు. కానీ మన సగటు అభ్యసన ప్రమాణాలు అత్యంత పేలవంగా ఉన్నాయి. మన విద్యావ్యవస్థ ఇంత అధ్వాన్నంగా ఉన్నా కొద్దిమంది అత్యున్నత స్థాయిని అందుకోగలుగుతుండటానికి వారి అదృష్టం లేదా కొన్ని యాదృచ్ఛిక అంశాలు కారణం తప్ప ఇప్పుడున్న వ్యవస్థ కాదు. మరి ఏం చేయాలి?

చేయాల్సినవి చాలా ఉన్నాయి. బోధనా పద్ధతులు; ఉపాధ్యాయ శిక్షణ, జవాబుదారీతనం, వికేంద్రీకృత నిర్వహణ, యాక్టివిటీ-ఆధారిత అభ్యసనం మొదలైనవి. కానీ ఒక దేశం మొత్తాన్నీ ఎలా మనం మార్చగలం? భారత పాఠశాలల్లో 28 కోట్ల మంది పిల్లలున్నారు. బట్టీపట్టి నేర్చుకోవటం, పిచ్చి పరీక్షలు చదువులేని ఒత్తిడిని ఇంకా పెంచుతున్నాయి. మాస్ కాపీయింగ్ విపరీతమైంది. ఇంత విస్తృత వ్యవస్థలో ఫలితాల్ని మార్చాలంటే ప్రోత్సాహకాల్ని మనం పూర్తిగా మార్చాలి. అప్పుడు వ్యవస్థలోని భాగస్వాములందరి దిక్సూచి మారుతుంది. ఫలితాలను సాధించటానికి తల్లిదండ్రులు, పిల్లలు, టీచర్లు, యాజమాన్యాలు, కోచింగ్ పరిశ్రమ, ఎడ్యుటెక్ కంపెనీలు, సమాజం అందరూ తమను తాము పునర్నిర్దేశించుకుంటారు, తమ ప్రాథమ్యాలను మార్చుకుంటారు. మన దేశంలో విద్యకు డిమాండ్ కోణం చాలా బలంగా ఉంది. మనందరం మన పిల్లలకు విజయాన్ని కోరుకుంటున్నాం. కానీ సక్సెస్‌కు మనమిచ్చే నిర్వచనం భయంకరమైనది. తీవ్ర ఒత్తిడిని కలిగించే, బట్టీపట్టి ముక్కున పెట్టుకుని రాసే, చాలామేర నిరర్థకమైన పరీక్షలను కొలమానం అనుకుంటున్నాం. ఇప్పుడు సర్వత్రా వ్యాపించిన మాస్ కాపీయింగ్‌ను అనుమతిస్తూ విద్యలో విజయాన్ని ఫలితంలేని రీతిలో కొలుస్తున్నాం. మార్కులు, ర్యాంకులు, కళాశాలల్లో అడ్మిషన్‌కి మరిన్ని కటాఫ్ మార్కుల వేటలో మెరుగైన విద్యార్థులు, స్కూళ్లు సైతం తరచూ కాపీయింగ్ ఉచ్చులో చిక్కుకుంటున్నాయి. పోటీని తట్టుకుని నిలబడాలంటే బట్టీకొట్టి నేర్చుకోక తప్పదని వాళ్లూ భావించే పరిస్థితి ఎదురవుతోంది.

భాషను అర్థం చేసుకుని ఎదుటివారికి అర్థమయ్యేలా తమ భావాల్ని వ్యక్తీకరించటం, లెక్కలు, సైన్సులను కాన్సెప్ట్‌పరంగా అర్థం చేసుకోవటం, తర్కం, సమస్యల పరిష్కారం, భిన్న కోణాల్లో ఆలోచించే సామర్థ్యాలను పరీక్షల్లో బేరీజు వేయటం ద్వారా గనక మనం విజయాన్ని పునర్నిర్వచించగలిగితే, వ్యవస్థలోని భాగస్వాములందరూ విజయం కోసం కొత్తగా ఆలోచించటం, కొత్త నమూనాలో వ్యవహరించటం ప్రారంభిస్తారు. అటువంటి పరీక్షలు ఒత్తిడి లేకుండా ఉంటాయి (చివరి నిముషంలో హడావుడిగా చదువు మొదలుపెట్టటం, అర్ధరాత్రి వరకూ బట్టీపట్టటం వంటి వాటి వల్ల ఉపయోగం ఉండదు). ఓఈసీడీ దేశాల 'పీసా' పరీక్ష, అమెరికాలోని 'శాట్', లేదా బ్రిటన్‌లోని 'ఎ' లెవెల్స్ తరహాలో వాటిని రూపొందించవచ్చు. అటువంటి పరీక్షల్లో కాపీ కొట్టటాన్ని నిర్మూలించేందుకు పద్ధతులున్నాయి. ప్రతి విద్యార్థికీ ప్రశ్నల వరుస క్రమాన్ని మార్చటం, కాపీ కొడితే కనిపెట్టే అల్గారిథమ్స్‌ని రూపొందించటం మొదలైనవి. పరీక్షించే పద్ధతిని మనం ఒక్కసారి మారిస్తే, నిజమైన ఫలితాలు వచ్చేలా మిగతావాటన్నిటినీ మార్చేందుకు అవసరమైన ప్రోత్సాహకం లభిస్తుంది. విద్యలో మన వైఫల్యానికి భారీ మూల్యం చెల్లించాం. ఇప్పటికైనా మేలుకొంటే, బలమైన డిమాండ్, తమ పిల్లల విజయం పట్ల తల్లిదండ్రుల్లోని బలమైన ఆకాంక్ష వల్ల మనం పాఠశాల విద్యను వేగంగా మార్చగలం.














# A Viable Framework For Fiscal Prudence

**దేశ ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకు తీసుకోవాల్సిన విధాన చర్యలపై న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) నిర్వహించిన జాతీయ రౌండ్‌టేబుల్ సదస్సు చిత్రాలు**














RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th November, 2023 Posting Date 15 &16th of every month

# పాత పెన్షన్ విధానం వంటి విపరీత హామీల పార్టీల్ని తిరస్కరించండి..

# సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పార్టీలకు ఓటు వేయండి






తెలంగాణ అసెంబ్లీ తాజా ఎన్నికల్లో కొన్ని పార్టీలు సంక్షేమం పేరుతో భారీగా పథకాలు ప్రకటించాయి. వాటి అమలుకి ఇప్పుడు చేస్తున్న సంక్షేమ వ్యయానికి అదనంగా పదుల వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా. ఉన్న సంపదను తాత్కాలిక పథకాలతో పంచి ఎలాగోలా ఓట్లు సంపాదించాలనే ధోరణి తప్ప.. సంపద సృష్టి, రేపొద్దున తెలంగాణ ఏమవుతుంది, దేశం ఏమవుతుంది అన్న ఆలోచన వారిలో కనిపించటం లేదు. అభివృద్ధి గురించి మాటవరసకు కూడా ప్రస్తావన లేదు. దీంతోపాటు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేస్తామని కూడా ఆ పార్టీలు హామీ ఇచ్చాయి. పాత పెన్షన్ విధానంలో ఈ వేళ ఉద్యోగులకు బడ్జెట్‌లో రూపాయి కేటాయించరు, పీఆర్‌సీలతో జీతాలు పెంచినప్పుడల్లా పెన్షన్లు భారీగా పెరిగిపోతుంటాయి. పనిచేసేవారిలో కేవలం 3 శాతం ఉండే ప్రభుత్వోద్యోగులకు మాత్రమే పాత పెన్షన్ విధానం వర్తిస్తుంది. చట్టబద్ధంగా ప్రభుత్వాలు ఇవ్వాల్సిన పెన్షన్ కావటంతో ఈ వ్యయంతో ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో అప్పుల భారం పెరిగిపోయింది. భవిష్యత్తులో ఈ పెన్షన్ వల్ల అసలు ప్రభుత్వోద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి వస్తుంది. అమలులో అంతటి అసాధ్యమైన పెన్షన్ పద్ధతి అది. దీనివల్ల రాబోయే కాలంలో సంక్షేమ పథకాలు కూడా తగ్గిపోతాయి. ప్రభుత్వానికి ఆదాయం పెరిగితేనే గదా సంక్షేమం కూడా పెరిగేది! సంక్షేమం అవసరమే కానీ, అదే పరిపాలన కావటం ప్రమాదం. కాబట్టి సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటిస్తూ, ఆర్థికాభివృద్ధికి బాటలు వేసే పార్టీల మధ్యే వచ్చే ఎన్నికల్లో మీరు ఓటు వేయండి. ఆ పార్టీల నుంచే అభ్యర్థులను ఎన్నుకోండి. చట్టబద్ధపాలన, నాణ్యమైన ఆరోగ్యం, విద్య, అధికార వికేంద్రీకరణ, ఎన్నికల సంస్కరణలు వంటి పలు అంశాలున్నాయి. ఆ మౌలిక విషయాల్లో అన్ని పార్టీలూ ఒకేలా ఉన్నాయి, ఏ పార్టీ మధ్య తేడా లేదు. సమయం వచ్చినప్పుడు వాటి కోసం పోరాడదాం. ఈలోగా కనీసం ఆర్థికాభివృద్ధిని, బిడ్డల భవిష్యత్తుని కాపాడుకుందాం. ఆర్థికాభివృద్ధి లేకుండా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం బూటకం. అందుకే ఈ నెల 30న జరగనున్న రాష్ట్ర ఎన్నికల్లో అభివృద్ధి, భవిష్యత్తు తరాల గురించి పట్టించుకోకుండా తాత్కాలిక పథకాల్ని, ఓపీఎస్ వంటి హామీల్ని ఇచ్చే పార్టీల్ని ఓడించండి, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటించే పార్టీలకు ఓటు వేయండి.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020